www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 1-5-2025 | పేజీలు: 10+8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 15 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: చవితి ఉ.11.24 తదుపరి పంచమి; నక్షత్రం: మృగశిర మ. 2.21 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: రా.10.18-11.48; దుర్ముహూర్తం: ఉ.10.05-10.56, మ.3.09-4.00; అమృతఘడియలు: ఉ.6.15-7.44, తె 3.36-5.06; రాహుకాలం: మ.1.30-3.00; సూర్యోదయం: 5.52; సూర్యాస్తమయం: 6.31 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 1-5-2025 | పేజీలు: 10+8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 15 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: చవితి ఉ.11.24 తదుపరి పంచమి; నక్షత్రం: మృగశిర మ. 2.21 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: రా.10.18-11.48, దుర్ముహూర్తం: ఉ.10.05-10.56, మ.3.09-4.00, అమృతఘడియలు: ఉ.6.15-7.44, తె 3.36-5.06; రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 5.52, సూర్యాస్తమయం: 6.31 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

సింహాచలం చందనోత్సవంలో ఘోర విషాదం

- భారీ వర్షం, గాలులతో రిటైనింగ్ వాల్ కూలి ఏడుగురు భక్తుల దుర్మరణం
- 4 రోజుల కిందే నిర్మాణం.. నాసిరకంగా పనులు
- మృతుల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు
- వారిలో ఓ సాఫ్ట్‌వేర్ యువజంట కూడా..

5

పది.. పటాకా!

2

- 10వ తరగతి ఫలితాల్లో 92.78% ఉత్తీర్ణత
- గత ఏడాదితో పోలిస్తే 1.47 శాతం అధికం
- బాలికల్లో 94.26% ఉత్తీర్ణత.. బాలురు 91.32%
- 40 శాతం పాఠశాలల్లో 100% ఫలితాలు
- అధిక ఉత్తీర్ణతతో రికార్డు సాధించిన గురుకులాలు
- జూన్ 3-13 దాకా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ
- రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు 15 దాకా చాన్స్

దేశవ్యాప్తంగా కులగణన

తదుపరి జనాభా లెక్కలతో పాటు నిర్వహణ.. కేంద్ర క్యాబినెట్ కీలక నిర్ణయం

- కొన్ని రాష్ట్రాలు రాజకీయ కారణాలతో కులాల లెక్కలు తీశాయి.. అవి అసమగ్రం
- ఇలాంటి వాటితో సమాజంలో సందేహాలు
- ఈ నేపథ్యంలోనే కులగణనకు నిర్ణయం
- దేశంలో సామాజిక ఐక్యత దెబ్బతినకుండా ఉండాలన్న లక్ష్యమే ఇందుకు కారణం
- కులగణనకు కాంగ్రెస్ తొలినుంచీ వ్యతిరేకం
- మేం జరిపే జన, కులగణనతో దేశం పటిష్ఠం
- ఏ వర్గాన్నీ నొప్పించకుండా 10 శాతం ఈడబ్ల్యూఎస్ కోటాను మేం తీసుకొచ్చాం
- కేంద్ర సమాచార మంత్రి అశ్వినీ వైష్ణవ్
- సెప్టెంబరు నుంచి జన, కులగణన ప్రారంభం?



న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా కులగణనకు విపక్షాలు డిమాండ్ చేస్తున్న తరుణంలో.. మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకుంది. బుధవారం జరిగిన రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో.. జనాభా లెక్కలతోపాటే కులగణనను నిర్వహించాలని తీర్మానించారు. తెలంగాణ, కర్ణాటకల్లో కులగణన జరిపిన కాంగ్రెస్‌ను రాజకీయంగా తిప్పికొట్టేందుకు మోదీ ఆధ్వర్యంలోని క్యాబినెట్ కమిటీ(సీసీపీఏ) తీసుకున్న ఈ నిర్ణయం 'మాస్టర్ స్ట్రోక్' అని రాజకీయ వర్గాలు అభివర్ణిస్తున్నాయి. బీజేపీ మాత్రం.. దశాబ్దాలుగా కాంగ్రెస్ ఈ అంశాన్ని విస్మరించిందని విమర్శించగా.. కాంగ్రెస్ అగ్ర నేతలు తమ డిమాండ్ నెరవేరిందని వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధీ ఏకంగా మోదీ సర్కారు 'ఆకస్మిక నిర్ణయం' అని పేర్కొంటూ.. కులగణనను స్వాగతించారు. వామపక్షాలు మాత్రం ఇప్పటికే ఆలస్యం జరిగిందని ఆరోపించాయి. బీజేపీ మిత్రపక్షాలు మోదీ సర్కారు నిర్ణయాన్ని స్వాగతించాయి. దేశంలో 'సమ్మిళిత వృద్ధి' వేగం పుంజుకుంటుందని అభిప్రాయపడ్డాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది సెప్టెంబరులో జన, కులగణనను ప్రారంభించి.. రెండేళ్లలో ముగించనున్నట్లు తెలిసింది. బుధవారం నాటి క్యాబినెట్ భేటీ తర్వాత ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వివరాలను వెల్లడిస్తూ.. కాంగ్రెస్‌పై మండిపడ్డారు. తెలంగాణ, కర్ణాటకల్లో కాంగ్రెస్ పాలిత ప్రభుత్వాలు

మిగతా 7వ పేజీలో...

11 ఏళ్లుగా విస్మరించి..

7

- ఇప్పుడు నిర్ణయం తీసుకున్నారు
- ఐనా స్వాగతిస్తున్నాం: రాహుల్

తెలంగాణ చేసింది.. దేశం అనుసరిస్తోంది!

- ఇది రాహుల్ గాంధీ ఆలోచన
- ప్రధానికి ధన్యవాదాలు: సీఎం

చరిత్రాత్మక నిర్ణయం

7

- రాజకీయాలకు అతీతంగా మద్దతివ్వండి
- రాష్ట్ర ప్రభుత్వ సర్వే తప్పుల తడక
- బండి సంజయ్, లక్ష్మణ్, ఈటల

ఏ క్షణంలోనైనా పాక్‌పై దాడి?

సర్వసన్నద్ధమవుతున్న భారత్!

- అమెరికా, చైనా సహా పలు దేశాలకు పరిస్థితిని వివరించిన విదేశాంగ శాఖ
- పీ5 దేశాలతో జైశంకర్ చర్చలు
- తాలిబాన్ కూడా మనవైపే..
- సీసీఎస్ భేటీలో సైనిక సన్నద్ధతపై ప్రధాని సమీక్ష
- కీలక విన్యాసాలు ప్రారంభించిన త్రివిధ దళాలు
- జాతీయ భద్రతా సలహా బోర్డు పునర్వ్యవస్థీకరణ
- చైర్మన్‌గా 'రా' మాజీ చీఫ్ అలోక్ జోషి
- తెలుగు అధికారి వెంకటేశ్ వర్మకూ స్థానం
- మాపై నేడో, రేపో సైనిక దాడి
- మా దగ్గర విశ్వసనీయ సమాచారం ఉంది
- దాడి చేస్తే భారత్‌కు మూల్యం తప్పదు
- పాకిస్థాన్ సమాచార మంత్రి తరార్ వ్యాఖ్య



న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పేందుకు భారత్ సిద్ధమవుతోందా? ఏ క్షణంలోనైనా పాక్‌పై విరుచుకుపడేందుకు సన్నద్ధమవుతోందా? దాయాదికి గట్టి గుణపాఠం నేర్పనుందా? పహల్గాం ఉగ్రదాడికి బదులు తీర్చుకోనుందా? అంటే.. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్ని చూస్తే అవుననే సమాధానం వస్తుంది. పాకిస్థాన్ కూడా తమపై నేడో రేపో దాడి జరగడం తథ్యమని భావిస్తోంది. కాగా, 2018 నుంచీ పెద్దగా పనిలేకుండా ఉన్న జాతీయ భద్రతా సలహా బోర్డును మోదీ సర్కారు తాజాగా పునర్వ్యవస్థీకరించింది. 'రా' మాజీ చీఫ్‌ను చైర్మన్‌గా, ఆరుగురు కీలక అధికారులను

మిగతా 6వ పేజీలో...



వివాహ వేడుకలో సీఎం రేవంత్‌రెడ్డి

వివాహ వేడుకలో సీఎం రేవంత్ రెడ్డి

మొయినాబాద్ రూరల్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను సీఎం రేవంత్‌రెడ్డి ఆశీర్వదించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని బాకారం జాగీర్ గ్రామానికి చెందిన ఇమ్మడి రమ, చంద్రశేఖర్ దంపతుల కుమార్తె, కొడంగల్ నియోజకవర్గంలోని రేవంత్ రెడ్డి సమీప బంధువు తూర్పు సరళ, అచ్యుత్ రెడ్డిల కుమారుడు ఆదిత్యారెడ్డి వివాహం మండల పరిధిలోని హిమాయత్‌నగర్ పీవీ కన్వెన్షన్‌లో బుధవారం జరిగింది. ఈ వేడుకకు సీఎం హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

సమ్మెకు వెళ్లొద్దు, సమస్యలు పరిష్కరిస్తాం: పొన్నం

టీజీఎస్‌ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని, సమ్మెకు వెళ్లొద్దని యూనియన్లకు మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతోపాటు 21 ప్రధాన సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్లతో వచ్చే నెల 7వ తేదీ నుంచి సమ్మె చేపట్టనున్నట్లు ఆర్టీసీ జేఏసీ చేసిన ప్రకటనపై మంత్రి పొన్నం స్పందించారు. ఆర్టీసీ ఇప్పుడిప్పుడే లాభాల బాటలో నడుస్తోందని, ఏ సమస్యనైనా పరిష్కరించేందుకు రేవంత్ నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. పెండింగ్ బకాయిలు, టీఏ, డీఏలు చెల్లించడంతోపాటు ఆర్టీసీలో కొత్త నియామకాలు చేపట్టబోతున్నామని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో సమ్మె చేపడితే ఇబ్బందులు వస్తాయని పేర్కొన్నారు.

పంట వ్యర్థాల నుంచి బయోగ్యాస్ ఉత్పత్తి

▸ రైతులకు అదనపు ఆదాయం: మంత్రి తుమ్మల

పంట వ్యర్థాలను తగలబెట్టడంతో నేల ఆరోగ్యం క్షీణించడమే కాకుండా పంటల ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎరువులు, పురుగుమందుల వాడకం పెరుగుతున్న నేపథ్యంలో, వాటిని తగ్గించడంతోపాటు పంట వ్యర్థాల నుంచి బయోగ్యాస్ ఉత్పత్తి చేయడం ద్వారా సహజ వనరుల పరిరక్షణ జరుగుతుందని వివరించారు. ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు రైతులు పంట వ్యర్థాల నుంచి ఆదాయం పొందవచ్చని తెలిపారు. హైదరాబాద్‌లో బుధవారం దక్షిణాఫ్రికాకు చెందిన బయోవేస్ట్ ఎనర్జీ సంస్థ రాష్ట్రానికి చెందిన స్పాన్ టెక్ ఇంజినీర్స్, ఎకో మ్యాక్స్ ఎనర్జీ సంస్థల మధ్య పంట వ్యర్థాల నుంచి బయోగ్యాస్ ఉత్పత్తి చేసే ప్రాజెక్టుపై ఒప్పందం జరిగింది. కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, దక్షిణాఫ్రికా కాన్సులేట్ జనరల్ గిడెన్ లిబెన్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ... పంట వ్యర్థాలతో బయోగ్యాస్ ఉత్పత్తి చేసే ప్లాంట్ల ఏర్పాటుకు ముందుకొచ్చే కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని చెప్పారు. సుమారు రూ. 1,500 కోట్ల వ్యయంతో.. 20 బయోగ్యాస్ ప్లాంట్ల నిర్మాణానికి కంపెనీలు ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు.

ఉద్యోగాల్లేకనే యువత డ్రగ్స్‌కు బానిసలు

▸ సినిమా టెక్నీషియన్లకు న్యాక్‌లో శిక్షణ: మంత్రి కోమటిరెడ్డి

దేశంలో నిరుద్యోగం పెద్ద సమస్యగా మారిందని, ఉద్యోగాలు లేక యువత డ్రగ్స్‌కు బానిసలు అవుతున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. నేషనల్ అకాడమీఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)లో నిర్వహించిన కార్యక్రమంలో సినిమా కోర్సులు నేర్చుకున్న 22 మందికి సర్టిఫికెట్‌లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సినిమా రంగంలోని వివిధ రకాల టెక్నీషియన్లకు కూడా న్యాక్‌లో శిక్షణ ఇస్తామన్నారు. అంతకుముందు న్యాక్ భవనంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, సోలార్ రూఫ్‌టాప్, స్పేస్ అకాడమీ డబ్బింగ్ స్టూడియోను మంత్రి కోమటిరెడ్డి ప్రారంభించారు. ఆ తరువాత ఐసీఐసీఐ బ్యాంకుతో న్యాక్ కుదుర్చుకున్న ఒప్పంద కార్యక్రమంలోనూ పాల్గొన్నారు.

పౌరసరఫరాల సంస్థకు అంతర్జాతీయ గుర్తింపు

తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ఈ సంస్థ చేపట్టిన సంస్కరణలపై అధ్యయనం చేసిన హెచ్‌వైఎం అంతర్జాతీయ సంస్థ.. సన్నబియ్యం పంపిణీ, ఇతర మెరుగైన సేవలకు గుర్తింపుగా ఐఎస్‌వో సర్టిఫికెట్ అందించింది. ఐదు నక్షత్రాల రేటింగ్‌తో ఐఎస్‌వో-9001 సర్టిఫికెట్ ఇవ్వడం గమనార్హం.

భూ భారతి దరఖాస్తుల స్వీకరణ పూర్తి

కామారెడ్డి/ఖమ్మం/ములుగు/మహబూబ్‌నగర్, ఏప్రిల్ 30: భూ భారతి చట్టం ప్రయోగాత్మక అమలుకు ఎంపిక చేసిన నాలుగు మండలాల్లో బుధవారంతో దరఖాస్తుల స్వీకరణ పూర్తయింది. కామారెడ్డి జిల్లా లింగంపేట, ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, ములుగు జిల్లా వెంకటాపూర్, నారాయణపేట జిల్లా మద్దూరు మండలాల్లో ఈ నెల 17 నుంచి బుధవారం వరకు నిర్వహించిన సదస్సుల్లో రైతుల నుంచి వివిధ సమస్యలపై వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. లింగంపేటలో 3700, నేలకొండపల్లిలో 2,900, వెంకటాపూర్‌లో 4,555, మద్దూరులో 1,341 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. లింగంపేటలో అసైన్డ్ భూములు, కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలకు సంబంధించి ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. నేలకొండపల్లిలో వెయ్యి మందికి పైగా సాదా బైనామా సమస్యలను పరిష్కరించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పాత పాసు పుస్తకాలు తీసుకుని కొత్తవి ఇవ్వాలంటూ వెంకటాపూర్‌లో 900 మంది రైతులు అర్జీలు పెట్టుకున్నారు. మద్దూరులో అత్యధికంగా సర్వే నెంబర్ల సవరణ కోసం 491 దరఖాస్తులు అందాయి.

ఎంపీ వర్సెస్ ఎమ్మెల్యే?

నా నియోజకవర్గంలో మీ జోక్యమేంటి?

▸ కాంగ్రెస్ ఎంపీని ప్రశ్నించిన ఎమ్మెల్యే

▸ నన్ను ప్రశ్నించడానికి నువ్వెవరు?

▸ ఎమ్మెల్యేకు అంతే స్థాయిలో ఎంపీ జవాబు

▸ మంత్రి సమక్షంలో తీవ్ర వాగ్వాదం

మహబూబ్‌నగర్ , ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఒకరు కాంగ్రెస్ పార్టీలో సీనియర్ ఎంపీ. మరొకరు ఆ ఎంపీ ప్రాతినిధ్యం వహిస్తున్న లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని ఎమ్మెల్యే. కాగా, ఇటీవల ఈ ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగినట్లు, ఓ మంత్రి సమక్షంలోనే వీరిద్దరూ ఒకరిపై ఒకరు తీవ్ర ఆవేశంతో ఊగిపోయినట్లు పేర్కొంటూ ఓ వార్త సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. పది రోజుల క్రితం.. భూభారతి చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించేందుకు సంబంధిత మంత్రి ఆ నియోజకవర్గ కేంద్రానికి వెళ్లారు. ఆయనకు స్వాగతం పలికేందుకు స్థానిక ఎమ్మెల్యేతోపాటు కాంగ్రెస్ నాయకులు కూడా హాజరయ్యారు. అయితే ఆ ఎమ్మెల్యే చేతిలో ఓడిపోయిన అభ్యర్థితోపాటు.. ఆ వర్గం వారికి సదరు ఎంపీ ప్రాధాన్యం ఇవ్వడం, వారిని మంత్రికి పరిచయం చేసే కార్యక్రమానికి హాజరు కావాలని సూచించడాన్ని ఆ ఎమ్మెల్యే నిశితంగా గమనించారు. అనంతరం మంత్రి వాహనంలోకి ఎమ్మెల్యే, ఎంపీతోపాటు ఏఐసీసీలో కీలక బాధ్యతలో ఉన్న ఓ నాయకుడు ఎక్కారు. అయితే.. వాహనంలోకి ఎక్కిన వెంటనే ఎమ్మెల్యే, ఎంపీ మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకున్నట్లు తెలిసింది. "నా నియోజకవర్గంలో జోక్యం చేసుకోవడానికి మీరెవరు?" అంటూ ఎమ్మెల్యే తీవ్ర స్వరంతో ఎంపీని ప్రశ్నించినట్లు సమాచారం. దీంతో ఎంపీ కూడా అంతే స్వరంతో మాట్లాడుతూ, "నన్ను ప్రశ్నించడానికి నువ్వెవరు? ఇది నా నియోజకవర్గం. నాకు ఓట్లు వేసి గెలిపించిన వారికి బరాబర్ మద్దతిస్తా. నువ్వేమైనా ఓటు వేశావా?" అంటూ ఎదురు ప్రశ్నించినట్లు తెలిసింది. ఒక దశలో ఇద్దరూ తీవ్ర ఆవేశంతో ఊగిపోయారని సమాచారం మంత్రి సమక్షంలోనే ఇదంతా జరగడంతో ఆయన విస్తుపోయినట్లు, మధ్యలో కూర్చున్న ఏఐసీసీ నాయకుడు ఇద్దరినీ శాంతింపజేసినట్లు తెలిసింది. అయితే ఈ ఘటనను అటు ఎమ్మెల్యేగానీ, ఇటు ఎంపీ గానీ బహిర్గతం చేయకపోయినా.. తమ అనుంగు అనుచరులతో విషయాన్ని పంచుకోవడంతో బయటకు పొక్కినట్లు తెలుస్తోంది.

పది.. పటాకా!

10వ తరగతి ఫలితాల్లో 92.78% ఉత్తీర్ణత

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మాదిరిగానే పదో తరగతి ఫలితాల్లోనూ విద్యార్థులు అదరగొట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 5లక్షలపైగా విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవ్వగా.. రికార్డు స్థాయిలో 92.78% మంది ఉత్తీర్ణత సాధించారు. ఇది గతేడాదితో పోలిస్తే 1.47% అధికం. గత నెల మార్చి 21 నుంచి ఏప్రిల్ 3 వరకు జరిగిన పరీక్షలకు 4,96,374 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏటా మాదిరిగానే ఈసారీ బాలురతో పోలిస్తే బాలికలు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. రాష్ట్ర వ్యాప్తంగా 94.26% మంది బాలికలు ఉత్తీర్ణత సాధిస్తే.. బాలల ఉత్తీర్ణత శాతం 91.32కే పరిమితమైంది. జిల్లాల వారీగా ఫలితాలు పరిశీలిస్తే మహబూబాబాద్ 99.29%తో అగ్రస్థానంలో ఉండగా.. ఆ తర్వాతి స్థానాల్లో సంగారెడ్డి, జనగామ, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాలు నిలిచాయి. 73.97% ఉత్తీర్ణతతో మూడో సారీ వికారాబాద్ జిల్లా చిట్టచివరి స్థానంలో నిలిచింది. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి బుధవారం పదో తరగతి ఫలితాలను విడుదల చేశారు. గురుకుల విద్యాసంస్థల్లో ఉత్తీర్ణత శాతం ఈ సారి భారీగా పెరిగింది. 98.79శాతం ఉత్తీర్ణతతో తెలంగాణ రెసిడెన్షియల్ గురుకులాల సంస్థ ప్రథమ స్థానంలో నిలవగా, ఆ తర్వాతి స్థానాల్లో బీసీ సంక్షేమ గురుకులాలు(97.79%), సాంఘిక సంక్షేమ గురుకులాలు(97.71%), గిరిజన గురుకులాలు(97.63%), మైనార్టీ గురుకులాలు(96.57%) నిలిచాయి. ఇక, ప్రభుత్వ పాఠశాలల్లో అతి తక్కువ ఉత్తీర్ణత నమోదైంది. సర్కారు పాఠశాలలకు చెందిన మొత్తం 22,079 మంది పరీక్షలకు హాజరవ్వగా.. 18,729 (84.83%) మంది మాత్రమే పాసయ్యారు. జిల్లా పరిషత్ పాఠశాలల్లో 1,35,849 మందికి 1,21,089 మంది(89.13%), ప్రైవేటు పాఠశాలల్లో 2,36,311 మందికి 2,22,633(94.21%) మంది పాసయ్యారు. కేజీబీవీల్లో 94.42శాతం, ఆశ్రమ పాఠశాలల్లో 95శాతం, ఆదర్శ పాఠశాలల్లో 95.31 శాతం ఉత్తీర్ణత నమోదైంది. రాష్ట్ర వ్యాప్తంగా 11,554 పాఠశాలలు ఉండగా.. 4,629(40.06%) పాఠశాలలు పూర్తి ఉత్తీర్ణత సాధించాయి. రెండు ప్రైవేట్ స్కూళ్లలో మాత్రం ఏ ఒక్కరూ పాస్ కాలేదు.



టెన్త్ ఫలితాలను విడుదల చేస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం

తెలుగులో 6,827 మంది ఫెయిల్

పదో తరగతి పరీక్షల్లో మొత్తం 48,558మంది ఫెయిల్ అయ్యారు. గణితం, సామాన్య శాస్త్రం తర్వాత తెలుగులోనూ చాలా మంది ఉత్తీర్ణత సాధించలేకపోయారు. గణితంలో 18,975 (3.82%) మంది, సామాన్య శాస్త్రంలో 15,548 (3.13%) మంది, ప్రథమభాషగా ఉన్న తెలుగులో 6,827 (1.38%) మంది పాస్ మార్కులు సాధించలేకపోయారు. తృతీయ భాష ఆంగ్లంలో 4,015 (0.81%), ద్వితీయ భాష హిందీలో 357 (0.7%) మంది ఫెయిల్ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆంగ్ల మాధ్యమంలో 4,35,138 మంది పరీక్షలు రాయగా.. 4,09,068 (94.01%) మంది ఉత్తీర్ణత సాధించారు. తెలుగు మాధ్యమంలో 53,559 మంది పరీక్షలు రాయగా.. 44,698 మంది ఉత్తీర్ణత సాధించారు. ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాలతో పోలిస్తే తెలుగు మాధ్యమంలో అత్యల్పంగా 83.46శాతం ఉత్తీర్ణత నమోదైంది. తాజా ఫలితాల్లో ఫెయిలైన విద్యార్థుల కోసం జూన్ 3వ తేదీ నుంచి 13వ తేదీ వరకు అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ఆయా తేదీల్లో ఉదయం 9-30 నుంచి మధ్యాహ్నం 12-30 వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్ష ఫీజును 16లోపు చెల్లించాల్సి ఉంటుంది. ఇక, మార్కుల రీకౌంటింగ్. రీ-వెరిఫికేషన్‌తోపాటు సమాధానపత్రాల నకలు కావాలనుకునే వారు ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో సబ్జెక్టుకు రీ కౌంటింగ్‌కు రూ.500, రీవెరిఫికేషన్‌కు రూ. 1000 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది.



596 మార్కులు సాధించిన సిర్పా కృతి, అనిశ్చిత

జిల్లాలవారీగా ఉత్తీర్ణత..

జిల్లా	విద్యార్థులు	పాసైనవారు	శాతం
మహబూబాబాద్	8184	8126	99.29
సంగారెడ్డి	22374	22170	99.09
జనగామ	6234	6160	98.81
జగిత్యాల	11849	11636	98.2
సిరిసిల్ల	6754	6629	98.15
కరీంనగర్	12508	12245	97.9
భువనగిరి	8622	8432	97.8
ములుగు	3134	3060	97.64
ఆదిలాబాద్	10028	9767	97.4
పెద్దపల్లి	7387	7157	96.89
నల్లగొండ	18636	18054	96.88
మెదక్	10370	10045	96.87
నాగర్ కర్నూల్	10530	10196	96.83
సూర్యాపేట	11887	11508	96.81
నిర్మల్	9123	8822	96.7
నిజామాబాద్	22694	21928	96.62
మంచిర్యాల	9179	8861	96.54
హనుమకొండ	12007	11542	96.13
నారాయణపేట్	7618	7251	95.18
కామారెడ్డి	12542	11871	94.65
ఖమ్మం	16391	15485	94.47
భూపాలపల్లి	3443	3221	93.55
వరంగల్	9225	8588	93.09
మహబూబ్‌నగర్	12737	11706	91.91
సిద్దిపేట	14114	12955	91.79
గద్వాల	7569	6944	91.74
కొత్తగూడెం	12250	11208	91.49
మేడ్చల్	47235	42870	90.76
వనపర్తి	6842	6104	89.21
హైదరాబాద్	73911	65436	88.53
రంగారెడ్డి	51671	45386	87.84
ఆసిఫాబాద్	6480	5654	87.25
వికారాబాద్	12846	9502	73.97
మొత్తం	496374	460519	92.78

అత్యధిక మార్కులు వచ్చిన వారు	మార్కులు
సిర్పా కృతి, నిజామాబాద్	596
నిమ్మ అనిశ్చిత, కామారెడ్డి	596
సముద్రాల అద్వైత్, రంగారెడ్డి	595
శ్రీపాద సాయి సృజన, సూర్యాపేట	595
ఏ.శ్రీమారెడ్డి, మేడ్చల్	594
గాండు జోషిత హైదరాబాద్	594
ఎస్.అయుష్ ఇన్నాని, హైదరాబాద్	594
వీరన్నగారి రాజశ్రీ, హైదారాబాద్	594
మహమ్మద్ వసీం ఖ్వాజా, రంగారెడ్డి	594
గట్టుపల్లి శ్రీజ, రంగారెడ్డి	594

కేఎల్‌హెచ్ విద్యార్థికి రూ.75లక్షల ప్యాకేజీ

▸ మరికొందరికి రూ.20-50 లక్షల దాకా ప్యాకేజీలు

▸ 3న సక్సెస్ మీట్: క్యాంపస్ డైరెక్టర్ ఆకెళ్ల రామకృష్ణ

హైదరాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి) : క్యాంపస్ ప్లేస్‌మెంట్లలో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్యాకేజీలతో ఉద్యోగాలు సాధించారని కేఎల్‌హెచ్ యూనివర్సిటీ హైదరాబాద్ క్యాంపస్ డైరెక్టర్ ఆకెళ్ల రామకృష్ణ తెలిపారు. క్యాంపస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది తమ విద్యార్థి రూ.75 లక్షల వార్షిక ప్యాకేజీతో ప్లేస్‌మెంట్ సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. అలాగే, పలువురు విద్యార్థులు రూ. 20-50 లక్షల దాకా వేతన ప్యాకేజీలతో ఎంపికయ్యారని వివరించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఈనెల 3న క్యాంపస్ ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్ నిర్వహిస్తున్నామని తెలిపారు. జర్మనీ, జపాన్, సింగపూర్, దుబాయ్, మలేషియా వంటి దేశాల్లో పలువురికి ఉద్యోగ అవకాశాలు లభించాయని పేర్కొన్నారు. ఇందులో గూగుల్, జేపీ మోర్గాన్‌తోపాటు అనేక ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొంటున్నారని డైరెక్టర్ అన్నారు.

'త్రివేణి' విద్యార్థుల హవా

హైదరాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో త్రివేణి విద్యాసంస్థల విద్యార్థులు.. మార్కుల హవా కొనసాగించారు. తమ పాఠశాల విద్యార్థికి అత్యధికంగా 593 మార్కులు వచ్చాయని త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరో విద్యార్థి 590, ముగ్గురు విద్యార్థులు 587, నలుగురు విద్యార్థులు 586 మార్కులు సాధించి.. సత్తా చాటారని పేర్కొన్నారు. 61 మందికి 570పైగా, 200 మందికి 550పైగా మార్కులు వచ్చాయని వివరించారు.



దీక్షిత్ రెడ్డి | హాసిని | శివచరణ్

మనస్విని | మణివర్ధన్ రెడ్డి | శివ ప్రియ

'ఎస్ఆర్' విద్యార్థుల విజయ విహారం

హనుమకొండ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు విజయభేరి మోగించారు. 600 మార్కులకు జరిగిన పరీక్షల్లో ఎస్ఆర్ విద్యార్థులు సక్కర శివప్రియ 586, డి.దీక్షితారెడ్డి 586, ఎం.మనస్విని 585, మణివర్ధన్ 584, శివచరణ్ 584, వి.హాసిని 584 మార్కులు సాధించారు. మొత్తం 23 మంది విద్యార్థులు 580పైగా మార్కులు సాధించి సంచలనం సృష్టించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి మాట్లాడుతూ ఒత్తిడి లేని వాతావరణంలో, క్రమశిక్షణ, సృజనాత్మకతతో కూడిన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి వరదారెడ్డి, విద్యాసంస్థల డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి అభినందనలు తెలిపారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న భాష్యం జడ్ఈవో శిరీష, సీఈవో చైతన్య తదితరులు

భాష్యం విద్యార్థుల ప్రభంజనం

అమీర్‌పేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో ఎస్ఆర్ నగర్‌లోని భాష్యం పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. పాఠశాలకు చెందిన బి.సూర్యరిషి అత్యధికంగా 593 మార్కులు సాధించగా, జె.ఆదిత్య 592, ఎస్.లాస్యశ్రీ 592, ఇ.రక్షిత్ 591, ఆర్. కిరణ్‌కుమార్ 591, పి. ఉత్కర్ష్‌రెడ్డి 591, వై. నమ్రతసాయి 590, పి.బాలు 590, కె.అభిజ్ఞ 590 మార్కులు సాధించారు. 103 మందికి 580పైగా, 278 మందికి 570పైగా మార్కులు వచ్చాయి. ఈ సందర్భంగా భాష్యం పాఠశాల జడ్ఈవో శిరీష మాట్లాడుతూ విద్యార్థుల క్రమశిక్షణ, ఉపాధ్యాయుల కృషి ఫలితాంగానే అద్భుత విజయం సాధించగలిగామన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ అభినందించారు.



పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులతో శ్రీ చైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ

శ్రీచైతన్య విజయకేతనం

హైదరాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యా సంస్థల విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారు. తమ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థిని అత్యధికంగా 594 అత్యధిక మార్కులు సాధించిందని శ్రీచైతన్య స్కూల్ డైరెక్టర్ సీమ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరో ముగ్గురు విద్యార్థులు 593 మార్కులు సాధించి.. ప్రతిభ చాటారని పేర్కొన్నారు. అలాగే, 374 మంది 580పైగా, 3969 మంది 550 పైబడి మార్కులు సాధించారని వెల్లడించారు. తమ విద్యార్థులు ఇంగ్లిషులో 10,866, సోషల్‌లో 10,320, సెకండ్ లాంగ్వేజ్‌లో 10,158, సైన్స్‌లో 9,983, మ్యాథ్స్‌లో 9,898, ఫస్ట్ లాంగ్వేజ్‌లో 9,786 మంది 'ఏ' గ్రేడ్ సాధించారని పేర్కొన్నారు. తమ విద్యా సంస్థల నుంచి మొత్తం 11,482 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 99.3శాతం ఉత్తీర్ణత నమోదైందని వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు.



టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన నారాయణ విద్యార్థులు

'నారాయణ' విజయభేరి

హైదరాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో నారాయణ విద్యా సంస్థలు విజయభేరి మోగించాయి. నారాయణ పాఠశాల విద్యార్థి శ్రీమారెడ్డి అత్యధికంగా 594 మార్కులు సాధించారని ఆ విద్యాసంస్థల డైరెక్టర్లు పి.సింధూర నారాయణ, శరణి నారాయణ, కోర్ కమిటీ సభ్యురాలు రమా నారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరో ముగ్గురు విద్యార్థులు 593, 593, 592 మార్కులు సాధించారని వెల్లడించారు. అలాగే, 22మందికి 590పై మార్కులు సాధించారని పేర్కొన్నారు. గణితంలో 5909, సైన్స్‌లో 5702, సోషల్‌లో 6,485, ఇంగ్లిషులో 7,124, ఫస్ట్ ల్యాంగ్వేజ్‌లో 5,789, సెకండ్ లాంగ్వేజ్‌లో 5,867 మంది 'ఏ' గ్రేడ్ సాధించారని వివరించారు. రాష్ట్రంలోని తమ విద్యా సంస్థల నుంచి 8059 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా.. 99.4శాతం ఉత్తీర్ణత సాధించామని వెల్లడించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను వారు అభినందించారు.

ప్రతిభ చాటిన 'కేశవరెడ్డి'

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో కేశవరెడ్డి విద్యాసంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇటీవల ఏపీ, తాజాగా తెలంగాణలో తమ పాఠశాల విద్యార్థులు 597, 596, 595, 594, 592, 591 మార్కులతో రికార్డు సృష్టించారని కేశవరెడ్డి విద్యాసంస్థల వ్యవస్థాపకుడు ఎన్.కేశవరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం విద్యార్థుల్లో 60శాతానికి పైగా విద్యార్థులు అన్ని సబ్జెక్టుల్లో 'ఏ' గ్రేడులు సాధించారని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థిని విజేతగా నిలిపేందుకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని వెల్లడించారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు.

నేటి నుంచి జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు, గురుకుల జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలకు ఇంటర్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. మే 1వ తేదీ నుంచి మొదటి విడత ప్రవేశాలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ప్రకటించింది. మే 31 వరకు దరఖాస్తుల స్వీకరించి, జూన్ 30లోగా మొదటి విడత ప్రవేశాల ప్రక్రియ ముగించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. రెండో విడత ప్రవేశ ప్రక్రియ తేదీలను త్వరలో ప్రకటిస్తామని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో ప్రవేశాల భర్తీ రిజర్వేషన్ ఆధారంగా ఉంటుందన్నారు.

రాహుల్‌గాంధీ కుటుంబానికి ఆర్ఎస్ఎస్, బీజేపీలు బద్ధ శత్రువులే కదా!

▸ విధానపరంగా బద్ధ శత్రువులు కలుస్తారా?

▸ హరీశ్‌కు ఆ మాత్రం జ్ఞానం కూడా లేదా?

▸ రేవంత్, ఉత్తమ్‌లు ఎన్‌డీఎస్‌ఏ నివేదికనే చెబుతున్నరు

▸ బీజేపీతో రాజకీయ సంసారం చేసింది కేసీఆరే

▸ తెలంగాణ ఏర్పాటులో మీరాకుమార్‌ది కీలక పాత్ర కాదా!

▸ ఆమెను కాదని రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీకి ఓటేయలేదా?

▸ కరెన్సీ నోటుపైన గాంధీ బొమ్మనూ తీసేందుకు బీజేపీ కుట్ర

▸ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి



ఎంపీ అనిల్ కుమార్‌తో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ.. ఆ పార్టీ పుట్టకముందున్న ఆర్‌ఎస్‌ఎస్‌లు రాహుల్ గాంధీ కుటుంబానికి బద్ధ శత్రువులన్న కనీస జ్ఞానం.. హరీశ్ రావుకు లేదా అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. విధానపరంగా బద్ధ శత్రువులైన బీజేపీ, కాంగ్రెస్‌లు కలుస్తాయని ఎలా అనుకుంటున్నారని నిలదీశారు. ట్రబుల్ షూటర్ అంటూ బిరుదులు తెచ్చుకున్న హరీశ్.. ఇంత చిన్న లాజిక్‌ను ఎలా మిస్సయ్యాడని ఎద్దేవా చేశారు. మతం మీద రాజకీయం చేసేది బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లైతే.. అన్ని మతాలూ సమానమనేది కాంగ్రెస్ విధానమని చెప్పారు. బుధవారం గాంధీభవన్‌లో ఎంపీ అనిల్ కుమార్‌తో కలిసి మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. గల్లీ నుంచి ఢిల్లీ వరకు కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటి అయ్యే అవకాశమే లేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి ఇంజనీరు, మేస్త్రీ.. ఆఖరికి సాయిల్ టెస్టింగ్ చేసేది కూడా కేసీఆర్, హరీశ్ రావులే అన్నట్లుగా యాక్టింగ్ చేశారని చెప్పారు. "వైఎస్ఆర్ హయాంలో తుమ్మిడిహెట్టి దగ్గర ప్రాజెక్టు కట్టాలనుకున్నారు. అప్పుడు నేను, ఇన్నయ్య అక్కడికి వెళ్లి పడవలో తిరిగి చూశాము. అప్పటి ఇంజనీరు హనుమంతరావు ప్రతిపాదన ప్రకారం లిఫ్టులు ఎక్కడ అవసరమో అక్కడ పెట్టారు. కిలోమీటర్ల మేర గ్రావిటీతోనే నీళ్లు వచ్చే పరిస్థితి ఉంది. అయితే ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆమోద ముద్ర వేసిన హనుమంతరావు ప్రతిపాదనను కేసీఆర్ తుంగలోకి తొక్కారు. తుమ్మిడిహెట్టి నుంచి గ్రావిటీతో వచ్చే నీళ్లను వదిలి లిఫ్టులు పెట్టాడు. తప్పుడు ప్లానింగ్‌తో ప్రజల సొమ్మును వృథా చేసి.. నిందలు సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్‌లపైన వేస్తే ఎలా" అంటూ నిలదీశారు. వారేమీ సొంత కవిత్వం చెప్పట్లేదని, ఎన్డీఎస్ఏ ఇచ్చిన నివేదికనే చెప్పారన్నారు.

మెదక్‌లో బీజేపీ ఎలా గెలిచింది?

బీజేపీతో రాజకీయంగా చాటుమాటు సంసారం చేసింది కేసీఆర్ కుటుంబమేనని జగ్గారెడ్డి ఆరోపించారు. మోదీ ప్రేమ ఉంటే చాలంటూ గజ్వేలు సభలో కేసీఆర్ వ్యాఖ్యలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. మెదక్ పార్లమెంటు స్థానంలో అయితే బీఆర్ఎస్, లేకుంటే కాంగ్రెస్ గెలవాల్సి ఉందని, కానీ బీజేపీ ఎలా గెలిచిందని హరీశ్ రావును ప్రశ్నించారు. తెలంగాణ ఏర్పాటులో కీలక పాత్ర పోషించిన మీరాకుమార్‌ను కాదని, రాష్ట్రపతి ఎన్నికల్లో బీజేపీకి ఓటేసిన వాళ్లు తమపైన మాట్లాడతారా? అని మండిపడ్డారు. బీజేపీ గెలిచినా పర్వాలేదు.. కాంగ్రెస్ రావద్దన్నదే కేసీఆర్ ఆలోచనని, అందుకే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ క్యాడర్ మొత్తం బీజేపీ అభ్యర్థులకు ఓట్లు వేసిందని ఆరోపించారు. రాహుల్‌గాంధీపై బీజేపీ కుట్ర పన్నిందని, కరెన్సీ నోటులో గాంధీ బొమ్మనూ తీసేందుకు కుట్ర జరుగుతోందని జగ్గారెడ్డి ఆరోపించారు.

కాళేశ్వరం ఈఎన్‌సీ హరిరామ్‌పై సస్పెన్షన్ వేటు

- ఇటీవలే ఆయనపై ఏసీబీ దాడి.. రూ.200 కోట్ల ఆస్తులు గుర్తింపు
- ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టు
- కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిన హరిరామ్

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన కాళేశ్వరం (గజ్వేల్) ఈఎన్‌సీ బి.హరిరామ్‌ను రాష్ట్ర ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ మేరకు బుధవారం నీటి పారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా ఉత్తర్వులు విడుదల చేశారు.



సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు ఏదైనా కేసులో అరెస్టై, రిమాండ్‌కు వెళితే.. వారిని 48 గంటల్లోపు విధుల నుంచి సస్పెండ్ చేస్తారు. ఇందులో భాగంగానే హరిరామ్‌పై చర్యలు తీసుకున్నారు. ఈఎన్‌సీ హరిరామ్ ఇంటితో పాటు మరో 14 చోట్ల ఏసీబీ ఈనెల 26న దాడులు చేసి, భారీగా ఆస్తులను గుర్తించిన విషయం తెలిసిందే. మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ఉన్న మర్కూక్ మండలంలోనే హరిరామ్‌కు 28 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నట్టు గుర్తించారు. షేక్‌పేట్, కొండాపూర్‌లలో విల్లాలు.. శ్రీనగర్ కాలనీలో రెండు ఇళ్లు, మాదాపూర్, శ్రీనగర్ కాలనీ, నార్సింగ్‌లలో ఫ్లాట్లు, ఏపీ రాజధాని అమరావతిలో వాణిజ్య స్థలం, పటాన్‌చెరులో 20 గుంటల భూమి, బొమ్మలరామారంలో 6 ఎకరాల మామిడి తోట, కొత్తగూడెంలో నిర్మాణంలో ఉన్న ఒక భవనం, కుత్బుల్లాపూర్, మిర్యాలగూడలలో ఓపెన్ ప్లాట్లు ఉన్నట్టు తేల్చారు. బంగారు అభరణాలు, బ్యాంకు డిపాజిట్లను కూడా గుర్తించారు. హరిరామ్ అధికారాన్ని అడ్డుపెట్టుకొని భారీగా ఆస్తులు పోగేశారని ఏసీబీ ప్రకటించింది. ఆ ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.200 కోట్లపైనే ఉంటుందని అంచనా వేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ వ్యయం సుమారు రూ.1.47 లక్షల కోట్లుకాగా.. అందులో రూ.48,665 కోట్ల విలువైన పనులు హరిరామ్ పర్యవేక్షణలోనే జరిగాయని ప్రభుత్వం గుర్తించింది. నిజానికి హరిరామ్ మొదట్లో ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు సీఈగా పనిచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రీ-ఇంజనీరింగ్ పేరుతో ఆ ప్రాజెక్టు స్థానంలో కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టింది. ఈ ప్రాజెక్టు డీపీఆర్‌కు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నుంచి అనుమతుల కోసం ప్రాజెక్టు ప్రపోనెంట్ హోదాలో హరిరామ్ దరఖాస్తు చేయడం గమనార్హం. కాళేశ్వరం ఇరిగేషన్ ప్రాజెక్టు కార్పొరేషన్ లిమిటెడ్ (కేఐపీసీఎల్) ఎండీ హోదాలో ప్రాజెక్టుకు భారీగా రుణాల సమీకరణలోనూ కీలకంగా వ్యవహరించారు..

ఒక్కరోజు ఈఎన్‌సీగా పీవీఏ ప్రసాద్

గజ్వేల్ ఈఎన్‌సీ హరిరామ్ సస్పెన్షన్ నేపథ్యంలో.. ప్రభుత్వం చీఫ్ ఇంజనీర్ (సీఈ) పీవీఏ ప్రసాద్‌కు ఈఎన్‌సీగా పూర్తి అదనపు బాధ్యతలు కట్టబెట్టింది. పీవీఏ ప్రసాద్ ఈ బాధ్యతలు స్వీకరించి, గురువారం సాయంత్రమే పదవీ విరమణ చేశారు. దాంతో గజ్వేల్ ఈఎన్‌సీ పోస్టు మళ్లీ ఖాళీ అయింది.

సీఎం ముఖ్యకార్యదర్శిగా కేఎస్ శ్రీనివాసరాజు

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి నియామకం.. ఢిల్లీలోని తెలంగాణ భవన్ స్పెషల్ సీఎస్‌గా శశాంక్ గోయెల్

- డీసీఏ డీజీగా షానవాజ్ ఖాసీం బదిలీ
- పీసీసీఎఫ్‌గా సువర్ణ.. డోబ్రియాల్ రిటైర్డ్
- రిటైర్డ్ కమలాసన్‌రెడ్డికి ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఓఎస్‌డీగా బాధ్యతలు

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయ ముఖ్యకార్యదర్శిగా రిటైర్డ్ ఐఏఎస్ అధికారి కేఎస్ శ్రీనివాసరాజు నియమితులయ్యారు. ఈ పదవిలో ఆయన రెండేళ్ల పాటు కొనసాగనున్నారు. ఆయనతోపాటు పలువురు అఖిల భారత సర్వీసు అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బుధవారం వివిధ పోస్టుల్లో నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బుధవారం పదవీ విరమణ పొందడానికి ముందు శాంతికుమారి వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, సీఎం ముఖ్య కార్యదర్శిగా నియమితుడైన శ్రీనివాసరాజు గతంలో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ ముఖ్యకార్యదర్శిగా, అంతకుముందు తిరుమల తిరుపతి దేవస్థానం జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (జేఈవో)గా పనిచేశారు. రాష్ట్ర విభజనతో ఆయన ఏపీకి వెళ్లగా, ఇంటర్ క్యాడర్ డిప్యుటేషన్‌లో భాగంగా 2020 మే 5న తెలంగాణకు వచ్చారు. 2024 మే 31న డిప్యుటేషన్ పూర్తి కావడంతో ఏపీ ప్రభుత్వానికి రిపోర్టు చేశారు. అక్కడ


శ్రీనివాసరాజు


సువర్ణ


షానవాజ్ ఖాసీం

కొద్దిరోజులకే స్వచ్ఛంద పదవీ విరమణ కోసం దరఖాస్తు చేసుకోగా.. ఏపీ ప్రభుత్వం ఆమోదించింది. అనంతరం 2024 జూలై 1న తెలంగాణ ప్రభుత్వ సలహాదారు (మౌలిక సదుపాయాలు, ప్రాజెక్టులు)గా నియమితులై.. ఇప్పటిదాకా కొనసాగారు. కాగా, ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంవో)లో పనిచేస్తున్న సంగీత సత్యనారాయణ, షానవాజ్ ఖాసీం బదిలీ అయ్యారు. మరో అధికారి చంద్రశేఖర్‌రెడ్డి కూడా ఆర్‌టీఐ చీఫ్ కమిషనర్‌గా వెళ్లనున్నారు. ఇలా ముగ్గురు అధికారులు వెళ్లడంతో మూడు ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం శ్రీనివాసరాజును సీఎంవోలోకి తీసుకోగా.. త్వరలో మరో అధికారిని కూడా తీసుకునే అవకాశం ఉందని తెలిసింది.

శశాంక్ గోయల్ మళ్లీ బదిలీ..

సీనియర్ ఐఏఎస్ అధికారి శశాంక్ గోయెల్ (1990 బ్యాచ్) మళ్లీ బదిలీ అయ్యారు. ఆదివారమే ఆయనను ఎంసీహెచ్‌ఆర్‌డీ డీజీ పోస్టు నుంచి బదిలీ చేసి.. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సీజీజీ) వైస్ చైర్మన్‌గా నియమించిన ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధన సంస్థ(ఈపీటీఆర్ఐ) డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు కూడా అప్పగించింది. అయితే బుధవారం ఆయనను ఇక్కడి నుంచి బదిలీ చేసి ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమించింది. తెలంగాణ భవన్‌కు ఇప్పటికే మరో ఐఏఎస్ అధికారి గౌరవ్ ఉప్పల్ రెసిడెంట్ కమిషనర్‌గా కొనసాగుతున్నారు. అయితే గౌరవ్ ఉప్పల్‌ను అక్కడే కొనసాగిస్తారా? లేక బదిలీ చేస్తారా? అన్నదానిపై ప్రభుత్వం స్పష్టతనివ్వలేదు. ఇక రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో సీఎంవోలో కార్యదర్శి హోదాలో నియమితుడైన 2003 బ్యాచ్ ఐపీఎస్ అధికారి షానవాజ్ ఖాసీంను కూడా బదిలీ చేసింది. ఆయనను డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్(డీసీఏ) డైరెక్టర్ జనరల్‌గా నియమించింది. ఎక్సైజ్ శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇప్పటివరకు డీసీఏ డీజీగా, ఎక్సైజ్ డైరెక్టర్‌గా ఉన్న వీబీ కమలాసన్‌రెడ్డి బుధవారం రిటైరయ్యారు. అయితే రిటైర్ అయిన వెంటనే ఆయనను ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ ఓఎస్‌డీగా ప్రభుత్వం నియమించింది. ఈ పోస్టులో ఆయన రెండేళ్లపాటు కొనసాగుతారని తెలిపింది. దీంతోపాటు తెలంగాణ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ డైరెక్టర్‌గా కమలాసన్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఇక రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన రామకృష్ణారావు.. మొదటి ఉత్తర్వులను కమలాసన్‌రెడ్డి నియామకంపై జారీ చేశారు. కాగా, ప్రధాన అటవీ సంరక్షణాధికారి(పీసీసీఎఫ్)గా సీనియర్ ఐఎఫ్ఎస్ అధికారిణి, కాంపా పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణను ప్రభుత్వం నియమించింది. ఇప్పటివరకు పీసీసీఎఫ్‌గా ఉన్న రాకేశ్‌మోహన్ డోబ్రియాల్ బుధవారం పదవీ విరమణ పొందారు.

జైళ్ల శాఖలో బదిలీలకు రంగం సిద్ధం!

తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖలో బదిలీలకు రంగం సిద్ధమైంది. కేంద్ర కారాగారాలతోపాటు, జిల్లా జైళ్ల సూపరింటెండెంట్‌లను బదిలీ చేసేందుకు ఆ శాఖ ఉన్నతాధికారులు కసరత్తు పూర్తి చేశారు. పదవీ విమరణలతో ఏర్పడ్డ ఖాళీలు, ఇటీవల పదోన్నతి పొందిన అధికారులు, దీర్ఘకాలంగా ఒకేచోట విధులు నిర్వహిస్తున్నవారు, విధినిర్వహణలో తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులు ఉన్నారు. అన్ని అంశాల ఆధారంగా వారికి పోస్టింగ్ ఇచ్చేందుకు జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా సిద్ధమయ్యారు. కాగా, చర్లపల్లి జైలు సూపరింటెండెంట్ రామచంద్రం బుధవారం పదవీ విరమణ చేశారు. దీంతో చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌కు చర్లపల్లి జైలు ఇన్‌చార్జి బాధ్యతల్ని డీజీ అప్పగించారు.

సీఎస్‌గా రామకృష్ణారావు బాధ్యతల స్వీకరణ



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా కె.రామకృష్ణారావు బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. బుధవారం రిటైర్ అయిన శాంతికుమారి నుంచి ఆయన చార్జీ తీసుకున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య బాధ్యతలు చేపట్టారు. సచివాలయంలోని ఆరో అంతస్తులో ఇదివరకు శాంతికుమారి బాధ్యతలు నిర్వర్తించిన చాంబర్‌లోనే రామకృష్ణారావు విధులు నిర్వహించనున్నారు. రామకృష్ణారావు.. ప్రధాని నరేంద్రమోదీ అన్ని రాష్ట్రాల సీఎస్‌లతో 'ప్రగతి' పేరిట ఢిల్లీ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

మూసీ ఎండీ నర్సింహారెడ్డి బాధ్యతల స్వీకరణ

హైదరాబాద్ సిటీ: మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఎండీగా ఈవీ నర్సింహారెడ్డి బాధ్యతలు స్వీకరించారు.

మావోయిస్టుల కాల్పుల విరమణ ప్రతిపాదనను అంగీకరించాలి

- కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు ప్రారంభించాలి
- మీడియా సదస్సులో పలువురు వక్తల డిమాండ్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సీపీఐ (మావోయిస్టు) కాల్పుల విరమణ ప్రతిపాదనను భారత ప్రభుత్వం అంగీకరించాలని, శాంతి చర్చలు ప్రారంభించాలని పౌర సమాజ సంస్థలు, వ్యక్తుల విస్తృత కూటమి బుధవారం నిర్వహించిన వర్చువల్ మీడియా సదస్సులో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. సమావేశానికి ముందు 300కి పైగా సంస్థలు, వ్యక్తులు మద్దతిచ్చిన కాల్పుల విరమణ పిలుపును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, హోంశాఖ మంత్రి అమిత్ షాకు పంపించినట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ శాంతి చర్చల కమిటీ ప్రొ.జి. హరగోపాల్ మాట్లాడుతూ.. షరతులులేకుండా మావోయిస్టులు లొంగిపోవాలని, ఆయుధాలు అప్పగించాలని చర్చలకు ముందస్తు షరతు విధించడం అన్యాయమన్నారు. ప్రముఖ ప్రజాస్వామిక హక్కుల కార్యకర్త బేలా భాటియా మాట్లాడుతూ ఆదివాసీలు శాంతిని కోరుకుంటున్నారన్నారు. ప్రతి రెండు, మూడు కిలోమీటర్లకు ఒక పోలీస్ క్యాంపును పెట్టి బస్తర్‌ను ఒక పెద్ద సైనిక శిబిరంగా మార్చివేశారని మనీష్ కుంజమ్ అన్నారు. కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఎంపీ రాజారామ్ సింగ్ సీపీఐ జనరల్ సెక్రటరీ డి.రాజా, విజూ కృష్ణన్, డి.రవికుమార్‌లు మాట్లాడుతూ శాంతి చర్చలు అవసరమన్నారు.

అందాల పోటీలపై ఉన్న ఆసక్తి.. విద్యార్థుల భవిష్యత్తుపై లేదా? : రాణి రుద్రమ

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డికి అందాల పోటీలపై ఉన్న ఆసక్తి, విద్యార్థుల చదువులపై లేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ విమర్శించారు. బుధవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన 15 నెలల నుంచి విద్యాశాఖని తనవద్దే ఉంచుకున్న రేవంత్‌రెడ్డి ఒక్కసారైనా ఆ శాఖను సమీక్షించారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఇప్పటిదాకా డిగ్రీ పరీక్షలు నిర్వహించలేదని, దీంతో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాలేజీ ఫీజుల పాత బకాయిలన్నీ చెల్లిస్తామని ఇచ్చిన హామీని కాంగ్రెస్ నెరవేర్చలేదని పేర్కొన్నారు.


గ్రూప్-1పై సందేహాలను వారంలో నివృత్తి చేయండి

- టీజీపీఎస్సీ చైర్మన్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ ఫలితాల్లో అక్రమాలు జరిగాయని అభ్యర్థుల ఆందోళన నేపథ్యంలో వారి సందేహాలకు వారంలో సమగ్ర సమాచారమివ్వాలని టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశంను కేంద్రమంత్రి బండి సంజయ్ కోరారు. ఉర్దూ మీడియంలో రాసిన, కోఠీ ఉమెన్స్ కాలేజీలో రాసిన అభ్యర్థులకే టాప్ ర్యాంకులు రావడం వెనకున్న మతలబేంటని ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఆయనకు లేఖ రాశారు. మరోవైపు హైకోర్టులో గ్రూప్-1పై విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో టీజీపీఎస్సీ సమాచారం ఆధారంగా అవసరమైతే తాను కేసులో ఇంప్లీడ్ కావాలని నిర్ణయించినట్టు సంజయ్ పేర్కొన్నారు.

నాగారం భూములపై సింగిల్ జడ్జి వద్దే తేల్చుకోండి

- మధ్యంతర ఉత్తర్వుల ఎత్తివేతకు వెకేట్ స్టే పిటిషన్ దాఖలు చేసుకోవచ్చు
- పలువురు ఐపీఎస్‌ల అప్పీళ్లపై హైకోర్టు డివిజన్ బెంచ్ స్పష్టం



హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నాగారంలో పలువురు ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు కొనుగోలు చేసిన భూములను నిషేధిత జాబితాలో పెట్టాలంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి హైకోర్టు డివిజన్ బెంచ్ నిరాకరించింది. సదరు వ్యవహారాన్ని సింగిల్ జడ్జి వద్దే తేల్చుకోవాలని.. ఉత్తర్వులు ఎత్తేయాలంటూ సింగిల్ జడ్జి వద్ద వెకేట్ స్టే పిటిషన్ దాఖలు చేసుకోవచ్చని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం తెలిపింది. ఏపీ, తెలంగాణకు చెందిన పలువురు సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు రంగారెడ్డి జిల్లా నాగారంలోని ప్రభుత్వ భూముల రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి.. వాటిని అక్రమంగా బదిలీ చేసుకున్నారంటూ బిర్ల మల్లేశ్ అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేశారు. దీంతో జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం.. నాగారంలోని 180, 182, 194, 195 సర్వే నంబర్లలోని భూముల విషయంలో అన్ని రకాల లావాదేవీలపై స్టే విధించడంతోపాటు నిషేధిత జాబితాలో చేర్చాలని ఏప్రిల్ 24న మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ తాజాగా పలువురు ఐపీఎస్‌లు, వారి కుటుంబ సభ్యులు, ప్రభుత్వ ఉద్యోగులు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో అప్పీల్ పిటిషన్లు వేశారు. అవి భూదాన్ భూములు కాదని.. చట్టబద్ధంగా కొనుగోలు చేశామని.. సింగిల్ జడ్జి ఉత్తర్వులను కొట్టేయాలని పేర్కొన్నారు. పిటిషన్ వేసిన వారిలో మహేశ్ మురళీధర్ భగవత్, సౌమ్యామిశ్రా, స్వాతి లక్రా, రవిగుప్తా, తరుణ్ జోషి, రేణుగోయెల్, బీకే రాహుల్ హెగ్డే, రాహుల్ బునిరెడ్డి, వీరన్నగారి గౌతమ్‌రెడ్డి, రేఖా షరాఫ్ తదితరులున్నారు.

ఉన్నతాధికారులు కబ్జాదారులనేలా ప్రచారం..

కోర్టులో పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఎస్.నిరంజన్‌రెడ్డి, దేశాయి ప్రకాశ్‌రెడ్డి తదితరులు వాదనలు వినిపించారు. 'మేం సేల్‌డీడ్ ద్వారా చట్టబద్ధంగా భూములను కొన్నాం. సర్వే నంబర్లు 180, 182లో ఉన్న భూములకు 194, 195 సర్వే నంబర్లలోని భూములకు సంబంధం లేదు. మావి భూదాన్ భూములు కావు. సింగిల్ జడ్జి మా వాదన వినకుండా.. ముందస్తు నోటీసులివ్వకుండా చాలా కఠినమైన ఆదేశాలిచ్చారు. పిటిషనర్ విజ్ఞప్తుల పరిధి కంటే మించి సింగిల్ జడ్జి ఆదేశాలు జారీ చేశారు. మేం ఉన్నత స్థానాల్లో ఉన్నందున అధికార దుర్వినియోగం చేస్తామని సింగిల్ జడ్జి ముందే ఊహించడం సరికాదు. భూవివాదాలు సివిల్ కోర్టులో తేల్చుకోవాలి.. ఈ వ్యవహారంపై రిట్ పిటిషన్ విచారణార్హమే కాదు' అని పేర్కొన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. సింగిల్ జడ్జి ఇచ్చినవి మధ్యంతర ఉత్తర్వులు మాత్రమేనని.. అవి తుది ఉత్తర్వులు కావని పేర్కొంది. అప్పీలుదారులు సింగిల్ జడ్జి వద్ద కౌంటర్లు దాఖలు చేసి మధ్యంతర ఉత్తర్వుల ఎత్తివేతకు వెకేట్ స్టే పిటిషన్లు వేసుకోవచ్చని చెబుతూ అప్పీల్ పిటిషన్లను ముగించింది. కాగా, నాగారంలోని 194,195 సర్వే నంబర్లలో ఉన్నవి భూదాన్ భూములు కాదని.. అవి బైరాన్ (ప్రభుత్వ) భూములని మొదటి పిటిషనర్ బిర్ల మల్లేశ్ తరఫు సీనియర్ న్యాయవాది రవిచందర్ కోర్టుకు తెలిపారు. ధర్మాసనం అడిగిన ఓ ప్రశ్నకు బదులిస్తూ.. అవి భూదాన్ భూములని పొరపాటున సమోదైందని.. ఆ మేరకు ఉత్తర్వులు సవరించాలని సింగిల్ జడ్జి వద్ద అప్లికేషన్ దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ట్రంప్ అందించిన విజయం

లిబరల్ పార్టీని గద్దెదించి, ఈమారు కచ్చితంగా కన్సర్వేటివ్‌లను అధికారంలోకి తెచ్చుకోవాలని కెనడా ప్రజలు నిజానికి ఎప్పుడో నిర్ణయించుకున్నారు. పదేళ్లపాలన, కొన్ని అసమర్థ నిర్ణయాల వల్ల లిబరల్ పార్టీమీద బలమైన వ్యతిరేకత ఏర్పడివున్న తరుణంలో, అమెరికా అధ్యక్షుడిగా శ్వేతసౌధంలోకి అడుగుపెట్టిన డోనాల్డ్ ట్రంప్ కెనడియన్ల మనసు మార్చేశారు. అధికారపక్షంమీద వారిలోవున్న అంతటి ఆగ్రహాన్నీ వెనక్కునెట్టేసి, మళ్ళీ నువ్వేకావాలి అనేట్టుగా వారిని తయారుచేశారు. ఘోరంగా ఓడిపోతుందనుకున్న లిబరల్‌పార్టీ గతంలో కంటే ఓ ఎనిమిది స్థానాలు ఎక్కువే సంపాదించిదంటే అది ట్రంప్ పెట్టిన భిక్షే. కెనడా ఎన్నికల్లో అమెరికా అధ్యక్షుడు జోక్యం చేసుకున్నాడంటూ సామాజిక మాధ్యమాల్లో సరదా వ్యాఖ్యలు, మీమ్స్ చక్కెర్లు కొడుతున్నది అందుకే.

కెనడా ప్రధాని కార్నీ విజయోత్సాహంలో మునిగితేలుతున్నారు. కెనడాకోసం, కెనడియన్ల ఐక్యతకోసం నిలబడతానని, ముక్కలు చెక్కలు చేసి, మూటగట్టుకుపోవాలని చూస్తున్న అమెరికా అధ్యక్షుడికి వ్యతిరేకంగా పోరాడతానని తన ప్రసంగంలో ప్రజలకు గట్టిహామీలు ఇచ్చాడాయన. ఎన్నికల ప్రచారమంతా అమెరికా అధ్యక్షుడు చుట్టూనే తిరిగినట్టుగా, ఈ విజయోత్సవ ప్రసంగంలోనూ అత్యధికభాగం ట్రంప్‌మీద విమర్శలే ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడికి మన భూములు కావాలి, మన వనరులు, నీరు, మన దేశమే కావాలి, బలమైన కెనడా నిర్మాణం ద్వారా ఆయన ఆటలు ఇక సాగనిచ్చేది లేదు అని కెనడా ప్రధాని ప్రకటించారు. అమెరికా అధ్యక్షుడు తమ జోలికి రాకుండావుంటే, తనకు ఈ విజయం దక్కేది కాదని కెనడా ప్రధానికి తెలుసు. లిబరల్‌పార్టీ పట్టుబట్టి గబ్బుపట్టిన జస్టిన్ ట్రూడోను గద్దెదింపి, అప్పటికి ఏ పాలనానుభవమూ లేని ఈయనను కుర్చీలో కూచోబెట్టినప్పటికే వాతావరణం వేడెక్కిపోయి ఉంది. అమెరికా 51వ రాష్ట్రంగా కెనడాను మార్చేస్తానని ట్రంప్ చేసిన ట్వీట్లు, అలా రూపాంతరం చెందితే కెనడాకు ఆర్థికంగా భౌగోళికంగా ఎంతో ప్రయోజనమంటూ చేసిన వ్యాఖ్యలు, అనంతర కాలంలో హెచ్చరికలు, బెదిరింపులు కెనడియన్లను భయోత్పాతంలోకి నెట్టేశాయి. సుంకాలయుద్ధంలో తమను ముందువరుసలో ఉంచి, అధిక సుంకాలతో వేధించి దారికితెచ్చుకోవాలన్న ట్రంప్ ప్రయత్నం కెనడియన్లు తీవ్రంగా గర్హించారు. కెనడాను అమెరికా స్వాహాచేస్తుందన్న భయంలో ఉన్న కెనడియన్లకు, ట్రంప్‌తో సాన్నిహిత్యం ఉన్న కన్సర్వేటివ్‌లు అధికారంలోకి వస్తే ఇక కెనడా కనుమరుగేనన్న అధికారపక్షం ప్రచారం చక్కగా చెవికెక్కింది. ట్రంప్‌మీద యుద్ధాన్ని ప్రకటించిన మెక్‌కార్నీ హీరోలాగా కనిపించారు. దీనితో, జనవరినాటికే 20పాయింట్లు వెనుకబడిపోయి ఉన్న లిబరల్‌పార్టీ వరుసగా నాలుగోసారి అధికారంలోకి రాగలిగింది. ఈ మారు కుర్చీ ఖాయమనుకున్న కన్సర్వేటివ్ పార్టీ ఆమడదూరంలో చతికిలబడిపోయింది. ట్రంప్ వాచాలత కారణంగా దాని అదృష్టరేఖ నాలుగునెలల్లోనే తారుమారైపోయింది.

ఈ ఎన్నికల్లో మరో విశేషమైన పరిణామం ఖలిస్తానీ అనుకూల న్యూ డెమొక్రాటిక్‌పార్టీ (ఎన్డీపీ) పతనం, దాని నాయకుడు జగ్‌మీత్ సింగ్ ఓటమిపాలై, బాధ్యతలనుంచి తప్పుకోవడం. భారత్‌కు ఎంతో ఉపశమనం కలిగించే మార్పు ఇది. సిక్కువోటర్లు ఈ మారు లిబరల్ పార్టీ వైపు మళ్ళిపోవడంతో ఎన్డీపీ బాగా దెబ్బతినిపోయింది. భారత్–కెనడా సత్సంబంధాలకు విఘాతం కలిగించిన ట్రూడో, జగ్‌మీత్‌లు ఇద్దరూ ఇప్పుడు తెరమరుగైనారు. బ్రిటిష్ కొలంబియాలో ఖలిస్తానీ వేర్పాటువాది హర్‌దీప్‌సింగ్ నిజ్జర్ హత్య అనంతరం ట్రూడో ఆరోపణలు, విమర్శలతో ఇరుదేశాల మధ్య విభేదాలు పతాకస్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. రెండుదేశాల మధ్యా నెలకొన్న అనిశ్చితి కారణంగా విద్యార్థులు, ఉద్యోగార్థులు కష్టాలుపడ్డారు. భారత్‌తో సత్సంబంధాలు కోరుకుంటున్నట్టుగా మెక్‌కార్నీ ఇప్పటికే ప్రకటించి ఉన్న నేపథ్యంలో, దీర్ఘకాలంగా దెబ్బతినివున్న సంబంధాలు ఇక మెరుగుపడతాయని ఆశించవచ్చు. కెనడా ప్రధాని విజయంపట్ల ప్రధాని మోదీ హర్షాన్ని వ్యక్తం చేయడంలోనూ ఈ ఆశాభావం కనిపిస్తోంది. గాడితప్పిన విద్య–వాణిజ్యబంధాలు, ఇమిగ్రేషన్ విధానాలను రెండుదేశాలు చక్కదిద్దుకుంటాయని ఆశిద్దాం.

కులలెక్కలతో కొత్త ప్రయాణం గట్టెక్కేనా?



ఎత్తులు పైఎత్తులతో అనూహ్య నిర్ణయాలు తీసుకోవటం రాజకీయాల్లో సహజం. కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఇలాగే అర్థం చేసుకోవచ్చు. కానీ భవిష్యత్తు పరిణామాలను దృష్టిలో పెట్టుకుని చూస్తే దీన్ని అత్యంత అసాధారణ నిర్ణయంగా పరిగణించొచ్చు. సందర్భాన్ని బట్టే దేనికైనా సాధారణతనూ అసాధారణతనూ ఆపాదించవచ్చు. పహల్గాం సంఘటనకు ప్రతీకారంగా కేంద్ర ప్రభుత్వం అసాధారణ రీతిలో ప్రతిస్పందించే అవకాశాలు ఉన్నాయని అందరూ భావిస్తున్న తరుణంలో కులగణన నిర్ణయం ఏ రకంగానూ ఊహించింది కాదు. హిందూ సమాజ ఏకీకరణకు, హిందూ సంస్కృతిపై ఆధారపడే జాతీయవాదానికి కుల భావాలూ, మమకారాలూ అడ్డంకిగా ఉన్నాయన్నది సంఘ్‌పరివార్ సైద్ధాంతిక అవగాహనగా ఇప్పటివరకూ చలామణి అయింది. అందుకే కాంగ్రెస్ వైపు నుంచి కులగణనకు సంబంధించి ఎన్ని సవాళ్లు ఎదురైనా బీజేపీ నుంచి గానీ, ఆరెస్సెస్ నుంచి గానీ తమ విధానం ఇదీ అంటూ స్పష్టమైన ప్రకటనలు రాలేదు. కులగణనకు నెహ్రూ వ్యతిరేకమంటూ బీజేపీ వైపునుంచి చాలా వ్యాఖ్యానాలు వచ్చాయి. రిజర్వేషన్లను రాజీవ్‌గాంధీ లోక్‌సభలోనే వ్యతిరేకించారంటూ విమర్శలు కురిపించారు. మండల్ కమిషన్ సిఫార్సులను ఇందిరాగాంధీయే తొక్కిపట్టారని ఆరోపణలూ ఎక్కుపెట్టారు. సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూడా సమయ, సందర్భాలను బట్టి అలాంటి ప్రకటనలు చేయలేదని చెప్పలేం.

విధానాల్లో, సైద్ధాంతిక సూత్రీకరణల్లో పూర్తిగా భిన్న దార్లు తొక్కటం కాంగ్రెస్ చరిత్ర నిండా కనపడుతుంది. ఒకప్పటి విధానాలకు భిన్నంగా కులగణనను ప్రధాన రాజకీయ అజెండాగా మలచుకుని నాలుగేళ్ల నుంచి పార్టీ కార్యాచరణనంతా దాని చుట్టూనే తిప్పుతోంది. కిందటి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా ఆధిక్యతను సాధించకుండా చేయటంలో కాంగ్రెస్ ప్రచారం బాగానే తోడ్పడింది. మోదీ కోరినట్లుగా 400 లోక్‌సభ స్థానాలను కట్టబెడితే రిజర్వేషన్లను బీజేపీ రద్దుచేస్తుందని కాంగ్రెస్ ముమ్మరంగా ప్రచారం చేసింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ ప్రచారానికి ఉధృతినీ, ఉరవడినీ తీసుకువచ్చారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా, ఎంతో పకడ్బందీగా తెలంగాణలో కులగణనను విజయవంతంగా పూర్తిచేశామనీ దాన్ని మోదీ విస్మరించలేరనీ రేవంత్‌రెడ్డి ఒకటికి పదిసార్లు చెప్పారు. ఒకరకంగా ఇప్పుడదే నిజమైంది. అయితే కాంగ్రెస్ ఎక్కుపెట్టిన కులగణన అస్త్రం భవిష్యత్తులో రాజకీయంగా మళ్లీ ఇబ్బంది పెట్టకుండా దాన్ని ఒడుపుగా అందుకుని తనకు ఉపకరించే రీతిలో ప్రయోగించుకోటానికి బీజేపీ సిద్ధమైంది. దీనిలో ఎంతవరకూ సఫలమవుతుందో ఇప్పుడే చెప్పలేం. కానీ కులగణనపై కాంగ్రెస్ అనుకున్న స్థాయిలో రాజకీయంగా మరింత విజృంభించకుండా బీజేపీ పావులు కదిపిందని అర్థం.

వ్యూహప్రతివ్యూహాలు ఎలా ఉన్నప్పటికీ కులజనాభాను ఎలా సేకరిస్తారన్న దానిపైనే భవిష్యత్తు ఫలితాలు ఆధారపడి ఉంటాయి. కులంతో పాటు ఉద్యోగ, విద్య, ఆస్తుల వివరాలను పక్కాగా సేకరించి వాటిని బహిరంగ పరిస్తే రాజకీయరంగమే చాలా ఒడిదుడుకులకు లోను కావాల్సి వస్తుంది. కుల జనాభాను బట్టి ఉద్యోగాలు, పదవులు ఉండాలని కాంగ్రెస్ పార్టీ డిమాండు చేస్తోంది. అందుకోసం రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు విధించిన 50 శాతం పరిమితిని ఎత్తివేయాలని గట్టిగా కోరుతోంది. నిజానికి కాంగ్రెసే కాకుండా ప్రాంతీయ పార్టీలు కూడా ఇదే డిమాండును ఎప్పటినుంచో వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగా కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు 50 శాతానికి మించి రిజర్వేషన్లను కల్పిస్తూ చేసిన చట్టాలను ఉన్నత న్యాయస్థానాలు కొట్టివేయటమో, నిలుపుదల చేయటమో చేశాయి. దేశవ్యాప్తంగా కులలెక్కలు అందుబాటులోకి వస్తే ఆ పరిమితి తొలగించాలనే ఒత్తిడి తీవ్రమవుతుంది. ప్రభుత్వ ఉద్యోగాలకూ, ప్రభుత్వ విద్యాసంస్థలకూ ఇది పరిమితం అయితే ఎదురయ్యే సవాళ్లు ఒకరకంగా ఉంటాయి. ప్రైవేటురంగానికి కూడా రిజర్వేషన్లను వర్తింపచేయాలనే డిమాండు ఉధృతమైతే ఉత్పన్నమయ్యే సవాళ్లు భిన్నంగా ఉంటాయి. ఎంతవరకూ రిజర్వేషన్లు ఉండాలన్న విషయంపై రాజకీయంగా ఇప్పటివరకూ ఏకాభిప్రాయం లేదు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లపై అది అసలే లేదు. సమర్థత, పోటీ ఆధారంగా నడిచే స్వేచ్ఛా మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ జోక్యానికి చాలా పరిమితులు ఉంటాయి. ఏ రంగంలోనైనా పెట్టుబడులు పెట్టుకోటానికీ, ఉద్యోగుల అర్హతలు, సమర్థతలు నిర్ణయించుకోటానికీ ప్రైవేటురంగానికి దాదాపుగా పూర్తి స్వేచ్ఛను ఇవ్వటం అనేది ఇప్పటివరకూ అడ్డంకులు లేకుండా సాగుతోంది. ఆర్థిక సంస్కరణలు మొదలుపెట్టిన నాటి నుంచి అట్లాంటి స్వేచ్ఛను కల్పిస్తున్నామని జాతీయ పార్టీలతో పాటు ప్రాంతీయ పార్టీలూ ఘనంగా చెప్పుకుంటున్నాయి. చెప్పుకోవటమే కాదు పోటీలుపడి మరీ స్వదేశీ–విదేశీ పెట్టుబడుల కోసం ప్రోత్సాహాలను ప్రకటిస్తున్నాయి. పెట్టుబడులకు ఎటువంటి అడ్డంకులు లేకుండా విధానాలనూ రూపొందిస్తున్నాయి.

మోదీ కోరినట్లుగా 400 లోక్‌సభ స్థానాలను కట్టబెడితే రిజర్వేషన్లను బీజేపీ రద్దుచేస్తుందని కాంగ్రెస్ లోక్‌సభ ఎన్నికల్లో ముమ్మరంగా ప్రచారం చేసింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆ ప్రచారానికి ఉధృతినీ, ఉరవడినీ తీసుకువచ్చారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా, ఎంతో పకడ్బందీగా తెలంగాణలో కులగణనను విజయవంతంగా పూర్తిచేశామనీ దాన్ని మోదీ విస్మరించలేరనీ రేవంత్‌రెడ్డి ఒకటికి పదిసార్లు చెప్పారు. ఒకరకంగా ఇప్పుడదే నిజమైంది.



■ రాహుల్ కుమార్

కులజనాభాను బట్టి వాటాలు నిర్ణయం అవ్వాలనే సూత్రమే గీటురాయి అయితే ప్రైవేటురంగం కూడా పెనుమార్పులకు లోనుకావాల్సి వస్తుంది. వాటాల జోలికి పోకుండా కేవలం కులాల లెక్కలు సేకరించి అదీ కూడా ఆర్థికస్థితిగతులను పక్కాగా తేల్చకుండా యథాతథంగా ప్రస్తుత విధానాలను కొనసాగిస్తే ఆశించిన మార్పులు వచ్చే అవకాశం లేదు. రాజకీయ రంగంలో మాత్రం కొన్ని మార్పులు వచ్చే అవకాశం ఉంది. అవి కూడా తీవ్ర ప్రభావం కలగచేసేవిలా ఉంటాయన్నది ఇప్పుడే చెప్పలేం. అధికారికంగా కులలెక్కలు లేకపోవచ్చు గానీ గ్రామాలు, మండలాలు, జిల్లాల వారీగా నిజమైన కుల లెక్కలు రాజకీయ పార్టీల దగ్గర పుష్కలంగా ఉన్నాయి. వాటి ఆధారంగానే టిక్కెట్లను ఇస్తున్నాయి, పదవులను కట్టబెడుతున్నాయి. సమాచార సాంకేతిక పరిజ్ఞానం వాడకం విస్తృతమైన తర్వాత కులాలవారీ లెక్కలను క్రోడీకరించటం రాజకీయ పార్టీల వ్యూహకర్తలకు తేలికైపోయింది. తెలిసిన లెక్కలను తెలియదన్నట్లు వ్యవహరించటం మన రాజకీయాల్లో మామూలే!

జనాభా సేకరణలో కులలెక్కలు ఒకసారి అధికారికమైన తర్వాత వాటిని భవిష్యత్తులోనూ కొనసాగించాల్సి వస్తుంది. కుల గణాంకాలపై ఏకాభిప్రాయం సాధించటమూ అంతతేలిక కాదు. తక్కువా, ఎక్కువా చేశారనే ఆరోపణలూ వస్తాయి. తెలంగాణలోనూ అవి వచ్చాయి. కర్ణాటకలో సిద్ధరామయ్య ప్రభుత్వ హయాంలో పదేళ్ల క్రితం వందకోట్లకు పైగా ఖర్చుపెట్టి చేసిన కులగణనపై ఏకాభిప్రాయాన్ని సాధించలేకపోయారు. ఇప్పటికీ ఆ కుల నివేదికను బయటపెట్టలేకపోతున్నారు. కర్ణాటకలో రెండు ప్రధాన కులాలైన వక్కలిగలు, లింగాయతులు తమ జనాభాను తక్కువగా చూపించారని బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. ఈ రెండు కులాలకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు కులగణన లెక్కలను తప్పుపడుతున్నారు. ఇదే పరిస్థితి పలు రాష్ట్రాల్లో తలెత్తదని చెప్పలేం. జాతీయ స్థాయిలో బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య ఏ సమస్యపైనా ఒక అంగీకారానికి రావటం అసాధ్యంగానే పరిణమిస్తోంది. కొన్నిచోట్ల ప్రతిపక్ష పార్టీ ప్రభుత్వాలు చేపట్టిన కులాల గణనను రాజకీయ లబ్ధికోసమే నిర్వహించారని కేంద్ర ప్రభుత్వం బుధవారం విమర్శించింది. పారదర్శకత లేకుండా వాటిని జరిపారనీ సమాజంలో సందేహాలను కలగచేశారనీ దుయ్యబట్టింది. జనాభా సేకరణ కేంద్ర ప్రభుత్వ జాబితాలోని అంశమనీ, కాబట్టి రాష్ట్ర ప్రభుత్వాలకు కులజనాభా లెక్కలను సేకరించే అధికారం లేదని కూడా స్పష్టంచేసింది. రాజకీయ దృష్టితో చేసే కులగణన వల్ల సమాజంలో సంబంధాలు దెబ్బతింటున్నాయనీ తాము పారదర్శకంగా చేపట్టే కులలెక్కలతో అటువంటి ప్రమాదం ఉండదనీ సమర్థించుకుంది.

కులగణన నిర్ణయం వెల్లడే ఇట్లాంటి విమర్శలతో మొదలైంది. 2011లో ఆనాటి కాంగ్రెస్ నేతృత్వంలో చేపట్టిన సామాజిక, ఆర్థిక, కుల గణన (ఎస్ఈసీసీ) అసంపూర్ణమైందని కూడా కేంద్రం విమర్శించింది. రాజకీయాలకు ఏదీ అతీతం కాదు కాబట్టి కులగణనపై కేంద్రం వేసే అడుగులు శాస్త్రీయంగా, పటిష్ఠంగా ఉండకపోతే విమర్శలు అనివార్యంగా వస్తాయి. 2011 నాటి సర్వేకు 5000 కోట్లకు పైగా ఖర్చుపెట్టి కులలెక్కలపై చివరకు చేతులెత్తేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఆనాడు సేకరించిన కులాల జనాభా ఎందుకూ పనికిరాదని కేంద్ర ప్రభుత్వమే సుప్రీంకోర్టుకు తెలియచేసింది. కాంగ్రెస్ నాయకత్వం దీన్ని ఇంతవరకూ ప్రశ్నించలేదు. ఆనాటి తమ ప్రభుత్వం సరిగానే కులగణనను చేసిందని ఇంతవరకూ స్పష్టంగా చెప్పుకోలేకపోయింది.

78 ఏళ్ల స్వాతంత్ర్యం అనంతరం కుల గణన నిర్ణయాన్ని గొప్పచర్యగా భావించటం రాజకీయంగా సబబే కావచ్చు. కానీ దాని వెనుక సామాజిక, ఆర్థికరంగాల్లో వైఫల్యమే కొట్టొచ్చినట్లు కనపడుతుంది. ఆ వైఫల్యాలు పునరావృతం కాకుండా, ఎటువంటి చర్యలూ విధానాలూ చేపట్టాలో స్పష్టంచేయకుండా, కేవలం కులాలను లెక్కించటం వల్ల జరిగే లాభం పెద్దగా ఉండదు.

78 ఏళ్ల స్వాతంత్ర్యం అనంతరం కుల గణన నిర్ణయాన్ని గొప్పచర్యగా భావించటం రాజకీయంగా సబబే కావచ్చు. కానీ దాని వెనుక సామాజిక, ఆర్థికరంగాల్లో వైఫల్యమే కొట్టొచ్చినట్లు కనపడుతుంది. ఈ వైఫల్యంలోనూ రాజకీయ పార్టీల వాటాలెంతో తేలితేనే అసలు దృశ్యం బయటకు వస్తుంది. ఆ వైఫల్యాలు పునరావృతం కాకుండా, ఎటువంటి చర్యలూ విధానాలూ చేపట్టాలో స్పష్టంచేయకుండా, కేవలం కులాలను లెక్కించటం వల్ల జరిగే లాభం పెద్దగా ఉండదు. ఆర్థికాభివృద్ధి ఫలాలు అందరికీ అందని విధానాలు ఎప్పటిలాగే కొనసాగితే కులం, ప్రాంతం ఆధారంగా కొత్త డిమాండ్లు పుట్టుకొస్తూనే ఉంటాయి. కులాల్లో ఆర్థిక అంతరాలను, సంపన్న శ్రేణులను పరిగణనలోకి తీసుకుని మాత్రమే రిజర్వేషన్లు కల్పించాలని ఉన్నత న్యాయస్థానాలు చేస్తున్న విజ్ఞప్తులను పట్టించుకోవాల్సిన సమయమూ వచ్చింది. ఆదాయ, సంపద అసమానత్వం భారత్‌లో చాలా తీవ్రంగా ఉందని ఇప్పటికే ఎన్నో అధ్యయనాలు వచ్చాయి. ఈ పరిస్థితిని ఎంతోకొంత చక్కదిద్దటానికి తోడ్పడితేనే కులగణనకు సార్థకత లభిస్తుంది. దానికి విరుద్ధంగా జరిగితే ప్రజాస్వామ్యం సంకుచిత భావాలతో సతమతమైపోతుంది. హేతుబద్ధత కుచించుకుపోతుంది.

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

‘భూ భారతి’తో దళితులకు మేలు జరిగేనా?

గతంలో ‘మాభూమి’ పోర్టల్‌లో స్పష్టమైన టిప్పన్, సరైన అక్షాంశ–రేఖాంశాల ఆధారంగా రూపొందించిన ఖని బండల గుర్తులతో కూడిన భూడిజిటల్ భూపటాన్ని మాయం చేసిన ‘ఘనత’ ‘ధరణి’కి దక్కింది. తాజాగా, అందులోని కాడాస్ట్రల్ మ్యాప్ (ఒక నిర్దిష్ట ప్రాంతం ఆస్తి సరిహద్దులు, కొలతలు, యాజమాన్య వివరాలను సూచించే భూమి బ్లూప్రింట్) అదృశ్యం చేసిన ఘనత ఇప్పుడు ‘భూభారతి’కి దక్కుతోంది! ప్రభుత్వాలు రోజురోజుకీ ప్రజలకు ప్రభుత్వ రికార్డులను దూరం చేస్తున్నాయి.

తెలంగాణ భూ భారతి చట్టంలోని సెక్షన్ 2, ఉప–సెక్షన్ (12)లోని క్లాజు(S) ద్వారా పొందిన అనుభవ హక్కుతో సెక్షన్ 8 ద్వారా భూమి హక్కుల రికార్డుల్లో మార్పులు అంటే మ్యుటేషన్ కోసం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)కి దరఖాస్తు చేసుకోవటం అనే నిబంధన ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మ్యుటేషన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తర్వాత ఆర్డీఓ నిర్ణయం తీసుకుంటారని చట్టం చెబుతున్నా, రికార్డులో మార్పును తిరస్కరించే ముందు దరఖాస్తుదారుడికి వివరణ ఇచ్చే అవకాశం కల్పించడం, ప్రభావితమయ్యే వారికి నోటీసులు జారీ చేసి, వారి అభ్యంతరాలను పరిశీలించాలనే నిబంధన ఆచరణలో ఎంతవరకు అమలవుతుందనేది ప్రశ్నార్థకం. ఈ ప్రక్రియ కేవలం కాగితాలకే పరిమితమైతే పేదలకు న్యాయం ఎలా జరుగుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

అసైన్డ్, లావని పట్టా భూములు ఎవరి ఆధీనంలో ఉంటే వారు ఈ ఆర్ఓఆర్ పోర్టల్‌లో ఆర్డీఓకి మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేసుకుంటే, రికార్డుల్లో మార్పులు చేయవచ్చని ఈ సెక్షన్ 8 చెబుతోంది. ఆర్డీఓ ఈ దరఖాస్తులను ఎలా పరిశీలిస్తారు, గతంలోని రక్షణలను పరిగణనలోకి తీసుకుంటారా లేదా అనేది ప్రశ్నార్థకం. ఈ విధానం ద్వారా అసైన్డ్, లావని పట్టా భూములు సులువుగా పట్టా పొందే అవకాశం ఉంది.



భూ భారతిలోని సెక్షన్–8 అమలులోకి వస్తే... పీవోటీ చట్ట స్ఫూర్తి దెబ్బతింటుంది. అంతేకాకుండా, రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలకు కూడా ఇది విరుద్ధంగా మారే అవకాశం ఉంది. గతంలో పేద ప్రజలకు కల్పించిన భూ హక్కులు ప్రమాదంలో పడకుండా, ప్రభుత్వం మరింత స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాల్సిన అవసరం ఉంది.

తెలంగాణ అసైన్డ్ ల్యాండ్స్ (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్స్–పీవోటీ) యాక్ట్, 1977 ప్రకారం పేదలకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములు ఎట్టి పరిస్థితుల్లోనూ బదలాయించడానికి వీల్లేదు. పేదల ఆర్థిక, సామాజిక భద్రత కోసమే ఈ పీవోటీ చట్టం చేశారు. కానీ, కొత్త చట్టంలోని సెక్షన్ 8లో ఆ భూముల గురించి ప్రత్యేకంగా ప్రస్తావించలేదు. బలహీనవర్గాల ప్రజలకు కేటాయించిన భూములు, ప్రభుత్వానికి చెందిన లావణి భూములు ఇతరుల చేతుల్లో ఉంటే, వారు ఈ సెక్షన్‌ను అడ్డుపెట్టుకుని రికార్డుల్లో మార్పులు చేసుకునే ప్రమాదం ఉంది. నోటీసులు జారీ చేసినప్పటికీ, చాలా మంది పేద ప్రజలకు తమ హక్కుల గురించి సరైన అవగాహన ఉండకపోవచ్చు లేదా అభ్యంతరాలు తెలిపేందుకు అవసరమైన వనరులు లేకపోవచ్చు. భూభారతి చట్టంలోని సెక్షన్ 2, ఉప–సెక్షన్ (12)లోని క్లాజు(S) ఆసరాగా చేసుకుని భూస్వాములు, ఇతర బడా వ్యక్తులు అసైన్డ్, లావని పట్టా, ప్రభుత్వ భూములను తమ పేరు మీదకు మార్చుకునే అవకాశం లేకపోలేదు.

ప్రభుత్వం కేవలం అభ్యంతరం తెలిపే అవకాశం ఇస్తామని చెబుతున్నప్పటికీ, నిరక్షరాస్యులైన, బలహీన వర్గాల ప్రజలు తమ భూముల హక్కుల కోసం ఎలా పోరాడగలరనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. చట్టంలోని చిక్కులు, నోటీసుల ప్రాముఖ్యత గురించి వారికి ఎంతవరకు అవగాహన ఉంటుందనేది ప్రశ్నార్థకంగా మారింది. దీనివల్ల అసైన్డ్ భూములు, తరతరాలుగా సాగు చేసుకుంటున్న లావని పట్టా భూములు అన్యాక్రాంతం అయ్యే ప్రమాదం ఉందని న్యాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

భూ భారతి చట్టంలోని సెక్షన్ 8 పేదల భూములను పరిరక్షించాలనే ప్రభుత్వ చిత్తశుద్ధిని ప్రశ్నార్థకం చేస్తోంది. అసైన్డ్ భూముల విషయంలో ప్రత్యేక నిబంధనలు ఎందుకు చేర్చలేదనేది ప్రధానంగా వినిపిస్తున్న వాదన. 1977 నాటి అసైన్డ్ ల్యాండ్స్ చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి మార్పులు జరిగినా వాటిని తిరస్కరించేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. అసైన్డ్, ప్రభుత్వ భూములకు ప్రత్యేక రక్షణ కల్పించేలా నిబంధనలు చేర్చాలని, చట్టంలోని నిబంధనలకు విరుద్ధంగా జరిగే మ్యుటేషన్లను తిరస్కరించే అధికారం అధికారులకు ఉండాలని విశ్లేషకుల వాదన.

సెక్షన్ 8 అమలులోకి వస్తే... పీవోటీ చట్ట స్ఫూర్తి దెబ్బతింటుంది. అంతేకాకుండా, రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలకు కూడా ఇది విరుద్ధంగా మారే అవకాశం ఉంది. పేదల సంక్షేమం కోసం ఉద్దేశించిన చట్టానికి విరుద్ధంగా ఈ సెక్షన్ ఎలా అమలవుతుందో, అలాగే ఈ అంశంపై ప్రభుత్వం ఎలాంటి వివరణ ఇస్తుందో వేచి చూడాలి. సెక్షన్ 8 అమలులో ప్రత్యేకంగా భూ భారతి చట్టంలోని సెక్షన్ 2, ఉప–సెక్షన్ (12)లోని క్లాజు(S) విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే, గతంలో పేద ప్రజలకు కల్పించిన భూ హక్కులు ప్రమాదంలో పడే అవకాశం ఉంది. కాబట్టి, ప్రభుత్వం ఈ విషయంలో మరింత స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాల్సిన అవసరం ఉంది.

● డా. కట్యూరి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

మేడే స్ఫూర్తితో సమస్యలపై పోరాడుదాం

మే 1, 1886న పాలకవర్గాల దమనకాండలో చికాగో(అమెరికా) కార్మికవర్గం రక్తం చిందించింది. ఉరికొయ్యలను సైతం లెక్కచేయక సాధించిన పోరాట ఫలితంగానే 8 గంటల పనిని ప్రపంచం ఆమోదించవలసి వచ్చింది. ఒకనాడు కరువుతో అల్లాడి లక్షలాది మంది అమానుషంగా మరణించారు. వ్యవసాయరంగం విప్లవాత్మక మార్పులలో ప్రపంచానికే తిండి గింజలు అందించే శక్తి వచ్చింది. కరువు కాటకాల నుంచి బయట పడ్డారు. కాని పాలకుల చర్యల ఫలితంగా తిండి లేక అలమటించే స్థితి రావడం సిగ్గుచేటు.

నేడు యాంత్రీకరణతో శ్రామికుడు 8 గంటల పనిని 4 గంటల్లో చేస్తున్నాడు. కాని పెట్టుబడిదారులు కార్మికుల రక్తాన్ని మరింతగా పీల్చిపిప్పి చేసి, సంపద పోగేసుకోవడానికి 12 గంటల పని పెంపుదలను ముందుకు తీసుకొచ్చారు. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌లో పని గంటల పెంపు ప్రతిపాదించింది. దేశంలో 47 కోట్ల మంది శ్రమజీవులలో కేవలం 7 కోట్ల మందికి మాత్రమే ఉద్యోగ భద్రత, తగిన వేతనాలతో జీవిస్తున్నారు. మిగతావారు బతుకు భద్రత లేక కొట్టుమిట్టాడుతున్నారు. రాజ్యాంగం, కోర్టుల గురించి గొప్పలు వల్లించే పాలకులు ‘సమాన పనికి సమాన వేతనం’ అనే సుప్రీం తీర్పును ఎందుకు అమలు చేయడం లేదో సమాధానం చెప్పాలి? శ్రామిక వర్గం జీవించడానికి సరిపడే వేతనాలకై పోరాడాలి.

కార్మిక వర్గం పోరాడి సాధించిన 44 కార్మిక చట్టాలలో, 15 చట్టాలను ప్రభుత్వం అడ్రస్ లేకుండా చేస్తూ, మిగతా 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా ఆమోదించి అమలుచేయడం వల్ల కార్మికులు కట్టు బానిసలుగా మారబోతున్నారు. ట్రేడ్ యూనియన్ హక్కులైన సమ్మె, వేతనాల గురించి బేరసారాలు లేకుండా చేయడం, అధిక పని గంటలు, నియమిత కాల పరిమితి గల ఎంప్లాయిమెంట్ ఉండే విధంగా నిబంధనలు, పరిశ్రమల మూసివేత, కార్మికుల తొలగింపునకు సులభతర అవకాశాలను కోడ్స్‌లో పొందుపర్చారు. ఇది హక్కులను హరించడమే.

అసంఘటిత కార్మిక వర్గానికి ఏ విధమైన సామాజిక భద్రత లేదు. ఒక పక్క కార్పొరేట్లకు 15 లక్షల కోట్ల రాయితీలు, కారుచౌకగా ప్రభుత్వరంగ సంస్థల అప్పగింత, విదేశీ పెట్టుబడులకు గేట్లు బార్లా తెరిచారు. మరోపక్క పేదలకు ఇచ్చే సంక్షేమ పథకాలపై కోత వేస్తున్నారు. పేదలకిచ్చే సంక్షేమాలను ఉచితాలనీ, వీటితో ప్రజలు సోమరులుగా తయారవుతున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. మరి, వీరికి లక్షల కోట్ల రాయితీ పొందే కార్పొరేట్లు, బ్యాంకులను లూటీ చేసే చోక్సీ విజయమాల్యాలు కనబడలేదా? చాలీచాలని జీవితాలతో బతుకు బండి లాగుతున్న శ్రమజీవులపై ఇంత కంటగింపా? కార్మికులకు కనీస పెన్షన్ వేయి రూపాయలా? సేవ పేరుతో ఎంపీ, ఎమ్మెల్యేలైన వారు లక్షలాది రూపాయల పెన్షన్ పొందుతున్నారు. మరి కార్మిక, ఉద్యోగులు కూడబెట్టిన సొమ్ముపై ఎందుకు పెన్షన్ పెంచడం లేదు?

కాంట్రాక్ట్–అవుట్ సోర్సింగ్ కార్మికుల రెగ్యులరైజేషన్, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రతకై, జీవించడానికి సరిపడే వేతనాలు, పెన్షన్ పెంపు, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ అమలు నిలుపుదల కోసం మేడే స్ఫూర్తిగా పోరాడుదాం.

– కె. సూర్యం
టీయుసీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఈ అసమానతలు తొలగేదెప్పుడు?

భారతదేశంలో గత రెండు దశాబ్దాలుగా ఆర్థికవృద్ధి గణనీయంగా పెరుగుతున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. 2014–24 మధ్య కాలంలో దేశ స్థూల జాతీయోత్పత్తి (జీఎన్‌పీ) పెరుగుదల రేటు సంవత్సరానికి 8.2 శాతంగా ఉన్నట్లు వెల్లడించారు. ఈ ఆదాయ పెరుగుదల రేటు ఆధారంగా ప్రపంచ దేశాలలో భారతదేశ స్థానం ఆరుగా పరిగణించారు. ఇంతటి విశిష్టమైన పెరుగుదల రేటు ప్రాతిపదికన భారతదేశం 2022–23 సంవత్సరం నాటికి 3.7 ట్రిలియన్ల (జీడీపీ)కి చేరనున్నట్లు అధికారిక లెక్కలు వెల్లడించాయి.

అయితే ఇంతటి గణనీయమైన అభివృద్ధిని సాధించిన భారతదేశం, సమాజంలో 50 శాతంగా ఉన్న మహిళల/మహిళా శ్రామికుల అభివృద్ధి ఏ మేరకు సాధించింది? భారతదేశంలో మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం సగటు ప్రపంచ దేశాల సగటు కంటె ఎందుకు తక్కువగా ఉంది? గ్రామాలలో ఈ భాగస్వామ్యం ఎందుకు తగ్గుతున్నది? గ్రామీణ, పట్టణ మహిళా శ్రామికుల పని వసతులు ఎందుకు తగ్గుతున్నాయి? అలాగే స్త్రీ పురుషుల వేతనాలు మధ్య అంతరం ఎందుకు పెరుగుతున్నది? ఈ అన్ని ప్రశ్నలకు పెరుగుతున్న జీడీపీ ఏం సమాధానం చెప్పగలదు?

ప్రజల ప్రాథమిక అవసరాలను తీర్చకుండా, లింగ అభివృద్ధిని, సమానత వైపు నడిపించకుండా ఏ దేశమైనా అభివృద్ధి చెందగలదా? భారతదేశంలో మహిళా శ్రామిక శక్తి పురోగమనాన్ని విశ్లేషిస్తే– 131 దేశాలలోని మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం రేటులో భారతదేశానిది 120వ స్థానం అని ప్రపంచ బ్యాంకు వెల్లడించింది. అలాగే 2023లో భారతదేశ మహిళా శ్రామిక శక్తి (15–59సంవత్సరాల మహిళలు) భాగస్వామ్యం రేటు 37 శాతం. ఇది ప్రపంచ దేశాల సగటు కన్నా తక్కువ. ఇదే ఏడాది పురుష శ్రామిక శక్తి భారతదేశంలో 76.8 శాతం.

మన దేశ మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్యం రేటు అభివృద్ధిలో వెనుకబడ్డ బంగ్లాదేశ్, పాకిస్తాన్‌ల కన్నా తక్కువగా ఉంది. ఆ దేశాలలో భాగస్వామ్యం రేటు పెరుగుతున్నట్లు అధ్యయనాలు తెలుపుతున్నాయి. మన దేశంలో మాత్రం 1990–2013 మధ్య కాలంలో భాగస్వామ్యం రేటు 34 నుంచి 27 శాతానికి తగ్గింది. 2004–2020 మధ్యకాలంలో మహిళా పట్టణ శ్రామిక శక్తి భాగస్వామ్యం 16.6 నుంచి 16.8 శాతానికి పెరగగా, గ్రామాలలో ఇది 32.7 నుంచి 24 శాతానికి తగ్గిందని 2023లో పాండే తన అధ్యయనంలో పేర్కొన్నారు.

మహిళలు చేసే పనుల్లో రక్షణ, భద్రత ఉండాలి. పని పరిసరాలు సహకరించేవిగా ఉండాలి. స్త్రీ–పురుష అసమానతలు లేకుండా ఉండాలి. మహిళలకు పని అవకాశాలు పెరిగి, నైపుణ్యాలు పెంచుకునేలా ఉండడంతో పాటు, క్రెష్ వంటి అవకాశాలు ఉండాలి. యాజమాన్యంతో సత్సంబంధాలు పెరుగుతూ ఉండాలి. అయితే ఆధునిక పరిశ్రమలలో మహిళలను నైపుణ్యం అవసరం లేని, ఒకే పని పునరావృత్తమయ్యే చోట తక్కువ వేతనాలపై నియామకాలు జరిగేలా చేశారు. అలాగే వీరిని అనధికారిక, అసంఘటిత ఉద్యోగులుగా గుర్తింపులేని పనులకు ఉపయోగించేవారు. వీరి శ్రమశక్తిని దోపిడీ చేసేలా పని నిర్మాణాలు జరిగాయి. ఇలాంటి పరిశ్రమలు పట్టణ సరిహద్దుల్లో నెలకొని ఉంటాయి.

ఇక గ్రామీణ ప్రాంతాల్లో శ్రమ వర్గీకరణ చూస్తే దేశం మొత్తం మీద గ్రామీణ మహిళా శ్రామిక శక్తి 149.8 మిలియన్లుగా నమోదైంది. ఇందులో 35.9 మిలియన్లు సాగుదారులు, 61.5 మిలియన్లు వ్యవసాయ కూలీలు, 58.5 మిలియన్లు గ్రామీణ పారిశ్రామికులుగా ఉన్నారు. కానీ ఈ రంగాల నుంచి 8.4 శాతం రైతులు, 6.5 శాతం రైతు కూలీలు, 4.75 శాతం పరిశ్రమ శ్రామికులు నిష్క్రమించినట్లు నీతి ఆయోగ్ ప్రకటించింది.

మహిళలు చేసే పనుల్లో రక్షణ, భద్రత ఉండాలి. పని పరిసరాలు సహకరించేవిగా ఉండాలి. స్త్రీ–పురుష అసమానతలు లేకుండా ఉండాలి. మహిళలకు పని అవకాశాలు పెరిగి, నైపుణ్యాలు పెంచుకునేలా ఉండడంతో పాటు, క్రెష్ వంటి అవకాశాలు ఉండాలి. యాజమాన్యంతో సత్సంబంధాలు పెరుగుతూ ఉండాలి.



మహిళా శ్రామికులు ఎదుర్కొంటున్న స్త్రీ–పురుష ఆదాయ అసమానతలు, గ్రామీణ–పట్టణ ఉపాధి అవకాశాల అసమానతలు తొలగించడానికి, వ్యవసాయరంగంలో ఏర్పడ్డ అల్ప ఉత్పాదకత, అల్ప ఆదాయ సమస్యలు అధిగమించడానికి రాజ్యాంగ హామీతో ప్రభుత్వం జాతీయ ఉపాధి హామీ పథకం అమలుపరిచింది. ఇందులో మహిళా శ్రామికులకు ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా 33 శాతం కేటాయించారు. స్త్రీ–పురుషులకు సమాన వేతనాలు చెల్లిస్తారు. నైపుణ్యాలు అవసరం లేని పనులను ఈ పథకం ఇస్తుంది. 90:10నిష్పత్తి బడ్జెట్‌తో కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ పథకం పనిచేస్తుంది. ఈ పథకాన్ని వెనుకబడ్డ రాష్ట్రాల్లోని వెనుకబడ్డ జిల్లాల్లో అమలుపరిస్తే మహబూబ్‌నగర్ జిల్లాల వంటి చోట్ల శ్రామిక వలసలను ఆపవచ్చు. మన దేశంలో పట్టణ ప్రాంతాలలో కంటే గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి హామీ పథకం పనులు నాలుగు రెట్లు ఎక్కువగా ఉన్నాయి. అయితే ఇవి 100 పని వేతనాలకు మాత్రమే పరిమితమయ్యాయి. మన దేశంలో పట్టణీకరణ వేగాన్ని పుంజుకుంది, కనుక ప్రజలు పట్టణ నిమాయకాలతో సర్దుకుపోవాల్సి వస్తోంది.

దశాబ్దాలుగా భారతదేశంలో ఉత్పత్తి ఎంత విస్తారంగా పెరిగినా, మహిళా శ్రామిక శక్తి స్థితిగతులు సంతృప్తిగా మారలేదు. ఇంకెన్ని దశాబ్దాలకు ఈ పరిస్థితులు మారతాయో వేచి చూడాల్సిందే.

■ డా. వనమాల
పాలమూరు అధ్యయన వేదిక

సీఎం సవాల్ స్వీకరిస్తున్నా

- ఎక్కడైనా చర్చకు సిద్ధం
- సమయం నువ్వు చెబుతావా..? నన్ను చెప్పమంటావా?
- రేవంత్ రెడ్డీ.. పదేళ్లు అధికారం పగటికలే..
- ఈ మూడేళ్లు కుర్చీ కాపాడుకో..: హరీశ్



హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): "సమయం నువ్వు చెబుతావా..? నన్ను చెప్పమంటావా? రేవంత్‌రెడ్డీ.. నువ్వు అన్నట్లుగానే.. చర్చకు నేను సిద్ధం.. ఎప్పుడు.. ఎక్కడికి రావాలి. కాళేశ్వరంపై చర్చ పెడదామా? రుణమాఫీపైనా? రైతుబంధు మీద అయినా సరే..! నీ బోగస్ 60 వేల ఉద్యోగాల మీద పెడదామా? కులగణనపై చర్చ పెడదామా? చెప్పాలి" అని సీఎంకు మాజీ మంత్రి హరీశ్ రావు సవాల్ విసిరారు. "ప్రజలకు ఇచ్చిన మాట ఏం తప్పావో ఒకసారి మీ మ్యానిఫెస్టో చూసుకో. పదేళ్లు అధికారంలో ఉంటానంటూ పగటి కలలు కంటున్నావ్.. ఈ మూడేళ్లు నీ సీఎం కుర్చీ చేజారిపోకుండా చేసుకో" అని బుధవారం ఎక్స్ వేదికగా ఆయన ఎద్దేవా చేశారు. ఎంత మేకపోతు గాంభీర్యం ప్రదర్శించినా, కాంగ్రెస్ సర్కారు పాలనలో పూర్తిగా విఫలమయిందని రుజువవుతోందన్నారు. అధికారం చేపట్టిన 15 నెలల్లోనే ఇంత ఘోరంగా విఫలమైన ప్రభుత్వం మరొకటిలేదని విమర్శించారు. బీఆర్ఎస్ రజతోత్సవసభ చూసినప్పటి నుంచి రేవంత్‌రెడ్డికి నిద్రపట్టడంలేదని, అందుకే నిలువెల్లా విషం నింపుకొని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బసవేశ్వరుని జయంతిని, పదవ తరగతి ఫలితాల విడుదల కార్యక్రమాన్ని కూడా రేవంత్‌రెడ్డి తన చిల్లర రాజకీయాల కోసం ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. విద్యార్థుల ముందూ.. కేసీఆర్‌పై పిచ్చి ప్రేలాపనలు మాట్లాడటం సరికాదన్నారు. అచ్చేసిన ఆంబోతు అంటున్నవ్.. సమాధి కట్టాలంటవు.. సీఎం స్థాయిలో విద్యార్థులకు నువ్వు కల్పించే మంచి భవిష్యత్తు ఇదేనా? అంటూ హరీశ్ రావు ప్రశ్నించారు.

సాగర్‌కు యజమాని తెలంగాణే

- స్పష్టం చేసిన ఎన్‌డీఎస్ఏ చైర్మన్ అనిల్ జైన్

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు తెలంగాణయే యజమాని అని జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ (ఎన్‌డీఎస్ఏ) చైర్మన్ అనిల్ జైన్ స్పష్టం చేశారు. (డ్యామ్ హెల్త్ అండ్ రిహాబిలిటేషన్ మానిటరింగ్ అప్లికేషన్-ధర్మ వెబ్‌సైట్) అదే పేర్కొంటోందని తెలిపారు. జాతీయ ఆనకట్టల భద్రత చట్టం-2021 ప్రకారం నాగార్జునసాగర్ డ్యామ్‌కు యజమాని ఎవరో తేల్చాలని అనిల్ జైన్‌ను తెలంగాణ కోరగా.. ఆయన పై విధంగా స్పందించారు. బుధవారం వాలంతరిలో తెలంగాణ అధికారులతో అనిల్ జైన్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా.. తెలంగాణ ఏర్పడ్డాక నాగార్జునసాగర్ డ్యామ్ తాత్కాలిక నిర్వహణ తమ చేతిలో ఉండగా... శ్రీశైలం ఏపీ చేతిలో ఉందని, 2023 నవంబరులో ఏపీ ప్రభుత్వం భారీ పోలీసు బలగాలతో సాగర్ డ్యామ్ కుడివైపు భాగాన్ని ఆక్రమించుకుందని తెలంగాణ ఈఎన్‌సీ (జనరల్) జి. అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అనిల్ జైన్ మాట్లాడుతూ.. ప్రతి డ్యామ్/బ్యారేజీకి ప్రత్యేక ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం) మ్యాన్యువల్ సిద్ధం చేయాలని అనిల్ జైన్ నిర్దేశించారు. సాగర్ కట్టపై ఏపీ ఆక్రమణను తొలగించి, మరమ్మతుల కోసం తగిన చర్యలు తీసుకోవాలని అనిల్ కుమార్ కోరారు.

ఇసుక ద్వారా రూ.1200 కోట్ల రాబడి లక్ష్యం

- 24 రీచ్‌ల నుంచి ఇసుక డోర్ డెలివరీ: ఈరవత్రి అనిల్

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఈ ఆర్థిక సంవత్సరం(2025-26)లో ఇసుక విక్రయాల ద్వారా రూ.1,200 కోట్ల వార్షిక రాబడిని సాధించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) చైర్మన్ ఈరవత్రి అనిల్‌కుమార్ తెలిపారు. ఈసారి రాష్ట్రంలో నిర్మాణ రంగ కార్యకలాపాలు, ప్రభుత్వం చేపట్టే సాగునీటి ప్రాజెక్టులు, భవన, రహదారుల నిర్మాణాలు పెరుగుతాయని, తద్వారా ఇసుక విక్రయాల్లో వృద్ధి ఉంటుందని భావిస్తున్నామన్నారు. పైగా ప్రభుత్వం మూలధన వ్యయం కింద మౌలిక సదుపాయాలు కల్పించనుందని, వీటికి ఇసుక ఎక్కువ మొత్తంలో అవసరమవుతుందని, దీంతో రాబడి కూడా పెరుగుతుందని అంచనా వేశామన్నారు. హైదరాబాద్ నగరవాసులకు ఇసుకను అందుబాటులోకి ఉంచడానికి వట్టినాగులపల్లి, బౌరంపేట, అబ్దుల్లాపూర్‌మెట్, ఆదిభట్లలో ఇప్పటికే ఇసుక స్టాక్ యార్డులను ఏర్పాటు చేశామని, త్వరలో శామీర్‌పేట్, ఘట్‌కేసర్‌లలో ఇసుక బజార్లను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు.



32వ ప్రతిష్ఠాత్మక యుద్ధవీర్ స్మారక పురస్కారం అందుకుంటున్న తోట వైకుంఠం

తెలంగాణ పల్లె సంస్కృతే నాకు ప్రేరణ

- ప్రముఖ చిత్రకారుడు తోట వైకుంఠం
- ఆయనకు ప్రతిష్ఠాత్మక యుద్ధవీర్ పురస్కారం ప్రదానం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పల్లె సంస్కృతే తన చిత్రాలకు ప్రధాన ప్రేరణ అని ప్రముఖ చిత్రకారుడు తోట వైకుంఠం అన్నారు. కరీంనగర్ జిల్లా బూరుగుపల్లి గ్రామ వాతావరణం తనను చిత్రకారుడిగా మలచిందన్నారు. యుద్ధవీర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టీసీసీఐలో తోట వైకుంఠంకు 32వ ప్రతిష్ఠాత్మక యుద్ధవీర్ స్మారక పురస్కార ప్రదానోత్సవం జరిగింది. తెలంగాణ పల్లెదనాన్ని కాన్వాస్‌పై ప్రతిబింబించి అంతర్జాతీయ స్థాయిలో తెలుగు చిత్రకళ ప్రత్యేకతను చాటిన అరుదైన వ్యక్తి తోట వైకుంఠం అని ఈ సందర్భంగా వక్తలు కొనియాడారు. ఆయన కుంచెనుంచి జాలువారిన చిత్రాల్లో శ్రమైక జీవన సౌందర్యం ఉట్టిపడుతుందన్నారు. దక్కనీ కవి నరేంద్ర రాయ్‌శ్రీ వాస్తవ్ మాట్లాడుతూ 'మాభూమి', 'దాసి' సినిమాలకు వైకుంఠం కళాదర్శకుడిగా పనిచేశారని.. లండన్, న్యూయార్క్, క్యాలిఫోర్నియా, సింగపూర్, హాంకాంగ్‌ల్లోని ప్రతిష్ఠాత్మక గ్యాలరీల నుంచి చిత్ర ప్రదర్శనకు ఆయన ఆహ్వానం అందుకున్నారని తెలిపారు. యుద్ధవీర్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ విశ్రాంత ఐపీఎస్ అరుణా బహుగుణ, కార్యదర్శి విస్మావీర్, ఎమ్మెల్సీ మీర్ అమీర్ అలీఖాన్ మాట్లాడుతూ.. వైకుంఠం గీసిన చిత్రాలకు దేశ, విదేశాల్లో అమితాదరణ ఉందని, ఇది తెలంగాణకు గర్వకారణమన్నారు. తోట వైకుంఠంకు జ్ఞాపికతో పాటు రూ.లక్ష నగదు బహుమతిని నిర్వాహకులు అందజేశారు.

అతి వేగానికి ఆరుగురి బలి

- ఇంట్లోకి దూసుకెళ్లిన కారు
- వృద్ధుడు సహా, ఐదుగురు వైద్య విద్యార్థుల దుర్మరణం
- నెల్లూరు జిల్లాలో పెను విషాదం

కోవూరు, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): త్వరగా గమ్యం చేరాలన్న ఆతృతతో వేగంగా వెళుతున్న కారు ఓ పూరింటిలోకి దూసుకెళ్లడంతో ఐదుగురు వైద్య విద్యార్థులతోపాటు, ఆ ఇంట్లో నిద్రిస్తున్న ఓ వృద్ధుడు మృత్యువాత పడ్డాడు. మరో విద్యార్థి తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్నాడు. నెల్లూరు జిల్లా కోవూరు మండలం పోతిరెడ్డిపాళెం సమీపంలోని జాతీయరహదారిపై బుధవారం మధ్యాహ్నం ఈ విషాదం చోటుచేసుకుంది. నెల్లూరు నారాయణ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ రెండవ సంవత్సరం చదువుతున్న బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన చక్రధర్ సోదరి నిశ్చితార్థం బుచ్చిలో బుధవారం జరిగింది. చక్రధర్ స్నేహితులు 12 మంది ఉదయం రెండు కార్లలో వెళ్లారు. మధ్యాహ్నం భోజనాలు పూర్తయ్యాక తిరుగు ప్రయాణమయ్యారు. అయితే, కాలేజీకి త్వరగా వెళ్లాలన్న ఆతృతతో ముందు వెళుతున్న వారు కారు వేగం పెంచారు. కారు అదుపుతప్పి ఓ పూరింటిలోకి దూసుకెళ్లింది. ఇంట్లో మంచంపై పడుకుని ఉన్న నిడిగుంట రమణయ్య (65)పైకి కారు దూసుకుపోవడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఉన్న ఐదుగురు వైద్య విద్యార్థులు తీవ్ర గాయాలుపాలై చికిత్స పొందుతూ మరణించారు.

ఎల్ఆర్ఎస్ గడువు 3 రోజులు పొడిగింపు

- మరో నెల పొడిగించాలన్న అధికారులు
- ఒకటి రెండు రోజుల్లో ప్రభుత్వ నిర్ణయం!

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) గడువును ప్రభుత్వం మరో మూడు రోజులు (మే 3 వరకు) పొడిగించింది. ముందు నిర్ణయించిన ప్రకారం బుధవారంతో గడువు ముగిసిన ఈ పథకంలో సుమారు 20 లక్షల మంది ఫీజు చెల్లించాల్సిన దరఖాస్తుదారులు ఉన్నారు. వీరిలో ఇప్పటి వరకు కేవలం 6 లక్షల మందే ఫీజు చెల్లించేందుకు ముందుకొచ్చారు. ఈ నేపథ్యంలో కనీసం నెల రోజులు గడువు పెంచాలని పురపాలక శాఖ అధికారులు ప్రతిపాదించారు. తొలుత మే 15 వరకు మాత్రమే గడువు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం.. ఆ తరువాత కేవలం 3 రోజులే 'గ్రేస్ పీరియడ్'గా పేర్కొంటూ బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. ఇది సరిపోదని, కనీసం నెల రోజులు పెంచాలని అధికారులు కోరారు. దీనిపై ప్రభుత్వం ఒకటి, రెండు రోజుల్లో నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఎల్ఆర్ఎస్‌లో ఇప్పటి వరకు రూ.1,890 కోట్ల ఆదాయం వచ్చింది. అందులో సీడీఎంఏ పరిధిలోని మునిసిపాలిటీల నుంచి వచ్చిందే రూ.1,229 కోట్లు. గ్రామ పంచాయతీల నుంచి రూ.193 కోట్లు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల (యూడీఏ) నుంచి రూ.64 కోట్లు, జీహెచ్ఎంసీ నుంచి రూ.170, హెచ్ఎండీఏ నుంచి రూ.234 కోట్లు వసూలైంది. సీడీఎంఏ పరిధిలో అత్యధిక ఆదాయం రాగా.. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో ఆశించిన మేర ఆదాయం సమకూరలేదు. మార్చి నుంచి అమలులో ఉన్న ఎల్ఆర్ఎస్ గడువును ఇప్పటికే ఒకసారి ఏప్రిల్ 30 వరకు పొడిగించిన సంగతి తెలిసిందే.

మే 7 నుంచి సెలవుపై వెళుతున్న డీటీసీపీ

డీటీసీపీ దేవేందర్ రెడ్డి మే 7 నుంచి సెలవుపై అమెరికా వెళుతున్నారు. ఆయన మే 27 వరకు సెలవులో ఉంటారు. ఆయన తిరిగొచ్చే వరకు డీటీసీపీగా పూర్తి అదనపు బాధ్యతలను హెచ్ఎండీఏ డైరెక్టర్ కే విద్యాధర్‌కు అప్పగిస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

కేసీఆర్ మాటల్లో.. కళ్లలో విషం

తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయిందా? .. పదేళ్లు దోచుకున్న మీరు కాంగ్రెస్‌ను విమర్శిస్తారా?

- ఆగమైంది తెలంగాణ కాదు.. కేసీఆర్ కుటుంబం
- వరంగల్‌లో అబద్ధాలు మాట్లాడి మరో తప్పు చేశారు
- ఆ సభలో నా పేరు పలకలేకపోయారు
- ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలన్నదే మా విధానం
- బసవేశ్వరుడి స్ఫూర్తితో ముందుకెళ్తున్నాం
- బసవేశ్వరుడి జయంతి కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి



బసవేశ్వరుడి విగ్రహానికి నివాళులర్పిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం

హైదరాబాద్, ఏప్రిల్ 30, (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. కేసీఆర్ మాటల్లో, కళ్లలో విషం కనిపిస్తోందని అన్నారు. వరంగల్‌లో సభ పెట్టి రజతోత్సవం చేసుకుంటే ఆర్టీసీ బస్సులు ఇచ్చేలా ప్రభుత్వం సహకరించిందని, అయినా సభలో తమపై ఆరోపణలు చేశారని విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని అభినందించి.. ప్రజా సమస్యలను ప్రస్తావించి ఉంటే నిజంగానే ప్రజలు అభినందించే వారని అన్నారు. ఇన్నాళ్లుగా ఇంట్లో నుంచి కాలు కదపకుండా జీతభత్యాలు తీసుకున్నారని, ఇది ఏ చట్టంలో ఉందని కేసీఆర్‌నుద్దేశించి ప్రశ్నించారు. ప్రతిపక్ష నేతగా రూ.65 లక్షలు, వాహనాలు, పోలీస్ భద్రత పొందుతూ ఫాంహౌస్‌లో ఎందుకు పడుకున్నారంటూ ప్రజలు అడుగుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఇచ్చినందుకు కాంగ్రెస్ విలన్ అయిందా? అని ప్రశ్నించారు. పదేళ్లు దోచుకున్న కేసీఆర్‌కు కాంగ్రెస్‌ను విమర్శించే హక్కు లేదన్నారు. ఆగమైంది తెలంగాణ కాదని, కేసీఆర్ కుటుంబమని ఎద్దేవా చేశారు. బుధవారం రవీంద్రభారతిలో జరిగిన బసవేశ్వరుడి జయంతి కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. వంద ఎలుకలు తిన్న పిల్లి.. తీర్థయాత్రకు వెళ్లినట్లు కేసీఆర్ వరంగల్‌కు వెళ్లారని, అక్కడ అబద్ధాలు మాట్లాడి ఇంకో తప్పు చేశారని విమర్శించారు.

పథకాలపై చర్చకు సిద్ధమా!

"వరంగల్ సభలో నా పేరు కూడా పలకలేకపోయారు. ఫాంహౌస్‌లో పడుకుని ప్రజలకు కేసీఆర్ ఏం సందేశం ఇవ్వదలచుకున్నారు? సంక్షేమ పథకాలు ఆగిపోయాయని మాట్లాడారు. రైతు బంధు, ఆరోగ్యశ్రీ, ఉచిత కరెంటు, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మీ వీటిలో ఏది ఆగిపోయింది? మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, నిరుద్యోగులకు ఉద్యోగాలు.. ఇవేవీ మీకు కనిపించడంలేదా? కడుపు నిండా విషం పెట్టుకుని విద్వేషపూరిత ప్రసంగం చేసి ప్రజల్ని రెచ్చగొట్టి ఏం చేయాలనుకుంటున్నారు? ప్రజలు విజ్ఞులు.. ఎవరేం చేశారో వారికి తెలుసు. పదేళ్లు ప్రజలు మెచ్చే పరిపాలన చేస్తాం. అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చ చేద్దాం రండి. చర్చకు మేం సిద్ధం" అని రేవంత్‌రెడ్డి సవాల్ చేశారు. బసవేశ్వరుడి స్ఫూర్తితో.. 'రాష్ట్ర ఆదాయం పెంచాలి...పేదలకు పంచాలి' అనే విధానంతో ముందుకెళ్తున్నామని తెలిపారు. ప్రజలకు మేలు చేయడమే తమ పని అని, ప్రచారం చేయాల్సింది ప్రజలేనని అన్నారు. ప్రజలే తమ బ్రాండ్ అంబాసిడర్లని చెప్పారు. 12వ శతాబ్దంలోనే సమాజంలో అనేక మార్పులకు పునాదులు వేసిన విప్లవకారుడు బసవేశ్వరుడని చెప్పారు. కుల, మత, లింగ వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన అభ్యుదయవాది బసవన్న అన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తమ ప్రభుత్వం విఫలమైందంటున్న వారు ఎక్కడ విఫలమైందో చెప్పాలన్నారు. ప్రణాళిక ప్రకారంగా పథకాలు తేవడం వైఫల్యమా?కులగణన సర్వే చేయడమా? ఉద్యోగాలివ్వడమా? అని ప్రశ్నించారు. కులగణన సర్వేను విమర్శిస్తూ బీఆర్ఎస్, బీజేపీ నాయకులు బీసీలకు మేలు జరగకుండా అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. బీసీ బిల్లును నేరుగా వ్యతిరేకించకుండా ప్రభుత్వంపై అవాకులు, చవాకులు పేలుతూ కుయుక్తులు పన్నుతున్నారని ధ్వజమెత్తారు. ఆ రెండు పార్టీల పట్ల సమాజం అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కార్మికలోకానికి 'మే'డే శుభాకాంక్షలు

- శ్రామికులే అభివృద్ధిలో అసలైన భాగస్వాములు
- త్వరలో గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్ల సంక్షేమ బిల్లు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్మిక లోకానికి 'మే' డే శుభాకాంక్షలు తెలిపారు. శ్రామికులే అభివృద్ధిలో అసలైన భాగస్వాములని పేర్కొన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రజాప్రభుత్వం పాలనలో అంతర్జాతీయ కార్మిక దినోత్సవ స్ఫూర్తి అన్ని రంగాలకు విస్తరిస్తుందని, కార్మికులకు సముచిత గౌరవం లభిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. మే డే స్ఫూర్తితో ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందని అన్నారు. తాము అధికారం చేపట్టిన వెంటనే గిగ్ వర్కర్ల కోసం రూ.5లక్షల ప్రమాద బీమాను అమలు చేశామని తెలిపారు. ఇక, తెలంగాణ గిగ్, ప్లాట్‌ఫాం వర్కర్ల సంక్షేమ బిల్లు-2025ను త్వరలో తీసుకువస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల ద్వారా లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తున్నదని సీఎం పేర్కొన్నారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ శాఖల్లో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలను భర్తీ చేశామన్నారు. గల్ఫ్ దేశాల్లో పని చేస్తున్న తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం ప్రవాసీ ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించామని చెప్పారు.

సింహాచలం ఘటన ఆవేదన కలిగించింది : సీఎం

సింహాచలంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద గోడ కూలి భక్తులు మరణించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భక్తులు మరణించిన ఘటన తీవ్ర ఆవేదన కలిగించిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఘటనలో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని, బాధిత కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నానని సీఎం రేవంత్ ఎక్స్‌లో పోస్టు చేశారు.

బెదిరించి బీఆర్ఎస్ ఎన్నికల బాండ్లు కొనిపించారు

- తప్పుడు కేసులు పెట్టి వేధించారు
- ప్రభాకర్‌రావుకు ముందస్తు బెయిల్ ఇవ్వొద్దు
- సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావు వాదన

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు తనను బెదిరించి బీఆర్ఎస్ పార్టీ పేరిట ఎన్నికల బాండ్లు కొనిపించారని.. ఆయనకు ముందస్తు బెయిల్ ఇవ్వరాదని హైకోర్టుకు సంధ్య కన్వెన్షన్ ఎండీ శ్రీధర్‌రావు విజ్ఞప్తి చేశారు. ప్రభాకర్‌రావు ముందస్తు బెయిల్ పిటిషన్‌లో తన వాదన కూడా వినాలంటూ శ్రీధర్‌రావు ఇంప్లీడ్ అయ్యారు. దీనిపై జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో ప్రభాకర్‌రావు కీలకంగా వ్యవహరించారని శ్రీధర్‌రావు వివరించారు. తన ఫోన్ ట్యాప్ చేసి కదలికలపై నిఘా పెట్టారని.. బెంగళూరు వెళ్తే అక్కడికి వచ్చి అరెస్ట్ చేశారని తెలిపారు. తనపై 25 తప్పుడు క్రిమినల్ కేసులు పెట్టి బెదిరించారని, భారీగా డబ్బు డిమాండ్ చేశారని.. బీఆర్ఎస్ పార్టీ పేరిట ఎన్నికల బాండ్లు కొనిపించారని ఆరోపించారు. ప్రభాకర్‌రావు వల్ల తాను బాధితుడిగా మారినందున.. ప్రభాకర్‌రావుకు బెయిల్‌ను వ్యతిరేకించే హక్కు తనకు ఉందని వివరించారు. అమెరికాలో కూర్చుని బెయిల్ ఇస్తేనే ఇక్కడికి తిరిగి వస్తానని ఆయన చెప్పడం సరికాదని పేర్కొన్నారు. ఇక ప్రభాకర్‌రావు తరఫున సీనియర్ న్యాయవాది టి.నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఈ బెయిల్ పిటిషన్‌లో శ్రీధర్‌రావు జోక్యం ఏమిటని ప్రశ్నించారు. శ్రీధర్‌రావుపై 25 క్రిమినల్ కేసులు ఉన్నాయని, ఆయన వాదనలు వినాల్సిన అవసరం అసలే లేదని పేర్కొన్నారు. శ్రవణ్‌రావు తరహాలో ముందస్తు బెయిల్ ఇవ్వాలని, ప్రభాకర్‌రావు భారత్‌కు తిరిగొచ్చి దర్యాప్తు అధికారి ఎదుట హాజరవుతారని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం తీర్పును రిజర్వు చేసింది.

చందనోత్సవంలో ఘోర విషాదం

సింహగిరిపై గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి.. నాలుగు రోజుల కిందటే హడావుడిగా నిర్మాణం పూర్తి

- భారీ వర్షం, గాలులతో కుప్పకూలిన గోడ
- సిమెంటు ఇటుకలు, మట్టి కింద నలిగిన భక్తులు
- ఒకే కుటుంబంలో నలుగురు మృతి
- వారిలో హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ జంట
- మృతుల కుటుంబాలకు 25 లక్షల ఎక్స్‌గ్రేషియా





కూలిన గోడ వద్ద ఎన్‌డీఆర్ఎఫ్, ఇతర సిబ్బంది సహాయక చర్యలు, మృతదేహాలను బయటకు తీస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది

విశాఖపట్నం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): సింహాచలం వరాహలక్ష్మీనృసింహ స్వామి చందనోత్సవంలో ఘోర విషాదం చోటుచేసుకుంది. వర్షపు నీటిని మళ్లించేందుకు నిర్మించిన గోడ భారీ వర్షానికి కుప్పకూలింది. అప్పన్న నిజరూప దర్శనం కోసం క్యూలో వెళుతున్న ఏడుగురు భక్తులను బలి తీసుకుంది. వీరిలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులైన యువ దంపతులతో పాటు మరో ఇద్దరు కూడా అదే కుటుంబానికి చెందినవారు కావడం మరింత విషాదకరంగా మారింది.

ఈదురుగాలులతో భారీ వర్షం వల్ల..

అప్పన్న చందనోత్సవానికి హాజరయ్యే భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా భారీ ఏర్పాట్లు చేశారు. వేర్వేరు క్యూలైన్లు నిర్మించారు. బుధవారం తెల్లవారుజామున రెండు గంటలకు స్వామి వారి నిజరూప దర్శనం ప్రారంభమైంది. భక్తులు క్యూలలో వెళుతున్నారు. 2.30 గంటలకు ఈదురుగాలులతో భారీ వర్షం మొదలైంది. భక్తుల కోసం కొత్త షాపింగ్ కాంప్లెక్స్‌ను ఆనుకుని ఏర్పాటు చేసిన రూ.300 దర్శనం క్యూ పక్కన ఉన్న రిటైనింగ్ వాల్ ఒక్కసారిగా కుప్పకూలి.. పలువురు భక్తులు కూరుకుపోయారు. అధికారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. హోం మంత్రి వంగలపూడి అనిత ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ సిబ్బంది వచ్చి మృతదేహాలను బయటకు తీశారు. విశాఖపట్నానికి చెందిన పిల్లా మహేశ్ (30), ఆయన భార్య శైలజ (27)తోపాటు శైలజ మేనత్త గుజ్జారి మహాలక్ష్మి (65), శైలజ తల్లి పైలా వెంకటరత్నం (45), బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటకు చెందిన కుంపట్ల మణికంఠ ఈశ్వర శేషారావు (29), పత్తి దుర్గాప్రసాద్ నాయుడు (30), విశాఖపట్నానికి చెందిన ఎడ్ల వెంకటరావు (58) మృతుల్లో ఉన్నారు. ఇందులో మహేశ్, శైలజ ఇద్దరూ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. మహేశ్ హెచ్‌సీఎల్ కంపెనీలో, శైలజ ఇన్ఫోసిస్ కంపెనీలో పనిచేస్తున్నారు. మూడేళ్ల క్రితం వారికి వివాహమైంది. ఆ తర్వాత ఇద్దరూ విశాఖ నుంచే వర్క్ ఫ్రం హోం చేస్తున్నారు.




మృతి చెందిన పిల్లా మహేశ్, శైలజ దంపతులు

నాసిరకం నిర్మాణంతో..

వాన పడితే కొండపైనుంచి షాపింగ్ మాల్ వరకు నీరు వస్తుండటంతో.. కేంద్ర ప్రభుత్వ నిధులతో 'ప్రసాద్' పథకం కింద భారీ రిటైనింగ్ వాల్ నిర్మించారు. నాలుగు రోజుల క్రితమే అది పూర్తయింది. బలమైన పునాదులు లేకుండా, కాంక్రీట్ ఇటుకలతో నిర్మించారు. సరిగ్గా క్యూరింగ్ కూడా జరగలేదని గుర్తించారు. భారీవర్షానికి కొండ పైనుంచి నీరు వేగంగా ప్రవహించడంతో... ఆ ఒత్తిడికి గోడ కింద మట్టి కోసుకుపోయి కుప్పకూలింది. సింహాచలంలో ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యానికి భక్తుల ప్రాణాలు బలయ్యాయని విమర్శలు వస్తున్నాయి.

కర్రెగుట్టల్లో ఐబీ చీఫ్

- కూంబింగ్‌ను పరిశీలించిన తపన్ డేకా
- అడవుల్లోకి భారీగా తరలుతున్న బలగాలు





కర్రె గుట్టల మధ్యలో నీటి కొలను వద్ద బలగాలు; జాతీయ జెండాతో జవాన్

చర్ల/వెంకటాపురం, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఓవైపు భారత్-పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా.. మరోవైపు మావోయిస్టుల ఏరివేతకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్' ఊపందుకుంది. బలగాల ఆపరేషన్‌ను స్వయంగా పర్యవేక్షించేందుకు భారత ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) చీఫ్ తపన్ డేకా బుధవారం తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో పర్యటించారు. మావోయిస్టుల కంచుకోటలో పాగా వేసిన బలగాలను ఆయన ఈ సందర్భంగా అభినందించారు. మంగళవారమే ఆయన ఛత్తీస్‌గఢ్ రాజధాని రాయ్‌పూర్‌కు చేరుకోగా.. సాయంత్రం పోలీసు ఉన్నతాధికారులు, సీఆర్‌పీఎఫ్ అధికారులతో భేటీ అయినట్లు తెలిసింది. బుధవారం ఉదయం బస్తర్ రీజియన్‌లోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలను సందర్శించిన ఆయన.. మధ్యాహ్నం హెలికాప్టర్ ద్వారా కర్రెగుట్టలకు చేరుకున్నారు. మావోయిస్టులు, పౌరహక్కుల సంఘాలు శాంతి చర్చలకు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఐబీ చీఫ్ సందర్శన ప్రాధాన్యతను సంతరించుకుంది. అప్పటికే జవాన్లు కర్రెగుట్టల్లో ఏర్పాటు చేసిన తాత్కాలిక క్యాంప్‌ను ఆయన సందర్శించినట్లు సమాచారం. నిన్నమొన్నటి వరకు మావోయిస్టుల కంచుకోటగా ఉంటూ.. జనతన సర్కార్ పేరుతో గూడేలను పాలించిన ప్రాంతంలో.. బుధవారం తొలిసారి జాతీయ జెండా ఎగిరినట్లు సమాచారం. ఆ జెండాను ఓ జవాన్ తీసుకెళ్తున్న దృశ్యం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ప్రస్తుతం కర్రెగుట్టల్లోని దోబికొండ, నీలం సరాయి గుట్టలు పూర్తిస్థాయిలో బలగాల ఆధీనంలోకి వచ్చినట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. ఇంకా 10 వరకు కీలక గుట్టలు, వందల సంఖ్యలో గుహల్లో కూంబింగ్ నిర్వహించాల్సి ఉన్నట్లు వివరించాయి. 'ఆపరేషన్ కర్రెగుట్టలు' ప్రారంభమై తొమ్మిది రోజులైనా.. మావోయిస్టులు దుర్గం గుట్టలకు మకాం మార్చారని కేంద్ర బలగాలకు సమాచారం ఉన్నా.. అడపాదడపా బాంబుల మోత మోగుతోందని స్థానికులు చెబుతున్నారు. మరో వారంపది రోజుల్లో కర్రెగుట్టల్లో శాశ్వత బేస్ క్యాంప్‌ను నిర్మించే దిశలో బలగాలు చర్యలు తీసుకుంటున్నాయని సమాచారం. మావోయిస్టు కంచుకోటలను బలగాలు చుట్టుముట్టగానే హక్కుల కార్యకర్తలు శాంతి చర్చలకు పట్టుబడుతున్నారని ఛత్తీస్‌గఢ్ హోంమంత్రి విజయ్‌శర్మ విమర్శించారు. గతంలో మావోయిస్టులు ఉచ్చుపన్ని బలగాలను మట్టుబెట్టినప్పుడు శాంతి గుర్తుకురాలేదా? అని నిలదీశారు.

'భాక్రా నంగల్' జలాల్ని మాకివ్వండి

- రాష్ట్ర తాగునీటి అవసరాలు తీరతాయి
- లేదంటే అదనపు నీరు పాక్‌కు వెళ్తుంది
- పంజాబ్‌ను కోరిన హరియాణా సీఎం


నాయబ్‌సింగ్ సైనీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: భాక్రా నంగల్ రిజర్వాయ జలాలను తమ రాష్ట్రంలో తాగునీటి అవసరాలకు విడుదల చేయాలని హరియాణా సీఎం నాయబ్‌సింగ్ సైనీ పంజాబ్ ప్రభుత్వాన్ని కోరారు. లేదంటే అదనపు జలాలు అనవసరంగా పాకిస్థాన్‌కు వెళ్తాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పాక్‌తో సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసిన నేపథ్యంలో సైనీ ఈ అభ్యర్థన చేయడం గమనార్హం. సింధు జలాల ఒప్పందం పరిధిలోకి అతిపెద్ద భాక్రా నంగల్ రిజర్వాయర్ కూడా వస్తుంది. వర్షాకాలంలోపు ఈ జలాశయంలోని నీటిని ఖాళీ చేయాల్సి ఉందని, అప్పుడే వరద నీటిని నిల్వ చేసుకోవడానికి అవకాశం ఉంటుందని సైనీ తెలిపారు. తమ రాష్ట్రానికి తాగునీటి అవసరాలకు నీళ్లివ్వాలని.. లేదంటే అదనపు జలాలు పాకిస్థాన్‌కు వెళ్లడం వినహా ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. హరియాణా ఇప్పటికే వాటాకు మించి జలాలను వాడుకుందన్న పంజాబ్ ప్రకటనపై స్పందిస్తూ.. అసలు తమకు రావాల్సిన వాటా జలాలు పూర్తిగా అందుబాటులోకి రాలేదని సైనీ చెప్పారు. సింధు జలాల ఒప్పందాన్ని రద్దు చేసిన నేపథ్యంలో.. చీనాబ్, జీలం సహా ఇతర నదుల నీటిని ఉత్తరాది రాష్ట్రాల వ్యవసాయ అవసరాలు తీర్చేందుకు మళ్లించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.



భారత్ దెబ్బకు పాక్‌లో ఎండిన చీనాబ్!

- సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా శాటిలైట్ చిత్రాలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: పహల్గాం ఉగ్ర దాడి నేపథ్యంలో సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపేయడంతో దాయాది దేశం పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరవుతోంది. రోజుల వ్యవధిలోనే పాక్‌లోని సియాల్‌కోట్‌లో ప్రవహించే చీనాబ్ నది ఎండిపోయింది. దీనికి సంబంధించిన శాటిలైట్ చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. పాక్‌కు జీవనాడి అయిన సింధు జలాలను కట్టడి చేయడంతో.. ఏప్రిల్ 29వ తేదీ కల్లా పొరుగు దేశంలో ప్రధాన నది అయిన చీనాబ్‌లో ప్రవాహాలు పూర్తిగా కనుమరగయ్యాయి.

పాక్‌లో హఫీజ్ విలాస జీవితం!

- లాహోర్‌లో కట్టుదిట్టమైన భద్రత మధ్య జీవనం
- బట్టబయలు చేసిన శాటిలైట్ ఫొటోలు, వీడియోలు



లాహోర్, ఏప్రిల్ 30: ముంబై పేలుళ్ల సూత్రధారి, లష్కరే తాయిబా ఉగ్రవాద సంస్థ చీఫ్ హఫీజ్ సయీద్ పాకిస్థాన్‌లో విలాసవంతమైన జీవితం గడుపుతున్న విషయం బట్టబయలైంది. దీనికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు తాజాగా బయటికి వచ్చాయి. పాకిస్థాన్ ప్రభుత్వం అతనికి కట్టుదిట్టమైన భద్రతను కల్పించిన విషయం కూడా ఈ ఫొటోలు, వీడియోల ద్వారా తెలుస్తోంది. పాకిస్థాన్ రాజధాని లాహోర్‌లో జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతంలోనే అతడు నివసిస్తున్నాడు. తాజాగా పహల్గాంలో జరిగిన ఉగ్రదాడికి కూడా అతడే ప్రధాన సూత్రధారిగా భావిస్తున్నారు. హఫీజ్ సయీద్ నివాసం ఉండే ప్రాంతంలో 24 గంటలూ భద్రత కల్పిస్తున్నారు. ఉపగ్రహ చిత్రాల్లో మూడు ఆస్తులు కనిపిస్తున్నాయి. వాటిలో ఒక పెద్ద భవనంలో అతడు నివసిస్తున్నాడు. అదే మసీదు. దీంతోపాటు మదరసా, హఫీజ్‌కు వ్యక్తిగత సౌకర్యాలు కల్పించిన ప్రైవేటు పార్కు కూడా ఉన్నాయి. ఆ ప్రైవేటు పార్కు కొత్తగా నిర్మించినది. అతడు జైల్లో ఉన్నాడని పాకిస్థాన్ ప్రభుత్వం చెబుతున్నది అబద్ధమేనని తాజా వీడియోలు స్పష్టం చేస్తున్నాయి.

రేషన్ కార్డు ఇక్కడే ఉంది.. ఓటూ వేస్తున్నాను!

- ఇప్పుడు పాక్ వెళ్లి ఏం చేయాలి.. పాక్ జాతీయుడి ఆవేదన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: పాకిస్థానీలు ఎవ్వరున్నా భారత్‌ను వీడి పోవాల్సిందేనని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేయడంతో ఇక్కడ ఉంటున్న ఆ దేశస్తులు సరిహద్దు దాటుతున్న నేపథ్యంలో ఓ పాకిస్థానీయుడు.. "నేను పాక్‌కు వెళ్లి ఏం చేయాలి?" అని ప్రశ్నిస్తున్నాడు. దీనికన్నా, అతడు చెప్పిన మిగతా విషయాలే అధికారులను షాక్‌కు గురిచేస్తున్నాయి! ఆ పాక్ జాతీయుడి పేరు ఉస్మాన్! తాను భారత్‌లో 17 ఏళ్లుగా ఉంటున్నానని.. తనకు రేషన్ కార్డు కూడా ఉందని, ఎన్నికలొచ్చినప్పుడల్లా ఓటు కూడా వేస్తున్నానని చెబుతున్నాడు. "నేను భారత్‌లోనే పదో తరగతి, ఇంటర్ పూర్తి చేశాను. ఇప్పుడు డిగ్రీ చదువుతున్నాను. చదువు పూర్తయ్యాక ఏదైనా ఉద్యోగం సంపాదించేందుకు ఇంటర్వ్యూలకూ వెళ్లాలనే ప్రణాళికతో ఉన్నాను. ఇప్పుడు పాకిస్థాన్‌కు వెళ్లి నేను ఏం చేయాలి? నాకు అక్కడ భవిష్యత్తు ఉంటుందా?" అని ఉస్మాన్ చెప్పుకొచ్చాడు. పాక్ జాతీయులను తిప్పిపంపే ఆలోచనపై భారత ప్రభుత్వం పునరాలోచన చేయాలని విజ్ఞప్తి చేశాడు.

చార్‌ధామ్ యాత్ర ప్రారంభం

ఉత్తరకాశీ/డెహ్రాడూన్, ఏప్రిల్ 30: అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకొని యమునోత్రి, గంగోత్రి దేవాలయాల తలుపులు భక్తుల కోసం తెరుచుకున్నాయి. దీంతో లక్షలాది మంది భక్తులు ఎదురుచూస్తున్న పవిత్ర చార్‌ధామ్ యాత్ర ప్రారంభమయింది. ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశి జిల్లాలో యమునోత్రి, గంగోత్రి దేవాలయాలు ఉన్నాయి. కేదార్‌నాథ్ దేవాలయాన్ని శుక్రవారం, బద్రీనాథ్ దేవాలయాన్ని ఆదివారం తెరుస్తారు. చార్‌ధామ్ యాత్ర ప్రారంభాన్ని పురస్కరించుకొని ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి ఎక్స్‌లో భక్తులకు స్వాగతం పలికారు. చార్‌ధామ్ యాత్ర యమునోత్రితో ప్రారంభమై గంగోత్రి, కేదార్‌నాథ్‌ల మీదుగా సాగి బద్రినాథ్‌తో ముగుస్తుంది.

చెరకు గిట్టుబాటు ధర రూ.355కు పెంపు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: చెరకు రైతులకు కేంద్రం శుభవార్త చెప్పింది. చెరకు గిట్టుబాటు ధర(ఎఫ్ఆర్‌పీ)లను క్వింటాల్‌కు 4.41% మేర పెంచి రూ.355 చేసింది. ఈ ఏడాది అక్టోబరు నుంచి ప్రారంభమయ్యే 2025-26 సీజన్ నుంచి ఈ ధరలు అమలులోకి వస్తాయి. ప్రధాని మోదీ నేతృత్వంలో బుధవారం జరిగిన క్యాబినెట్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. షుగర్ మిల్లులు చెరకు రైతులకు చెల్లించే కనీస గిట్టుబాటు ధరను ఎఫ్ఆర్‌పీ(ఫెయిర్ అండ్ రెమ్యునరేటివ్ ప్రైస్) అంటారు. ప్రస్తుతం 2024-25 సీజన్‌కు గాను ఈ ఎఫ్ఆర్‌పీ క్వింటాల్‌కు రూ.340గా ఉంది.

సిసోడియా, సత్యేందర్ జైన్‌పై ఏసీబీ కేసు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు సిసోడియా, సత్యేందర్ జైన్‌కు మరిన్ని కష్టాలు చుట్టుముట్టాయి. మద్యం విధానం కుంభకోణం, మనీలాండరింగ్ కేసులో పీకల్లోతులో కూరుపోయిన ఈ నేతలపై తాజాగా మరో కేసు నమోదైంది. రూ.2వేల కోట్లు వెచ్చించి చేపట్టిన 12,748 తరగతి గదులు, భవనాల నిర్మాణంలో కుంభకోణానికి సంబంధించి సిసోడియా, సత్యేందర్‌పై ఏసీబీ బుధవారం కేసు నమోదు చేసింది. తరగతి గదుల నిర్మాణ కాంట్రాక్టును 34మందికి అప్పగించారని, వీరిలో ఎక్కువమంది ఆప్ నేతలకు సన్నిహితులేనని ఏసీబీ తన నివేదికలో స్పష్టం చేసింది. ఒక్కో తరగతి గది నిర్మాణానికి రూ.24.86 లక్షలను టెండర్లలో కోట్ చేశారని.. ఢిల్లీలో ఇందుకు రూ.5లక్షల చొప్పున మాత్రమే సరిపోతాయని ఏసీబీ పేర్కొంది.

ఏ క్షణంలోనైనా పాక్‌పై దాడి?

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులుగా నియమించింది. పాక్ సీమాంతర ఉగ్రవాదం గురించి చాటిచెప్పడంతోపాటు తాము తీసుకోబోయే చర్యలను వివరించేందుకు భారత్ జీ-20, గల్ఫ్ దేశాలతో సహా ఇప్పటికే 25 ప్రధాన దేశాలను సంప్రదించింది. పాకిస్థాన్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న తాలిబాన్‌ను కూడా విశ్వాసంలోకి తీసుకున్నట్లు సమాచారం. పహల్గాం ఉగ్రదాడిని తాలిబాన్ తీవ్రంగా ఖండించిన సంగతి తెలిసిందే. ఖైబర్ పఖ్తున్‌ఖ్వాలో పాకిస్థాన్ ఇప్పటికే తాలిబాన్ తిరుగుబాటును ఎదుర్కొంటోంది. ఈ క్రమంలో భారత విదేశాంగ శాఖ సంయుక్త కార్యదర్శి ఆనంద్ ప్రకాశ్ నేతృత్వంలో భారత ప్రతినిధులు కాబూల్ చేరుకుని తాలిబాన్ విదేశాంగ మంత్రితో చర్చలు జరిపారు. తాజాగా కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ స్వయంగా పీ5 దేశాలైన అమెరికా, చైనా, బ్రిటన్, రష్యా, ఫ్రాన్స్ విదేశాంగ మంత్రులతో మాట్లాడారు. మరోవైపు బుధవారం రెండోసారి జరిగిన భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో ప్రధాని మోదీ త్రివిధ దళాల సన్నద్ధతపై సమీక్షించారు. త్రివిధ దళాలు ఇప్పటికే కీలక విన్యాసాలు ప్రారంభించాయని అధికారులు ప్రధానికి వివరించినట్లు తెలిసింది. భారత వైమానిక దళం 'ఆక్రమణ్' పేరుతో నేలపై, పర్వతాలపై దాడులు జరిపేందుకు విన్యాసాలు ప్రారంభించగా, ఆర్మీ నైరుతి కమాండ్ తమ దళాలకు ఆయుధాల ప్రయోగంలో శిక్షణను ముమ్మరం చేసింది.


మంగళవారం డెహ్రాడూన్‌లో సైనికుల విన్యాసాలు(ఫైల్)

పాక్ కాల్పులు.. భారత్ ఎదురుకాల్పులు..

జమ్మూకశ్మీరులోని పరగవాల్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వద్ద నిబంధనలను ఉల్లంఘించి బుధవారం పాక్ దళాలు కాల్పులు జరిపాయి. వారికి మన సైన్యం ఎదురు కాల్పులతో దీటైన జవాబిచ్చింది. మరోవైపు సింధు జలాల ఒప్పందం రద్దును అమలు చేసే విషయమై కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ బుధవారం రాత్రి కీలక చర్చలు జరిపారు.

జాతీయ భద్రతా సలహా బోర్డు..

భారతదేశ రక్షణ పరిస్థితిని విశ్లేషించి, ఎప్పటికప్పుడు సిఫారసులు చేసేందుకు గాను జాతీయ భద్రతా సలహా బోర్డును పునర్వ్యవస్థీకరించారు. దీనికి చైర్మన్‌గా రా మాజీ చీఫ్ అలోక్ జోషీని నియమించారు. ఈ బోర్డులో ముగ్గురు సైనిక నేపథ్యం, ఇద్దరు పోలీసు నేపథ్యం, ఒకరు విదేశాంగ వ్యవహారాల నేపథ్యం కలిగిన వారు ఉన్నారు. సదరన్ ఆర్మీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ ఏకే సింగ్, వెస్ట్రన్ ఎయిర్ మాజీ కమాండర్ ఎయిర్ మార్షల్ పీఎం సిన్హా, మాజీ రేర్ అడ్మిరల్ మాంటీ ఖన్నా, మాజీ ఐపీఎస్ అధిరులు రాజీవ్ రంజన్ వర్మ, మన్మోహన్ సింగ్, విదేశాంగ శాఖ మాజీ అధికారి బి.వెంకటేశ్ వర్మ వీరిలో ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన మాజీ ఐఎఫ్ఎస్ అధికారి వెంకటేశ్ వర్మ హైదరాబాద్ పబ్లిక్ స్కూలులో, నిజాం కాలేజీలో చదివారు. 1988 బ్యాచ్ అధికారి అయిన వర్మ.. రష్యా, చైనా దేశాలకు రాయబారిగా పనిచేశారు. భారత్-అమెరికా అణు ఒప్పందంలో కీలక పాత్ర పోషించారు. పాకిస్థాన్‌పై తదుపరి దశ ఆంక్షలు, దాడులపై ఈ బోర్డు సలహాలు ఇవ్వనుంది.

పాక్‌కు మన గగనతలం బంద్

పాకిస్థాన్‌కు చెందిన అన్ని రకాల విమానాలకు గగనతలాన్ని మూసివేస్తూ భారత్ బుధవారం నిర్ణయం తీసుకుంది. పాక్ ఇప్పటికే భారత విమానాలకు తమ గగనతలాన్ని మూసివేసింది. తాజాగా భారత్ ఆ చర్య తీసుకుంది. దీనితో పాక్ నుంచి దక్షిణాసియా, ఆగ్నేయాసియా దేశాలకు వెళ్లే విమానాలు.. చైనా లేదా శ్రీలంక మీదుగా చుట్టూ తిరిగి వెళ్లాల్సిందే. ఇప్పటికే ఆర్థికంగా కుదేలైన పాక్ విమానయాన సంస్థలకు దీనితో మరింత దెబ్బతగలడం ఖాయమని నిపుణులు చెబుతున్నారు.

786 పాకిస్థాన్‌కు.. 1,465మంది భారత్‌కు..

పాకిస్థానీల వీసాల రద్దు నిర్ణయం తర్వాత భారతదేశం నుంచి 786 మంది పాక్ దేశస్థులు వెళ్లిపోయారు. వీరిలో దౌత్యవేత్తలు, వారి కుటుంబసభ్యులు, సిబ్బంది కూడా ఉన్నారు. వీరితో పాటు పాక్ వీసా కలిగి ఉన్న 8 మంది భారతీయులు కూడా వెళ్లిపోయారు. మరోవైపు, పాకిస్థాన్ నుంచి 1,465 మంది ఇండియాకు వచ్చారు.

ఆలస్యం చేయొద్దు: రాహుల్

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: పహల్గాంలో 28 మంది పర్యాటకుల ప్రాణాలను బలిగొన్న ఉగ్రమూక భారీ మూల్యం చెల్లించుకోవాల్సిందేనని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ దాడికి బాధ్యులైన వారిపై ఆలస్యం చేయకుండా ప్రధాని మోదీ కఠిన చర్యలు తీసుకోవాలని.. తద్వారా ఇలాంటి మూర్ఖపు చేష్టలకు పాల్పడితే భారత్ ఎంతమాత్రం ఉపేక్షించదనే గట్టి సందేశాన్ని ఇవ్వాలని పేర్కొన్నారు. పహల్గాం ఘటనలో ప్రభుత్వం తీసుకోబోయే చర్యలకు తమ నుంచి వందశాతం మద్దతు ఉంటుందని రాహుల్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

లోకం తీరు



పాక్ సైన్యంలో తిరుగుబాటు?



న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: పహల్గాం ఉగ్ర దాడికి ప్రతీకారంగా భారత్ యుద్ధానికి దిగుతుందని పాకిస్థాన్ పాలకులే కాదు.. సైన్యం కూడా భయపడుతున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. కొందరు సైనికులు, సైన్యాధికారులు తిరుగుబాటు చేయగా.. పలువురు ఏకంగా ఆర్మీకే గుడ్‌బై చెప్పేశారని 'ఎకనమిక్ టైమ్స్' పత్రిక తాజాగా కథనం ప్రచురించింది. అన్నిటి కంటే ముఖ్యంగా.. ఆర్మీ చీఫ్ జనరల్ అసీం మునీర్ అజ్ఞాతంలోకి వెళ్లినట్లు ప్రచారం జరుగుతున్నట్లు వెల్లడించింది. ఆయన పాక్ ఆర్మీ హెడ్‌క్వార్టర్స్ రావల్పిండిలో బంకర్లో దాక్కుని ఉన్నారని పాక్ ప్రభుత్వంలో కొందరు అధికారులు చెబుతుండగా.. కుటుంబంతో కలిసి విదేశాలకు పరారయ్యారని సోషల్ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. అయితే, పాక్ దీన్ని కొట్టిపారేసింది. యుద్ధభయంతో కుటుంబ సభ్యుల ఒత్తిడి తట్టుకోలేక ఇప్పటికే 4,500 మంది సైనికులు, 250 మంది సైన్యాధికారులు పాక్ సైన్యానికి గుడ్‌బై చెప్పేశారని 'ది డైలీ గార్డియన్' పత్రిక తెలిపింది. ఇంకొన్ని వేల మంది ఉద్యోగాలకు రాజీనామా దరఖాస్తులు సమర్పించారు. దీంతో ఆర్మీ చీఫ్ మునీర్ షాకైనట్లు తెలిసింది. సైన్యంలో ధైర్య స్థైర్యాలు నింపేందుకు ఇంటర్-సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్‌పీఆర్) డీజీ మేజర్ జనరల్ ఫైసల్ మెహమూద్ మాలిక్‌ను రంగంలోకి దించారు. ఆయన అన్ని ర్యాంకుల సాయుధ బలగాలనుద్దేశించి ఏప్రిల్ 26న రాసిన రహస్య లేఖ వెలుగులోకి వచ్చింది. మనోబలం కోల్పోవద్దని.. దేశానికి విశ్వాసపాత్రులుగా ఉండాలని మాలిక్ అందులో కోరారు.

24-36 గంటల్లో మాపై దాడి..

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: రాబోయే 24-36 గంటల్లో (నేడో, రేపో) భారతదేశం తమపై సైనిక దాడి చేస్తుందని పాకిస్థాన్ సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అతలుల్లా తరార్ అన్నారు. ఈ విషయమై తమకు విశ్వసనీయ సమాచారం ఉందని చెప్పారు. సైనిక చర్య కోసం భారత్.. పహల్గాం ఉగ్రదాడిని సాకుగా వాడుకోవాలని చూస్తోందన్నారు. భారత్ దాడి చేస్తే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సైనిక దాడి తర్వాతి పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని బుధవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. అయితే, ఈ వ్యాఖ్యలపై భారత్ స్పందించలేదు. త్రివిధ దళాలకు భారత ప్రభుత్వం పూర్తి స్వేచ్ఛనిచ్చిందన్న వార్తల నేపథ్యంలో తరార్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు, భారత్ దాడి చేస్తుందన్న అంచనాల నేపథ్యంలో ఇస్లామాబాద్, లాహోర్ నగరాలను నో ఫ్లై జోన్‌గా ప్రకటించారు. ఈ రెండు నగరాల గగనతలంలో ఎలాంటి విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లు ఎగరకుండా ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం వరకు ఈ ఆదేశాలు అమల్లో ఉంటాయని తెలిపారు. పాకిస్థాన్‌లో రెగ్యులర్ విమాన సర్వీసులను కూడా తగ్గించినట్లు సమాచారం. పాక్ ఆక్రమిత కశ్మీరులోని గిల్గిట్, స్కర్దు వైపు వెళ్లే విమాన సర్వీసులను ప్రైవేటు విమాన సంస్థలు రద్దు చేశాయి. కాగా, పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ కూడా తరార్ చేసినటువంటి వ్యాఖ్యలే చేశారు. పాకిస్థాన్‌పై ఇండియా తప్పకుండా దాడి చేస్తుందని భావిస్తున్నానని చెప్పారు.


తరార్

పహల్గాం దాడిని ఖండించిన ఐక్యరాజ్య సమితి

- జైశంకర్‌కు, పాక్ ప్రధానికి ఫోన్



న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: పహల్గాం ఉగ్రదాడితో ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ ఐక్యరాజ్య సమితి రంగంలోకి దిగింది. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో పాటు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రస్ మంగళవారం వేర్వేరుగా ఫోన్‌లో మాట్లాడారు. ఉగ్రదాడిని ఆయన తీవ్రంగా ఖండించారు. భారత్-పాక్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలపై ఆందోళన వ్యక్తం చేశారు. విషాదకర పరిణామాలకు దారితీసే ఘర్షణను నివారించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. కాగా, ఈ మారణకాండకు పాల్పడిన వారితో పాటు దీనికి కుట్రదారులు, మద్దతుదారులను కఠినంగా శిక్షించాలని భారత్ కృతనిశ్చయంతో ఉందని ఆయనకు వివరించినట్లు జైశంకర్ ఓ పోస్టులో తెలిపారు. కాగా, పహల్గాం ఘటనపై పారదర్శకమైన, తటస్థ దర్యాప్తు కోసం విజ్ఞప్తి చేశానని షరీఫ్ తెలిపారు. ఇదిలా ఉండగా, ఉగ్రదాడిపై అల్జీరియా, గ్రీస్, సియెర్రా లియోన్, గయానా, స్లొవేనియా, సోమాలియా, పనామా దేశాల విదేశాంగ మంత్రులతో జైశంకర్ చర్చించారు. పహల్గాం ఉగ్రదాడిని ఖండించడంతో పాటు భారత్‌కు సంఘీభావం తెలిపినందుకు ఆయా దేశాలకు జైశంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

భారత్‌పై పాక్ దుష్ప్రచార యుద్ధం!

యుద్ధానికి ఆర్మీ సిద్ధంగా లేదని.. రక్షణ సమావేశంలో తేల్చారంటూ నకిలీ పత్రాల సర్క్యులేషన్

- పహల్గాం దాడికి భద్రతా వైఫల్యమే కారణమంటూ జనరల్ సుచీంద్రను తొలగించారనే వదంతులు
- అవన్నీ అవాస్తవాలని తేల్చిన పీఐబీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో అంతర్జాతీయంగా పాకిస్థాన్ దుర్నీతిపై చర్చ జరుగుతుండటం, భారత్ తీవ్ర చర్యలు చేపట్టిన నేపథ్యంలో... పాకిస్థాన్ తప్పుడు ప్రచారాలకు దిగింది. ఆ దేశానికి చెందిన మీడియా, సోషల్ మీడియా ఖాతాల ద్వారా అడ్డగోలుగా దుష్ప్రచారం చేస్తోంది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ విభాగం ఈ దుష్ప్రచారం నిగ్గు తేల్చి.. నకిలీ వార్తలని స్పష్టం చేస్తూ వస్తోంది. అయినా పాక్ నుంచి ఇలాంటి తప్పుడు ప్రచారం మరింతగా సాగుతూనే ఉంది. భారత సైన్యం మానసిక స్థైర్యాన్ని దెబ్బతీయడానికి ఇలాంటి ప్రయత్నాలు జరుగుతున్నాయని రక్షణ వర్గాలు తెలిపాయి. కేంద్ర సైబర్ నిఘా సంస్థలు ఇలాంటి తప్పుడు ప్రచారంపై చేస్తున్న సోషల్ మీడియా ఖాతాలపై నిఘా పెట్టి, తగిన చర్యలు చేపట్టనున్నాయని వెల్లడించాయి. పౌరులెవరూ ఈ తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని సూచించాయి. అసలు పహల్గాం ఉగ్రదాడికి స్థానిక ఉగ్రవాదులే కారణమని, భద్రతా వైఫల్యంతోనే దాడి జరిగిందని భారత్ తేల్చిందని.. అందుకే నార్తర్న్ కమాండెంట్ లెఫ్టినెంట్ జనరల్ సుచీంద్ర కుమార్‌ను పదవి నుంచి తొలగించి, విచారణ చేపట్టారని పాక్ మీడియా, సోషల్ మీడియా ఖాతాల్లో ప్రచారం చేయడం మొదలుపెట్టింది. నిజానికి సుచీంద్రకుమార్ ఏప్రిల్ 30న పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో.. ఆ స్థానంలో లెఫ్టినెంట్ ప్రతీక్ శర్మకు బాధ్యతలు అప్పగించారు.



జనరల్ సుచీంద్రను తొలగించారంటూ పాకిస్థాన్ చేసిన ప్రచారాన్ని ఫ్యాక్ట్ చెక్ చేసి వదంతులుగా కొట్టిపారేస్తూ పీఐబీ పోస్టు చేసిన చిత్రం

- అరేబియా సముద్రంలో గస్తీ కాస్తున్న ఐఎన్ఎస్ విక్రాంత్ యుద్ధ నౌకను పేల్చివేస్తామంటూ యెమెన్ హౌతీ తిరుగుబాటుదారులు హెచ్చరించారని, దానికితోడు యుద్ధ నౌకలో అగ్ని ప్రమాదం జరగడంతో.. భారత్ దాన్ని వెనక్కి పిలిపించిందంటూ కూడా ప్రచారం చేస్తున్నారు. కానీ అవసరమైతే పాకిస్థాన్‌పై దాడి చేయడానికి వీలుగా ఐఎన్ఎస్ విక్రాంత్‌ను అరేబియా సముద్రంలోనే మోహరించి ఉంచారు.
- ఏవో చిన్నపాటి దాడులు తప్ప.. పాక్‌పై పూర్తిస్థాయిలో దాడికి ఆర్మీ సిద్ధంగా లేదని యుద్ధ సన్నాహాల సమావేశంలో తేల్చారంటూ.. కొన్ని నకిలీ పత్రాలను పాక్ అనుకూల సోషల్ మీడియా ఖాతాల ద్వారా వైరల్ చేస్తున్నారు. అవి తప్పుడు పత్రాలని పీఐబీ తేల్చింది.
- ఇక కశ్మీర్‌లోని పూంచ్ సెక్టార్‌లో ఎల్వోసీ వెంట భారత రాఫెల్ యుద్ధ విమానాన్ని పాక్ కూల్చివేసిందంటూ ఓ వీడియోను సర్క్యులేట్ చేస్తున్నారు. నిజానికి అది గత ఏడాది మహారాష్ట్రలో కూలిపోయిన సుఖోయ్-30ఎంకేఐ యుద్ధ విమానం తాలుకు వీడియోగా తేల్చారు.

కోల్‌కతాలో భారీ అగ్నిప్రమాదం..
14మంది దుర్మరణం

కోల్‌కతా, ఏప్రిల్ 30: కోల్‌కతాలో ఘోర అగ్ని ప్రమాదం సంభవించింది. సెంట్రల్ కోల్‌కతాలోని ఓ హోటల్(లాడ్జి)లో మంగళవారం సాయంత్రం మంటలు చెలరేగి ఇద్దరు చిన్నారులు సహా 14 మంది దుర్మరణం చెందారు. మరో 13 మంది ఆస్పత్రిపాలవ్వగా వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. నగరంలోని ప్రముఖ హోల్‌సేల్ మార్కెట్ అయిన బుర్రాబజార్‌లోని ఇరుకైన సందుల్లో ఉన్న రితురాజ్ హోటల్‌లో ఈ దుర్ఘటన జరిగింది. ఆరు అంతస్తులలో ఉన్న రితురాజ్ హోటల్‌లోని 42 గదుల్లో ప్రమాదం జరిగిన సమయంలో 88 మంది అతిథులు ఉన్నారు. అయితే, ఏం జరిగిందో తెలియదు కానీ మంగళవారం సాయంత్రం ఏడున్నర గంటల తర్వాత హోటల్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగి క్షణాల్లో భవనం అంతా వ్యాపించాయి. హోటల్‌లో నుంచి బయటికి వచ్చేందుకు భవనంలో ఒకేఒక్క సన్నని మెట్ల మార్గం ఉండడంతో చాలామంది బయటికి రాలేక లోపలే ఇరుక్కుపోయారు. కొందరు భవనంపైకి ఎక్కారు. అయితే, అగ్నికీలలు చెలరేగుతుండడం, భవనం అంతా పొగ వ్యాపించడంతో.. కాలిన గాయాలతో కొందరు, పొగ వల్ల ఊపిరాడక మరికొందరు ప్రాణాలు కోల్పోయారు. అగ్నికీలల నుంచి తప్పించుకునేందుకు కొందరు భవనం కిటికీల్లోంచి కిందికి దూకి చనిపోయారు. ఘటనాస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది 10 గంటలకు పైగా శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

డిజిటల్ యాక్సెస్ ప్రాథమిక హక్కు

- సుప్రీంకోర్టు కీలక తీర్పు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 30: డిజిటల్ యాక్సెస్ ఓ ప్రాథమిక హక్కు అని, ప్రజలందరికీ దానిని ప్రభుత్వం అందుబాటులో ఉంచాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వారికైనా, సమాజంలో వెనుకబాటుకు గురవుతున్న వర్గాల వారికైనా సమానంగా డిజిటల్ సేవలు అందాల్సిందేనని పేర్కొంది. రెండు ప్రజా ప్రయోజన వ్యాజ్యాల(పిల్)ను విచారించిన జస్టిస్ పార్థీవాలా, జస్టిస్ ఆర్.మాధవన్‌లతో కూడిన ధర్మాసనం ఈ చరిత్రాత్మక తీర్పును బుధవారం వెలువరించింది. డిజిటల్ అంతరాలను తగ్గించడం ఇక ఎంతమాత్రం విధానపరమైన విచక్షణకు సంబంధించిన అంశం కాదని, గౌరవప్రదంగా జీవించే హక్కును పరిరక్షించేందుకు రాజ్యాంగపరమైన ఆవశ్యకత ఉన్న అంశంగా మారిందని ధర్మాసనం స్పష్టం చేసింది. "ప్రస్తుత పరిస్థితుల్లో అత్యవసర సేవలు, పాలన, విద్య, ఆరోగ్య భద్రత, ఆర్థిక అవకాశాలు డిజిటల్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా అందుతున్నాయి. ఈ సాంకేతిక యుగంలో రాజ్యాంగంలోని అధికరణ 21 కింద జీవించే హక్కును పునర్నిర్వచించి ప్రస్తుత పరిస్థితులకు అన్వయించుకోవాల్సిన అవసరం తప్పనిసరిగా ఉంది. అసమానలతో కూడిన డిజిటల్ పరికరాలు, నైపుణ్యం, కంటెంట్ ద్వారా డిజిటల్ విభజన కొనసాగుతోంది" అని కోర్టు పేర్కొంది. కోర్టు విచారించిన రెండు పిల్స్‌లో ఒకటి యాసిడ్ దాడి బాధితురాలు ప్రజ్ఞ ప్రసూన్ దాఖలు చేశారు. ఓ బ్యాంకులో ఖాతా తెరిచేందుకు నో యువర్ కస్టమర్ (కేవైసీ) సమర్పణలో తాను ఎదుర్కొన్న ఇబ్బందులను పిటిషన్‌లో ఆమె పేర్కొన్నారు. యాసిడ్ దాడిలో తన ముఖం ఆకృతి మారిపోవడంతో పాటు, కళ్లకు కూడా చాలా నష్టం కలగడంతో కనురెప్పలను మూయలేక బ్యాంకులో లైవ్ కేవైసీ పూర్తి చేయలేకపోయానని ఆమె వాపోయారు. తనలాంటి యాసిడ్ దాడి బాధితుల విషయంలో కేవైసీ పూర్తి చేయడానికి కేంద్రానికి తగిన మార్గదర్శకాలు జారీచేయాలని ఆమె తన పిటిషన్‌లో కోరారు. ఈ పిటిషన్ విచారణ సందర్భంగా కేవైసీ విధివిధానాలను మార్చాల్సిన ఆవశ్యకత ఉందని ధర్మాసనం స్పష్టం చేస్తూ 20 మార్గదర్శకాలను జారీ చేసింది.

మా కంపెనీ కోడ్‌లో
30 శాతం.. ఏఐతోనే!

- మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల వెల్లడి



వాషింగ్టన్, ఏప్రిల్ 30: ప్రస్తుతం తమ కంపెనీ కోడ్‌లో 20 నుంచి 30 శాతం వరకూ కృత్రిమమేధ (ఏఐ) తోనే రాస్తున్నామని మైక్రోసాఫ్ట్ సీఈఓ సత్య నాదెళ్ల తెలిపారు. ఏఐతో కోడ్ రాయించే ప్రక్రియను రోజురోజుకీ పెంచుతున్నామన్నారు. మంగళవారం అమెరికాలోని కాలిఫోర్నియాలో మెటా కంపెనీ ఏఐ అంశంపై నిర్వహించిన ఓ కార్యక్రమంలో.. ఆ సంస్థ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్‌తో మాట్లాడుతూ సత్య నాదెళ్ల ఈ వివరాలు వెల్లడించారు. కోడ్ తయారీలో మెటా ఏ మేరకు ఏఐను వాడుతోందని జుకర్‌బర్గ్‌ని సత్య నాదెళ్ల ప్రశ్నించగా.. తనకు కచ్చితమైన వివరాలు తెలియవన్నారు. కాకపోతే భవిష్యత్తులో తమ కంపెనీకి చెందిన ఏఐ లామా వర్షన్లను రూపొందించేందుకోసం అవసరమైన ఏఐ మోడల్‌ను తయారుచేస్తున్నామని జుకర్‌బర్గ్ తెలిపారు. వచ్చే ఏడాదికి తమ ప్రాజెక్టుల అభివృద్ధిలో దాదాపు సగం మేర ఏఐనే వాడతామన్నారు. తమ కంపెనీ కోడ్‌లో 25 శాతానికిపైగా ఏఐతోనే రూపొందిస్తున్నామని గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ గత ఏడాది అక్టోబరులో వెల్లడించారు.

దేశవ్యాప్తంగా కులగణన

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించిన కుల సర్వేలు పారదర్శకంగా జరగలేదని, రాజకీయ ప్రయోజనాల కోసం ఆ గణనను పూర్తి చేశారని ఆరోపించారు. తాము జాతీయ స్థాయిలో నిర్వహించబోయే జనాభా లెక్కలతోపాటే కులగణనను పూర్తిచేస్తామని చెప్పారు. "నిజానికి కాంగ్రెస్ పార్టీ కుల గణనకు వ్యతిరేకం. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి చేపట్టిన జనాభా లెక్కల్లో కులగణనను చేర్చలేదు. 2010లో అప్పటి ప్రధాని మన్మోహన్‌సింగ్ నేతృత్వంలో జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో కుల గణనపై నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆమేరకు లోక్‌సభకు హామీ ఇచ్చారు. కానీ, మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసి.. కులగణనకు బదులు సామాజిక ఆర్థిక సర్వే(ఎస్ఈసీసీ)-2011ను నిర్వహించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి కులగణనను వాడుకుంటున్నాయి" అని ఆయన ఆరోపించారు. జనగణన కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని అశ్విని వైష్ణవ్ అన్నారు. "భారత రాజ్యాంగంలోని 246వ అధికరణ కింద.. ఏడో షెడ్యూల్‌లో 69వ జాబితాలో జనాభా లెక్కల ప్రస్తావన ఉంది. జనగణన కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని రాజ్యాంగం స్పష్టం చేస్తోంది. కొన్ని రాష్ట్రాలు కులాలపై సర్వేలు చేశాయి. కానీ, ఒకట్రెండు రాష్ట్రాలే సమగ్రంగా సర్వేలను నిర్వహించాయి. మిగతా రాష్ట్రాలు నిర్వహించిన సర్వేల్లో పారదర్శకత లేదు. కేవలం రాజకీయ దృక్కోణంతోనే నిర్వహించాయి. ఇలాంటి అసమగ్ర సర్వేలు సమాజంలో సందేహాలను కల్పిస్తాయి. ఈ నేపథ్యంలో రాజకీయాల వల్ల మన సామాజిక ఐక్యత దెబ్బతినకుండా ఉండేందుకు కులగణనను జనాభా లెక్కల్లో భాగంగా పారదర్శకంగా నిర్వహించాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించింది" అన్నారు. ఉత్తుత్తి సర్వేలు జరపడం తమ లక్ష్యం కాదని తెలిపారు. తాము జరిపే జనగణన, కులగణనతో దేశ సామాజిక, ఆర్థిక నిర్మాణం పటిష్ఠం అవుతుందని, దేశం అభివృద్ధి పథంలోకి పయనిస్తుందన్నారు. దేశ, సమాజ ప్రయోజనాలకు, విలువలకు మోదీ ప్రభుత్వం ఎంత కట్టుబడి ఉందో ఈ నిర్ణయంతో స్పష్టమవుతుందన్నారు.

పారదర్శకంగా నిధులను కేటాయించాలి: ఖర్గే

కేంద్రం కులగణన కోసం పారదర్శకంగా నిధులను కేటాయించాలని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. తాము ముందు నుంచి జాతీయ స్థాయిలో కులగణనకు డిమాండ్లు చేస్తున్నామని, నిధుల కేటాయింపు జరిగితే కులగణన ప్రారంభమవుతుందన్నారు. ఇంతకాలం మోదీ సర్కారు కులగణన పేరెత్తితే.. విపక్షాలు సమాజాన్ని విభజించాలని ప్రయత్నిస్తున్నాయని ఆరోపించిందన్నారు.

ఆలస్యమైనా మంచి నిర్ణయం: జైరాంరమేశ్

కులగణనపై మోదీ సర్కారు ఆలస్యంగా స్పందించినా.. ఇది మంచి నిర్ణయమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాంరమేశ్ అన్నారు. "అసలు కులగణన జరపకపోవడం కంటే.. ఆలస్యమైనా ఆమోదయోగ్యమే" అన్నారు. 2023 ఏప్రిల్ 16న కులగణన కోసం ప్రధాని మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే రాసిన లేఖను, గత నెల 9న అహ్మదాబాద్ సమావేశంలో కులగణనపై చేసిన తీర్మానం ప్రతులను ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. కాగా మోదీ సర్కారు కులగణనపై చాలా ఆలస్యంగా నిర్ణయం తీసుకుందని కమ్యూనిస్టు పార్టీలు అభిప్రాయపడ్డాయి. కులగణనపై మోదీ మాట మార్చారని సీపీఎం ఎంపీ జాన్ బ్రిటాస్ ఆరోపించారు. "కులగణన ప్రస్తావన వస్తే పేదలు, యువకులు, మహిళలు, రైతులు అనే నాలుగు కులాలే సమాజంలో ఉన్నాయని అని మోదీ అనేవారు. ఇప్పుడు మాటమార్చి కులగణనకు సిద్ధమయ్యారు" అని అన్నారు. కులగణన ఎప్పటిలోగా పూర్తవుతుందో కేంద్రం చెప్పాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబి డిమాండ్ చేశారు. కులగణనపై చాలా ఆలస్యంగానైనా.. నిర్ణయం తీసుకున్నారని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యదర్శి దీపంకర్ భట్టాచార్య అన్నారు.



తెలంగాణలో గతేడాది కులగణన సర్వే నిర్వహించినప్పటి చిత్రం

దేశాభివృద్ధికి దోహదం: నితీశ్‌కుమార్

దేశవ్యాప్త కులగణన తమ పార్టీ(జేడీయూ) పాత డిమాండ్ అని బిహార్ సీఎం నితీశ్‌కుమార్ అన్నారు. కేంద్రం నిర్ణయం అన్నివర్గాలకు సామాజిక న్యాయం చేస్తూ.. దేశాభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. మొట్టమొదటగా తాము బిహార్‌లో కులగణన జరిపామని జేడీయూ అధికార ప్రతినిధి రాజీవ్ రంజన్ ప్రసాద్ అన్నారు. దీన్ని విస్మరిస్తున్న కాంగ్రెస్ కులగణనకు తమనుతామే ఆద్యులుగా చెప్పుకొంటోందన్నారు.

కాంగ్రెస్ చేయనిది మేం చేస్తున్నాం: షా

దశాబ్దాలుగా దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ చేయలేని కులగణనను తాము చేపడుతున్నామని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఎక్స్‌లో పోస్టు చేశారు. అధికారంలో ఉన్నప్పుడు కులగణన చేపట్టని కాంగ్రెస్..ఇప్పుడు రాజకీయ ప్రయోజనాలతో మాట్లాడుతోందన్నారు.

బిహార్ ఎన్నికలకోసమే కులగణనప్రకటన: స్టాలిన్

కులగణనను తిరస్కరించేందుకు, జాప్యం చేసేందుకు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమవ్వడంతోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జనగణనతోపాటు కులగణనను చేపడతామని ప్రకటించిందని తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ అన్నారు. 'జనగణన ఎప్పుడు ప్రారంభమై ఎప్పుడు ముగుస్తుంది?' అని బుధవారం ఆయన ప్రశ్నించారు. బిహార్ ఎన్నికల్లో సామాజిక న్యాయం కీలకం కాబట్టి, కేవలం రాజకీయ ప్రయోజనం కోసమే కేంద్రం ఈ ఆకస్మిక చర్యకు ఉపక్రమించిందన్నారు. ప్రతిపక్షాలు ప్రజల్ని కులం ఆధారంగా విభజిస్తున్నాయని విమర్శించిన ప్రధాని.. ఇప్పుడు అదే డిమాండ్‌కు తలొగ్గారని చెప్పారు. కులగణన తమిళనాడు ప్రభుత్వం, డీఎంకే సాధించిన విజయమన్నారు.

50% కోటా ఎత్తివేతకు మార్గం: రాహుల్



మోదీ సర్కారు కులగణనపై తీసుకున్న 'అకస్మాత్' నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. 11 ఏళ్లుగా ఈ అంశాన్ని విస్మరించి, ఇప్పుడు నిర్ణయం తీసుకున్నారని, అయినా.. కాలపరిమితిని చెప్పలేదని విలేకరులతో అన్నారు. "ఇది ముమ్మాటికీ తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిన అంశమే. ఇంతకాలం 50% రిజర్వేషన్ కోటా నిబంధనలో ఉన్నాం. కులగణన జరిగితే.. ఆ పరిమితిని దాటడానికి మార్గం సుగమమవుతుంది. ఆ పరిమితిని ఎత్తివేసేదాకా మేం పోరాడుతాం. మేము కోరుకునేది జనాల కులగణన మాత్రమే. బ్యూరోక్రాట్ల కులగణన కాదు" అని వ్యాఖ్యానించారు. తమ ఒత్తిడి వల్లే కేంద్రం కులగణనకు సన్నద్ధమైందని పేర్కొన్నారు.

సమ్మిళిత వృద్ధిపై నిబద్ధత: చంద్రబాబు

దేశంలో సమ్మిళిత వృద్ధిపై ప్రధాని మోదీకి ఉన్న నిబద్ధతకు నిదర్శనం కులగణన నిర్ణయమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. ఇది చరిత్రాత్మక నిర్ణయమని, దీని వల్ల సమాజంలో అణగారిన వర్గాలకు మేలు జరిగే విధానాల రూపకల్పన సుసాధ్యమవుతుందన్నారు. సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్‌తో దేశంలో సామాజిక న్యాయం సాధ్యమవుతుందని ఎక్స్‌లో పోస్టు చేశారు.

ఆ మూడు రాష్ట్రాలే ఆదర్శం!

దేశంలో కులగణనకు బిహార్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలు ఆదర్శంగా నిలిచాయని చెప్పవచ్చు. నిజానికి భారత్‌లో బ్రిటిష్ హయాంలో 1931లో చివరిసారిగా జనాభా లెక్కలతో పాటు.. కులగణనను నిర్వహించారు. స్వాతంత్య్రం తర్వాత.. 1951 నిర్వహించిన జనగణనలో.. కులగణనను తొలగించారు. దాంతో.. 1931లో నమోదైన ఓబీసీల లెక్క మేరకు ఆ కేటగిరీకి 27% రిజర్వేషన్లను కొనసాగిస్తున్నారు. 2011లో కులగణనను నిర్వహించాలని నిర్ణయించినా.. సామాజిక ఆర్థిక సర్వే(ఎస్ఈసీసీ)ను చేపట్టారు. ఆ డాటాను ఇప్పటికీ విడుదల చేయలేదు. అయితే.. సామాజిక న్యాయం కోసం కులగణన జరిగి తీరాల్సిందేనన్న డిమాండ్లు ఉన్నా.. కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదు. బిహార్ ప్రభుత్వం మాత్రం 2023లో కులగణను చేసి, చూపించింది. న్యాయపరమైన అవాంతరాలెదురైనా.. బాలారిష్టాలను దాటుకుని, ముందుకు సాగింది. 13 కోట్ల బిహార్ జనాభాలో(2011 జనాభా లెక్కల ప్రకారం 10.41 కోట్లు) 63.14% ఓబీసీలు ఉన్నట్లు తేల్చింది. దాంతో.. 63% ఉన్న జనాభాకు 27% కోటా న్యాయమేనా? అనే చర్చ మొదలైంది. బిహార్‌లో ఆర్థికంగా మరీ వెనకబడిన కులాలు మొత్తం జనాభాలో 36.01 శాతంగా ఉండడంతో.. కోటా పెంపు డిమాండ్ మొదలైంది. దాంతో కాంగ్రెస్ పార్టీ కులగణన అంశాన్ని ఎన్నికల్లో ప్రముఖంగా ప్రస్తావించింది. కర్ణాటకలోనూ ఇచ్చిన హామీ మేరకు కులగణనను జరిపింది. నిజానికి కర్ణాటకలో 2015లోనే కులగణన మొదలై.. 2018 నాటికి సర్వే పూర్తయినా 2024లో బీసీ కమిషన్ చైర్మన్ జయప్రకాష్ హెగ్డే ప్రభుత్వానికి నివేదికను ఇచ్చారు. దీని ప్రకారం కర్ణాటకలో ఈబీసీల వాటా 69.6%. తెలంగాణలోనూ కాంగ్రెస్ పార్టీ కులగణన హామీని నెరవేర్చింది. 50 రోజులపాటు 1.03 లక్షల మంది ఎన్యుమరేటర్లు కులగణనను నిర్వహించగా.. 96.9% కుటుంబాలు వివరాలను వెల్లడించాయి. మొత్తం 3.54 కోట్ల మందిని సర్వే చేయగా.. బీసీల వాటా 46.25శాతంగా తేలింది. ముస్లిం మైనారిటీల్లో బీసీలను కలుపుకొంటే ఈబీసీల వాటా 56.33శాతం ఉంది. ఈ డాటాను తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. దీని ఆధారంగా విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లను కల్పిస్తూ 2బిల్లులను అసెంబ్లీ ఆమోదించింది. ఈ బిల్లులను కేంద్రానికి పంపి, వీటిని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరింది.

2026దాకా ఆగాల్సిందే!

- రాత్రికి రాత్రే డీలిమిటేషన్ చేయలేం: కేంద్రం
- నియోజకవర్గాల పునర్విభజనపై సుప్రీంకోర్టులో వాదనలు
- తీర్పు రిజర్వ్‌చేసిన ధర్మాసనం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) రాత్రికి రాత్రే చేపట్టలేమని కేంద్రప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకోసం 2026 జనాభా లెక్కల సేకరణ వరకు వేచి చూడాల్సిందేనని తెలిపింది. ఇది చిన్న విషయం కాదని, పెద్దఎత్తున కసరత్తు చేయాల్సి ఉంటుందని సర్వోన్నత న్యాయస్థానానికి నివేదించింది. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టం-2014లోని సెక్షన్ 26 ప్రకారం.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాలు పెంచేలా కేంద్రానికి ఆదేశాలివ్వాలని కోరుతూ ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి 2022 జూన్7న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కొత్తగా ఏర్పడిన ఈ రెండు రాష్ట్రాలను మినహాయించి... కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీరు అసెంబ్లీ, పార్లమెంటు స్థానాలను మాత్రమే పునర్విభజించడం రాజ్యాంగ విరుద్ధమని పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై సమాధానం చెప్పాలని ప్రతివాదులైన కేంద్ర ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ వ్యాజ్యం బుధవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది రావు రంజిత్ వాదనలు వినిపించారు. డీలిమిటేషన్ కమిషన్ నోటిఫికేషన్లలో రాష్ట్రాలను చేర్చడం, మినహాయించడం అనేది కేంద్ర ప్రభుత్వ బాధ్యతని ఎన్నికల సంఘం తన అఫిడవిట్‌లో పేర్కొందని గుర్తు చేశారు. ఈ విషయంలో ఇప్పటికీ కేంద్రం తన సమాధానం చెప్పలేదని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం తరఫు అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ స్పందిస్తూ.. డీలిమిటేషన్ ప్రక్రియ కోసం 2026 జనాభా లెక్కల వరకు వేచి ఉండాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పిటిషనర్ పదేపదే ప్రస్తావిస్తున్న జమ్మూకశ్మీరు కేంద్రపాలిత ప్రాంతమని గుర్తు చేశారు. కేంద్రపాలిత ప్రాంతం కాబట్టే అక్కడ డీలిమిటేషన్ సాధ్యమైందని.. దానితో ఏపీ, తెలంగాణకు సంబంధం లేదన్నారు. ఈ వాదనపై రావు రంజిత్ అభ్యంతరం తెలిపారు. ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూకశ్మీరు హోదా మారిందని తెలిపారు. ఆయన వాదనలపై జస్టిస్ సూర్యకాంత్ అసహనం వ్యక్తం చేశారు. జమ్మూకశ్మీరు గురించి ప్రస్తావించవద్దని సూచించారు. రంజిత్ తన వాదనలు కొనసాగిస్తూ.. డీలిమిటేషన్ విషయంలో ఉత్తరాది, దక్షిణాది మధ్య ఎంతో వ్యత్యాసం ఉందన్నారు. కేంద్రం చెబుతున్నట్లు 2026 తర్వాత కూడా దక్షిణాదిన ఈ ప్రక్రియ చేపట్టే పరిస్థితి కనిపించడంలేదని తెలిపారు. జమ్మూకశ్మీరు కంటే ఐదేళ్ల ముందు ఏర్పడిన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను డీలిమిటేషన్ అంశంలో ఎందుకు పరిగణనలోకి తీసుకోలేదని ప్రశ్నించారు. తొలుత.. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన డీలిమిటేషన్ నోటిఫికేషన్‌లో జమ్మూకశ్మీరు మాత్రమే గాక ఈశాన్య రాష్ట్రాలైన అస్సోం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, నాగాలాండ్ కూడా ఉన్నాయని, ఆ జాబితాలోనూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు లేవని.. ఆ తర్వాత ఆ నోటిఫికేషన్‌ను కేంద్రం వెనక్కి తీసుకుందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో డీలిమిటేషన్ చేయాలన్న ఉద్దేశం కేంద్రానికిలేదని అర్థమవుతోందన్నారు. డీలిమిటేషన్ చట్టం ప్రకారం కేంద్రం తన అధికారాలను వినియోగించుకోవాలనుకుంటే.. అన్ని రాష్ట్రాలకూ అది ఒకేలా వర్తిస్తుందని.. అందులో కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాలు అనే తేడా ఎందుకని ప్రశ్నించారు. వాదనలు ముగియడంతో తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది.

విభజన చట్టంలో సీట్ల సంఖ్య పెంచుకునే వెసులుబాటు...

ఏపీ విభజన చట్టం-2014ప్రకారం.. రాజ్యాంగంలోని అధికరణ 170లోని నిబంధనలకు లోబడి చట్టంలోని సెక్షన్ 15కు భంగం కలుగకుండా ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో అసెంబ్లీ స్థానాలను పెంచుకునే వెసులుబాటు ఉంది. తెలంగాణలో 119నుంచి 175కు, ఆంధ్రప్రదేశ్‌లో 175 నుంచి 225కు అసెంబ్లీ స్థానాల సంఖ్యను పెంచనున్నట్లు పేర్కొన్నారు. 2022 జూలై 27న బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు అడిగిన ప్రశ్నకు కేంద్ర హోం శాఖ సమాధానమిస్తూ.. 'ఏపీ విభజన చట్టం సెక్షన్ 26కి అనుగుణంగా ఆర్టికల్170ని సవరించే వరకు సీట్లు పెంచలేం'అని స్పష్టంచేసింది.

కులగణన చరిత్రాత్మక నిర్ణయం

- రాజకీయాలకు అతీతంగా మద్దతివ్వండి
- ఇది మోదీ సర్కార్ ఘనతే..
- రాష్ట్ర ప్రభుత్వ సర్వే అంతా తప్పుల తడక
- బీజేపీ ఎంపీలు బండి సంజయ్, లక్ష్మణ్, ఈటల

న్యూఢిల్లీ/ హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నాయకత్వంలో రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ రాబోయే జనాభా లెక్కింపులో కులగణనను చేర్చాలని తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైందని బీజేపీ ఎంపీలు బండి సంజయ్, ఈటల, లక్ష్మణ్ అన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు, కుల సంఘాలు, మేధావులు, విద్యావేత్తలు దీనికి సహకరించాలని వారు విజప్తి చేశారు. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో దేశ వ్యాప్తంగా ప్రజలకు ఎంతో ప్రయోజనం కలగబోతోందని, అత్యంత శాస్త్రీయంగా కేంద్రం నిర్వహించే ఈ సర్వేలో కులాల వారీగా జనాభా వివరాలు తెలుస్తాయని పేర్కొన్నారు. ఏ కులానికి నష్టం వాటిల్లకుండా రిజర్వేషన్ల అమలులో న్యాయం జరుగుతుందని అన్నారు. మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కాంగ్రెస్ విజయమంటూ ఆ పార్టీ నేతలు ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కులగణనకు వ్యతిరేకి అని, ఆ పార్టీ ఏనాడూ దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించకపోవడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వే తప్పుల తడక అని ఆరోపించారు. కేంద్రం తీసుకున్న కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు ఎంపీ లక్ష్మణ్ చెప్పారు. దేశంలో 94 ఏళ్ల తర్వాత మోదీ ఈ ప్రక్రియను తిరిగి ప్రారంభించడం పారదర్శక పాలనకు నిదర్శనమని లక్ష్మణ్ కొనియాడారు. దేశాన్ని 48 ఏళ్లపాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు బీసీల జనగణన చేపట్టలేదని ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. బీజేపీ 2014లో ఒక ఓబీసీ బిడ్డను ప్రధానమంత్రిని చేసిందని, కేంద్ర మంత్రివర్గంలో 27 మంది ఓబీసీలను, 12 మంది ఎస్సీలను, 8 మంది ఎస్టీలను, 5 గురు మైనారిటీలకు స్థానం కల్పించిందని చెప్పారు.

ప్రధానికి ధన్యవాదాలు: కిషన్‌రెడ్డి

కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకున్న ప్రధాని మోదీకి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఆయా రాష్ట్రాలు కులగణన పేరుతో వారికి అనుకూలంగా సర్వేలు చేపట్టి ప్రజల్లో ఆందోళనలు రేకెత్తిస్తున్నాయని ఆయన అన్నారు. ఈ తరుణంలో ప్రజాభిప్రాయం మేరకు, సామాజిక సామరస్యతను దృష్టిలో ఉంచుకుని జనగణనలో భాగంగా కులగణన చేయాలని నిర్ణయించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. 2011లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన జనాభా లెక్కలకు గాను దాదాపు రూ.5 వేల కోట్లు వెచ్చించిందని, అయినా ఆ సర్వే అంతా తప్పుల తడకగా ఉందని విమర్శించారు. అప్పటి సర్వే పూర్తి వివరాలను కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగానే వెల్లడించలేదని కిషన్‌రెడ్డి ఆరోపించారు.

ఫీజు బకాయిలిస్తేనే డిగ్రీ పరీక్షలు

- రాష్ట్రంలోని 5 విశ్వవిద్యాలయాల్లో డిగ్రీ పరీక్షలు బంద్
- 4.80 లక్షల మంది విద్యార్థులపై ప్రభావం
- రూ. 600 కోట్ల మేర ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు
- నాలుగేళ్లుగా చెల్లింపులు లేవని యాజమాన్యాల ఆందోళన

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పరీక్షలంటేనే సాధారణంగా విద్యార్థులు భయపడతారు. ఇంకొన్ని రోజులు తర్వాత పరీక్షలు మొదలైతే బాగుండు అనుకుంటారు. కానీ, రాష్ట్రంలోని కాకతీయ, తెలంగాణ, శాతవాహన, మహాత్మాగాంధీ, పాలమూరు విశ్వవిద్యాలయాల పరిధిలో డిగ్రీ అభ్యసిస్తున్న విద్యార్థుల పరిస్థితి మరోలా ఉంది. సాధారణంగా ఏప్రిల్ నెలలో ప్రారంభం కావాల్సిన పరీక్షలు ఇప్పటికీ మొదలవ్వలేదు. పైగా, పరీక్షలు ఎప్పుడు జరుగుతాయి ? అసలు నిర్వహిస్తారా ? లేదా? తెలియక గందరగోళంలో ఉన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వ్యవహారమే ఇందుకు కారణం. ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు నాలుగేళ్లుగా విడుదల కాకపోవడంతో ఆయా వర్సిటీల పరిధిలోని కాలేజీలు పరీక్షలను బంద్ చేశాయి. కళాశాలలకు తాళాలు వేసి విద్యార్థులకు సెలవులు ఇచ్చాయి. ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తేనే పరీక్షలు నిర్వహిస్తామని తేల్చిచెబుతున్నాయి.

4.80 లక్షల మందిపై ప్రభావం

రాష్ట్ర వ్యాప్తంగా 816 ప్రైవేటు కళాశాలలు సహా 1,086 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో సుమారు 6 లక్షల మంది విద్యార్థులు ఉన్నారు. ఇందులో ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో ఉన్న కళాశాలల్లో 1.20 లక్షల మంది ఉండగా.. మిగిలిన 4.80 లక్షల మంది విద్యార్థులు కాకతీయ, తెలంగాణ, శాతవాహన, మహాత్మాగాంధీ, పాలమూరు విశ్వవిద్యాలయాల పరిధిలో ఉన్నారు. ఓయూ పరిధిలోనే షెడ్యూల్ ప్రకారం డిగ్రీ విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్నాయి. మిగిలిన ఐదు విశ్వవిద్యాలయాల పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో పరీక్షలు నిర్వహించడం లేదు. గురువారం నుంచి ప్రిపరేషన్ హాలిడేస్ ఇచ్చారు. నిర్ణీత షెడ్యూలు ప్రకారం ఏప్రిల్ 22 నుంచి పరీక్షలు మొదలవ్వాలి. కానీ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు ఆ తేదీకి పరీక్షలు పెట్టకపోవటంతో 28 తేదీకి వాయిదా వేశారు. ఆ రోజున కూడా పరీక్షలు ప్రారంభించకపోవటంతో మే 6వ తేదీ నుంచైనా పరీక్షలు నిర్వహించాలని యూనివర్సిటీల అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దానికి కూడా అంగీకరించని యాజమాన్యాలు కళాశాలలకు తాళాలు వేసి పరీక్షలు ప్రారంభించే వరకు ఇంటి దగ్గరే చదువుకోవాలని విద్యార్థులు చెప్పాయి. సకాలంలో పరీక్షలు నిర్వహించపోవటంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. పరీక్షలు కాస్త ఆలస్యంగా జరిగితే మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు పెద్దగా సమస్య లేదు కానీ.. మూడో సంవత్సరం విద్యార్థులు మాత్రం నష్టపోయే అవకాశం ఉంది. పోటీ పరీక్షలు రాయటానికి, పీజీ సెట్ రాయడానికి ఆయా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి.

రూ. 600 కోట్లు బకాయిలు

గత ప్రభుత్వం రెండున్నరేళ్లు, ఈ ప్రభుత్వం ఏడాదిన్నర కలిపి నాలుగేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించలేదు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలకు రూ.600 కోట్ల మేర ప్రభుత్వం బకాయి పడింది. సగటున ఒక్కో సైన్సు గ్రూపు విద్యార్థి పేరు మీద ప్రభుత్వం ఏడాదికి రూ.15 వేలు చెల్లించాల్సి ఉంటుంది. బీఏ, బీకాం ఇతర గ్రూపులకైతే రూ.7,500 నుంచి రూ. 10 వేల చొప్పున చెల్లించాలి. నాలుగేళ్లుగా ఈ బకాయిలు మంజూరు చేయకపోవటంతో కళాశాలల యాజమాన్యాలు రకరకాలు ఆందోళనలు చేపట్టాయి. చివరకు పరీక్షలు బహిష్కరించి నిరసన తెలుపుతున్నాయి.

అప్పుల ఊబిలో యాజమాన్యాలు

రాష్ట్రంలోని ప్రైవేటు డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. పరీక్షలు బంద్ చేసిన 5 విశ్వవిద్యాలయాల పరిధిలోని కళాశాలల్లో 80 నుంచి 90 శాతం విద్యార్థులు ఫీజు రీఎంబర్స్‌మెంటుపై ఆధారపడి చదువుకునేవాళ్లే! దీంతో ఆయా కళాశాలు కూడా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంపైనే ఆధారపడి నడుస్తున్నాయి. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ డబ్బు ఇవ్వకపోవడంతో ఆ కాలేజీల నిర్వహణ కూడా కష్టంగా మారింది. కళాశాలల యాజమాన్యాలు అప్పులు తెచ్చి బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు చెల్లిస్తున్నాయి. నిజానికి, విద్యార్థుల పేరు మీద విశ్వవిద్యాలయాలకు యాజమాన్యాలు పరీక్ష ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. చాలా యాజమాన్యాలు అవి కూడా చెల్లించలేదు. దాంతో విద్యార్థులకు హాల్‌టికెట్లు కూడా వచ్చే పరిస్థితి లేదు. విద్యార్థుల నుంచి వసూలు చేసిన పరీక్ష ఫీజులను కూడా కొన్ని కళాశాలు నిర్వహణ ఖర్చులకే వాడుకున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. కాగా, ప్రభుత్వాన్ని బకాయిలు విడుదల చేయాలని కోరితే.. ఆర్థిక ఇబ్బందులున్నాయని చెబుతున్నారని, అంతకంటే ఎక్కువ ఆర్థిక ఇబ్బందుల్లో తాము ఉన్నామని కాకతీయ యూనివర్సిటీ పరిధి డిగ్రీ కళాశాలల సంఘం అధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి వాపోయారు. కళాశాలల అద్దెలు, అప్పులు పెరిగిపోయాయని.. టీ తాగుదామన్నా ఇంటి నుంచి తెప్పించుకోవాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని ఓయూ పరిధి డిగ్రీ కాలేజీల సంఘం ప్రధాన కార్యదర్శి రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్లుగా రూ.4 కోట్ల బకాయిలు మంజూరు కాకపోవటంతో ఈ ఏడాది నుంచి మొదటి సంవత్సరం విద్యార్థుల అడ్మిషన్లు నిలిపివేశామని వరంగల్ జిల్లా నర్సంపేటలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీరమల్ల మాధవరెడ్డి తెలిపారు. ఈ ఏడాదిలో కాలేజీ నిర్వహణకు రూ.1.30 కోట్లు ఖర్చు అయ్యిందని, అప్పు తెచ్చి వేతనాలిచ్చామని, వీటిపై వడ్డీ రూ.40 లక్షలు అయ్యిందని ఆయన వాపోయారు.

కంచిమఠం ఉత్తరాధికారిగా

సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి బాధ్యతలు

చెన్నై/అన్నవరం/అమరావతి, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): తమిళనాడు కాంచీపురంలోని శంకర మఠం ఉత్తరాధికారిగా అన్నవరానికి చెందిన సుబ్రహ్మణ్య గణేశ శర్మ ద్రవిడ్ బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. కాంచీపురం కామాక్షి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని పంచగంగ తీర్థం మధ్యనున్న మంటపంలో ఆయనకు ప్రస్తుత (70వ) పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి సన్యాస ఆశ్రమ దీక్షను ఇచ్చారు. తొలుత ఉత్తరాధికారికి కాషాయ వస్త్రాలు ధరింపజేసి, దండం, కమండలం అందించి, శంకర మఠానికి చెందిన కొయ్యతో చేసిన పీటపై ఆశీనులను చేశారు. స్ఫటిక రుద్రాక్ష మాలను మెడలో వేశారు. అనంతరం సన్యాస దీక్షను ప్రసాదించారు. తర్వాత ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆదిశంకరుల సన్నిధి వద్ద గణేశ శర్మకు 'శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి'గా నామకరణం చేశారు. ఆ తర్వాత ఆలయం నుంచి వేదపండితుల మంత్రోచ్చాటనలు, మంగళవాయిద్యాల మధ్య పీఠాధిపతి, ఉత్తరాధికారి రాజవీధిలో శంకర మఠానికి చేరుకున్నారు. అక్కడ విజయేంద్ర సరస్వతి మంత్రోపదేశం చేసిన తర్వాత కంచిమఠం యువ పీఠాధిపతిగా సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి బాధ్యతలు స్వీకరించారు.



విజయేంద్ర సరస్వతి చేతుల మీదుగా సన్యాసాశ్రమ దీక్ష స్వీకరిస్తున్న గణేశ శర్మ

తెలంగాణ చేసింది.. దేశం అనుసరిస్తోంది!

- కులగణన రాహుల్ గాంధీ ఆలోచన
- ప్రధాని మోదీకి ధన్యవాదాలు: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి స్వాగతించారు. 'తెలంగాణ చేసింది.. దేశం అనుసరిస్తోంది' అని మరోసారి రుజువైందన్నారు. కులగణన రాహుల్ గాంధీ ఆలోచన అని, భారత్ జోడో యాత్రలో దూరదృష్టితో తీసుకున్న నిర్ణయమని పేర్కొన్నారు. కులగణనను దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో తమ ప్రభుత్వం విజయవంతంగా చేసి చూపించిందన్నారు. ఈ విషయంలో దేశానికే మార్గదర్శకంగా నిలిచామని తెలిపారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కాంగ్రెస్ పోరాడిందని, ఢిల్లీలోనూ ఆందోళన చేసిందని గుర్తుచేశారు. ఇది ప్రతిపక్ష నేతగా రాహుల్ గాంధీ సాధించిన గొప్ప విజయమని కీర్తించారు. కులగణన చేపట్టాలన్న నిర్ణయం తీసుకున్నందుకు ప్రధాని మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

తెలంగాణ సర్కార్ విజయం


- కేంద్రం కులగణనపై మంత్రి పొన్నం
- ముస్లింల వెనుకబాటుతనం స్పష్టమవుతుంది: ఒవైసీ
- ప్రతిపక్షాల విజయం: కూనంనేని
- కులగణన నిర్ణయం బీసీల పోరాట ఫలితమే: జాజుల

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జనాభా లెక్కలతో పాటే కులగణన చేపడతామని కేంద్రం ప్రకటించడంపై పలువురు రాజకీయ నేతలు, బీసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని అన్నారు. దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టడం ద్వారా సామాజిక, ఆర్థిక, విద్య రంగాల్లో ముస్లింల వెనుకబాటుతనం స్పష్టమవుతుందని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. 2021 నుంచి మజ్లిస్ కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో కులగణనను అమలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి బుధవారం ఎక్స్ వేదికగా ఒవైసీ కృతజ్ఞతలు తెలిపారు. కేంద్రం కులగణన చేపడతామని నిర్ణయించడం తెలంగాణ ప్రభుత్వ విజయమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం కులగణన చేసి దేశానికి దిక్సూచిగా మారిందని పేర్కొన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. బీసీ సంఘాల పోరాట ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు. ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. జనగణనలో భాగంగా కులగణన చేపట్టాలని కేంద్ర క్యాబినెట్ నిర్ణయించడం ప్రతిపక్షాల విజయం అని, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. ఇప్పటికే కులగణన సర్వే చేపట్టి తెలంగాణ దేశానికి మార్గదర్శిగా నిలిచిందని జనగణనలో కులగణన చేయాలని కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమైందని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య అన్నారు. జనాభా లెక్కల ప్రక్రియలో కులగణన చేపట్టాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని తెలంగాణ బీసీ కమిషన్ స్వాగతిస్తుందని కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ పేర్కొన్నారు. జనాభా లెక్కల్లో కులగణనను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వ నిర్ణయం చారిత్రాత్మకమని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. కులగణనతో భవిష్యత్‌లో రాజకీయ ముఖ చిత్రం మారుతుందని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసుసురేశ్ అన్నారు.

ఇది మా విజయం:మహేశ్‌గౌడ్

కులగణనపై కేంద్ర ప్రభుత్వ నిర్ణయం.. తెలంగాణ ప్రభుత్వం సాధించిన విజయం అని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. జనగణనతో పాటు కులగణన నిర్వహిస్తామంటూ కేంద్రం ప్రకటించడం హర్షణీయమన్నారు. కాగా.. రాహుల్ గాంధీ ఒత్తిడికి తలొగ్గి.. జనగణనతో పాటు కులగణననూ చేపట్టాలని కేంద్రం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నామని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.


SR's EXEMPLARY EXCELLENCE AND EXTRAORDINARY RESULTS IN SSC-2025, TELANGANA.
50 Years of Educational Excellence
Groomed by SR from School to College
Joined our SR School in 7th Class
99.99 PERCENTILE
PHYSICS 100 PERCENTILE
ALL INDIA RANK 5
V.NAGA SIDDHARTHA
APP. 250310222429
Groomed by SR from School to College
Joined our SR School in 8th Class
99.93 PERCENTILE
ALL INDIA RANK 88
Y.BHARANI SHANKAR
APP. 250310247992
586/600 S.SHIVA PRIYA Ht.No. 2504105992
586/600 D.DEEKSHITH REDDY Ht.No. 2513100052
585/600 S.MANASWINI Ht.No. 2513101076
584/600 SHIVA CHARAN
584/600 M.VARDHAN
584/600 V.HASINI
583/600 T.ANSHIKA CHARV
583/600 L.MAHAVEER
583/600 C.SRINIKA
582/600 M.SAI DHANUSH
582/600 G.SIRI CHANDANA
582/600 V.AKSHARA
582/600 M.NIKSHAN
582/600 C.KARTHIKEYA
581/600 U.VEDIKA
581/600 V.SAHITHYA
581/600 G.MANOJ
581/600 K.PARINI
581/600 V.RASHMITHA
581/600 B.JEEVAN KRISHNA
580/600 B.CHIKOTI
580/600 A.JYOTHIKA
580/600 G.KARTHIKA
SR PRIME SCHOOLS BATTUPALLY, ADIBATLA & PUNNELU
BATTUPALLY, Hanamkonda.
SR PRIME SCHOOL - CBSE (Residential)
Shyampet Jagir (V), Battupally Road, Hanamkonda,
M: 9133 278246, 88868 68661, 88868 66060.
1st to 10th Std (EM) (Recognized by Govt. of Telangana)
ADIBATLA, Hyderabad.
SR PRIME SCHOOL (Residential)
No 413 & 414, Mangalpally, Hayath Nagar, Near Adibatla, TCS, Ibrahimpatnam.
M: 91751 44061
6th to 10th Std (EM) (Recognized by Govt. of Telangana)
PUNNELU, Warangal.
SR PRIME SCHOOL (Day & Residential)
H.No.1-1/1, Punnelu (V) G.Panchayath, Innavole (M), Hanumakonda (Dist)
M: 96421 17374
4th to 10th Std (EM) (Recognized by Govt. of Telangana) Proposed CBSE School
Re-launching
Coaching your way to success
SR Edu-Centre Pvt. Ltd.
Classes 6th to 10th
FOCUS
NAKKALAGUTTA, HANAMAKONDA
8712021658
PRIME Program for IIT and Medical Entrance Examinations
An outgoing student of SR should carry with him the profound knowledge of the fundamentals of the subject that will enable him to get a brilliant rank in the competitive exams like JEE (MAIN), JEE (ADVANCED), NEET, AIIMS, EAPCET etc...
INTEGRATED FOUNDATION PROGRAM Syllabus conceived from NCERT / STATE / CBSE / ICSE
PRIME PROGRAM WITHOUT DISTURBING THE REGULAR CURRICULUM FOR SURE SUCCESS
SHARP
An integrated foundation program which gives a head start at the intermediate level to face the competitive exams like JEE (Main), JEE (Advanced), NEET, AIIMS, EAPCET... confidently for assured success.
SPARK
A solid foundation program designed to score ranks below 1000 in JEE (Main) & JEE (Advanced)
Emphasis on fostering critical thinking and problem solving skills
FOCUS
An excellent coaching program for securing ranks below 100 in JEE MAIN and JEE Advanced
Program for super achievers and brainy students
MEDICUS
An excellent medical foundation program, exploring concepts in Biology, Physics and Chemistry. Program framed for NEET, AIIMS, JIPMER, and AIPMT aspirants
OUR FEATURES: Integrated curriculum that draws the best NCERT/STATE/CBSE/ICSE SYLLABUS Meticulously planned micro schedules to cover all the syllabus in structural manner Every weekend examination and analysis across the nation Focused on achieving top ranks in exams like RMO, NTSE, AMTI & all Olympiads
Cambridge Assessment International Education
Cambridge International School
SR PRIME SCHOOL START YOUNG. STAY AHEAD.
SR digi SCHOOL Experience a new joy of learning!
ADMISSIONS OPEN: NURSERY to 10th | www.srprimeschool.com • www.srdigischool.com
TELANGANA • ANDHRA PRADESH • KARNATAKA

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 1-5-2025 | పేజీలు: 10 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 15

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: చవితి ఉ.11:24 తదుపరి పంచమి; నక్షత్రం: మృగశిర మ. 2.21 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: రా.10.18-11.48, దుర్ముహూర్తం: ఉ.10.05-10.56, మ.3.09-4.00, అమృతఘడియలు: ఉ.6.15-7.44, తె 3.36-5.06; రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 5.52, సూర్యాస్తమయం: 6.31

హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

LAUNCHING
CASAGRAND GS INFINITY

న్యూయార్క్ లాంటి అనుభూతిని హైదరాబాద్‌లో సొంతం చేసుకోండి.

3 & 4 BHK కండోస్ &
5 BHK ఫ్లోర్ విల్లాలు మెయిడ్ రూమ్‌తో

₹**1.8**Cr*
Onwards

INCREDIBLY PRICED

Type	Size (Sft.)	Market Price	Launch Price	Early Bird Price (*For the first 30 bookings only)
3 BHK	2386	~~₹2.1Cr~~	~~₹1.9Cr~~	₹1.8Cr
4 BHK	2961	~~₹2.7Cr~~	~~₹2.6Cr~~	₹2.4Cr
5 BHK Floor Villas	3917	~~₹3.5Cr~~	~~₹3.4Cr~~	₹3.2Cr

Total Units: **405** | Phase 1 Units: **270** | Available Units: **154** | **Handover in 36 months** | Price after 30 bookings - ₹**1.9**cr - ₹**3.4**cr*

100+ WORLD-CLASS AMENITIES



అవుట్‌డోర్ సౌకర్యాలు

ఫీచర్లు & ఎంటర్‌టైన్‌మెంట్

1. ఎంట్రీ డ్రాప్-ఆఫ్ జోన్
2. వాకింగ్/జాగింగ్ ట్రాక్
3. గణిత గుర్తులతో పిల్లల జాగింగ్ ట్రాక్
4. అప్‌గ్రేడ్ చేసిన పార్కింగ్ ఫీచర్‌లతో సైకిల్ పార్కింగ్ జోన్
5 సైకిళ్లతో సైక్లింగ్ ట్రాక్
6 వాల్ బార్బిక్యూ
7 హ్యాంగ్‌అవుట్ స్పేస్
8 పెట్స్ పార్కు
9 పెట్ వాషింగ్ స్టేషన్
10. హెర్బ్ మరియు స్పైస్ గార్డెన్
11. ఈవీ కార్ ఛార్జింగ్ స్టేషన్
12. సెల్ఫీ స్పాట్
13. బర్డ్ ఫీడర్
14. అవుట్‌డోర్ ఏరియాలో దోమల మాగ్నెట్
15. అవుట్‌డోర్ ఫ్యాన్
16. పైప్డ్ మ్యూజిక్ సిస్టమ్‌తో బొల్లార్డులు
17. గ్రానైట్ చెస్ టేబుళ్లు
18. కొరియర్/ పార్శిల్ కోసం లాకర్లు
19. పనిమనిషి/ డ్రైవర్లు & ఎఫ్ఎం బృందం కోసం ప్రత్యేక పార్కింగ్

కిడ్స్ జోన్

20. అవుట్‌డోర్ ప్లేబోర్డ్
21. ఎడ్యుకేషనల్ ప్లేగ్రౌండ్
22. కిడ్స్ మ్యూజిక్ పార్క్
23. కిడ్స్‌ప్లే ఏరియాలో రబ్బర్ మౌండ్
24. అడల్ట్ నెక్ట్ స్వింగ్
25. వీ-సా
26. సీటింగ్‌తో గ్రానైట్ స్నేక్ & ల్యాడర్
27. పేరెంట్ & కిడ్స్ స్వింగ్
28. ఇన్-గ్రౌండ్ ట్రామ్పోలిన్
29. కర్ల్ స్వింగ్
30. ఇంటరాక్టివ్ ఫ్లోర్ గేమ్ - జెయింట్ స్నేక్ & ల్యాడర్
31. కిడ్స్‌ప్లే ఏరియాలో జెయింట్ అబాకస్
32. కిడ్స్ వర్టికల్ ప్లే గ్రౌండ్
33. పల్స్ ఇంటరాక్టివ్ గేమ్స్
34. కిడ్స్ ఏరియాలో సైకిల్ పార్కింగ్ స్పేస్
35. టోట్ లాట్
36. పిల్లల కోసం బాస్కెట్‌బాల్ హూప్

స్పోర్ట్స్ & ఫిట్‌నెస్ వెల్‌బీయింగ్

37. ఫిట్‌నెస్ కోర్ట్
38. గ్రానైట్ టేబుల్ టెన్నిస్ - అవుట్‌డోర్
39. ఇంటిగ్రేటెడ్ టార్గెట్ వర్కౌట్స్ & మంకీ బార్ - ఫ్లోర్ మార్కింగ్స్
40. మల్టీపర్పస్ స్పోర్ట్స్ కోర్ట్
41. వాలీబాల్ క్రాస్ నెట్
42. పికిల్‌బాల్ కోర్ట్
43. సెల్ఫ్ టెన్నిస్ (అవుట్‌డోర్)
44. మినీ గోల్ఫ్ కోర్స్
45. స్కేటింగ్ రింక్
46. మల్టీ-హూప్ బాస్కెట్‌బాల్ కోర్ట్
47. అవుట్‌డోర్ క్రాస్‌ఫిట్ కోర్ట్

క్లబ్‌హౌస్ సౌకర్యాలు

ఆరోగ్యం & సంక్షేమం

48. మెడిటేషన్ లాన్
49. జెన్ గార్డెన్
50. మెడిసినల్ ప్లాంట్ గార్డెన్
51. నేచర్ వాక్‌వే
52. మ్యూజికల్ ఇంటరాక్టివ్ స్కల్ప్చర్
53. లీజర్ ల్యాండ్‌స్కేప్ కోర్ట్ (బయోఫిలిక్ యాంఫిథియేటర్)
54. రిఫ్లెక్సాలజీ మొజాయిక్ గార్డెన్

ఫీచర్స్ & ఎంటర్టైన్మెంట్

55. కన్వీనియన్స్ స్టోర్
56. బాంకెట్ హాల్ - సెపరేట్ డైనింగ్ ఏరియా
57. క్రెచ్
58. మినీ థియేటర్
59. క్యారొకి ఫ్లోర్
60. రూఫ్‌టాప్ డైనింగ్ & కేఫ్
61. వీడియో గేమ్‌లతో కూడిన ఏవీ రూమ్
62. కిడ్స్ రూమ్‌లో ఆర్ట్స్ & క్రాఫ్ట్స్ స్పేస్
63. గెస్ట్ రూమ్
64. అసోసియేషన్ రూమ్
65. అమినిటీస్ మేనేజ్‌మెంట్ యాప్

స్పా మరియు సెలూన్

66. సెలూన్
67. స్పాలో ఫ్లష్డ్ జాకుజీ
68. స్టీమ్/సౌనా
69. మసాజ్ రూమ్

స్పోర్ట్స్ & ఫిట్‌నెస్ వెల్‌బీయింగ్

70. బ్యాడ్మింటన్ కోర్ట్
71. గోల్ఫ్ సిమ్యులేటర్ రూమ్
72. ఏఆర్ స్క్వాష్ కోర్ట్
73. ఆటోమేటెడ్ బీఎంఐ మెషీన్
74. ఆక్సిజన్ డిఫ్యూజర్
75. జిమ్
76. యోగా/ ఏరోబిక్స్

కో-వర్కింగ్ స్పేస్

77. కాన్ఫరెన్స్ రూమ్
78. క్లబ్‌హౌస్‌లో కాఫీ స్టేషన్
79. రీడింగ్ పాడ్స్

టెర్రస్ సౌకర్యాలు

80. స్కై సినిమా
81. టెర్రస్‌పై ఆర్ట్స్ & క్రాఫ్ట్స్ ఏరియాతో కిడ్స్ జోన్
82. స్టార్ గేజింగ్ డెక్
83. టెర్రస్‌లో పిక్నిక్ లాన్
84. టెర్రస్‌లలో ఓపెన్ జిమ్
85. అబ్జర్వేటరీ డెక్స్

ఇండోర్ గేమ్స్

86. బోర్డ్ గేమ్స్
87. డార్ట్ బోర్డ్
88. ఆర్కేడ్ గేమ్స్
89. కిడ్స్ సైక్లింగ్ ఇంటరాక్టివ్ వాల్
90. పిల్లల కోసం వెల్క్రో వాల్
91. ఎయిర్ హాకీ
92. ఫూస్‌బాల్
93. పూల్ టేబుల్
94. మినీ హాకీ
95. లెగో వాల్
96. టేబుల్ టెన్నిస్
97. వీడియో గేమ్ రూమ్

క్లబ్‌హౌస్ టెర్రస్ సౌకర్యాలు

98. టెర్రస్ సౌకర్యాల కోసం టెర్రస్ వద్ద లాబీ
99. స్టార్ గేజింగ్ డెక్‌లోకి విస్తరించే అంతస్తు
100. గ్రిల్లింగ్ పెవిలియన్ (బీబీక్యూ కౌంటర్)

స్విమ్మింగ్ పూల్ సౌకర్యాలు

101. ఇన్ఫినిటీ స్విమ్మింగ్ పూల్ (క్లోరిన్‌ఫ్రీ)
102. డెక్ సీటర్లతో కూడిన కిడ్స్ పూల్
103. ఇంటరాక్టివ్ కిడ్స్‌ప్లే తో కూడిన
104. వాటర్ స్కల్ప్చర్ హైడ్రోథెరపీ పూల్







Scan to visit the site

Scan to experience luxury like never before

TS RERA: P02500009503 | www.rera.telangana.gov.in | *T & C Apply.

WHY CASAGRAND

20 years of real estate excellence	**160+** landmark projects	**55,000+** happy families	**2023** rigorous quality checks	**87%** on-time delivery	**7 cities** Chennai, Bengaluru, Hyderabad, Coimbatore, Pune, Delhi & Dubai
2 months of rental assurance	**6 months** of resale support	**8 Year** warranty & 10-year community maintenance	**75%** open area for 2x more light & ventilation	**0%** space wastage for carpet area efficiency	**23** global brands used in fittings and finishing materials

CREDAI

FOR BOOKING CALL: 80155 08602 | Exclusive site visit available. Visit model house at site.

CASAGRAND
building aspirations

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

గురువారం | 1-5-2025 | పేజీలు: 10+8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 15 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, శుక్లపక్షం; తిథి: చవితి ఉ.11:24 తదుపరి పంచమి; నక్షత్రం: మృగశిర మ. 2:21 తదుపరి ఆర్ద్ర; వర్జ్యం: రా.10:18-11:48, దుర్ముహూర్తం: ఉ.10:05-10:56, మ.3:09-4:00, అమృతఘడియలు: ఉ.6:15-7:44, తె 3:36-5:06; రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 5:52; సూర్యాస్తమయం: 6:31 | హైదరాబాద్ సిటీ*

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

146 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

భారీగా ఇన్‌స్పెక్టర్ల బదిలీలు..146 మందిని బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేసిన సీపీ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో పెద్ద ఎత్తున ఇన్‌స్పెక్టర్లను బదిలీలు చేస్తూ నగర సీపీ సీవీ ఆనంద్ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఒకేసారి 146 మందిని బదిలీ చేశారు. రెండేళ్లుగా ఇన్‌స్పెక్టర్ల బదిలీలు జరగకపోవడం, ఎన్నికల కోడ్‌లు, బందోబస్తు విధులు ఉన్నందున ఒకేసారి భారీగా బదిలీ చేశారు. ఎంపీ ఎన్నికల తర్వాత నుంచి బదిలీలు నిలిచిపోయాయి, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత బదిలీల ప్రక్రియ ఉంటుందని చాలా మంది ఊహించినప్పటికీ ఇంత పెద్ద ఎత్తున చేయడం చర్చనీయాంశమైంది. బదిలీ అయిన ఇన్‌స్పెక్టర్లు వెంటనే తమకు కేటాయించిన స్థానాల్లో విధుల్లో చేరాలని సీవీ ఆనంద్ ఆదేశించారు.



బొట్టుపెట్టి.. మంగళహారతులతో
స్వాగతం

మిస్ వరల్డ్ పోటీ అతిథులకు ప్రత్యేక ఏర్పాట్లు
శంషాబాద్ విమానాశ్రయంలో స్వాగత వేదిక
ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

హైదరాబాద్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి వచ్చే అతిథులకు విమానాశ్రయంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయానికి అనుగుణంగా స్వాగతం పలకనున్నారు. సుమారు 120 దేశాల నుంచి 140 మంది పోటీల్లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు విచ్చేస్తున్నారు. వారికి బొట్టుపెట్టి మంగళహారతులతో ఘన స్వాగతం పలకడానికి తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ శంషాబాద్ విమానాశ్రయం ఆవరణలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేస్తోంది. పర్యాటక శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి బుధవారం శంషాబాద్ విమానాశ్రయాన్ని సందర్శించి స్వాగత సత్కారాల ఏర్పాట్లను పరిశీలించారు. శంషాబాద్ పోలీస్ అధికారులతో సమావేశమై విమానాశ్రయ అధికారులు, స్థానిక పోలీసుల సమన్వయంతో భద్రతపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా, మే 10 నుంచి 31 వరకు 72వ మిస్‌వరల్డ్ పోటీలు హైదరాబాద్‌లో జరగనున్నాయి.

బందోబస్తుపై సీపీ సమీక్ష

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ పోటీల సందర్భంగా భద్రత, వీవీపీల రాకపోకలు, ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లపై అధికారులతో సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి సమీక్షా సమావేశం నిర్వహించారు. మాదాపూర్ ట్రైడెంట్ హోటల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు.

అయినా.. ప్లేసు మారలేదు!

'పది' ఫలితాల్లో మళ్లీ 30వ స్థానమే

2024లో కూడా హైదరాబాద్‌కు ఇదే ర్యాంకు
కలెక్టర్ కదిలినా ఆశించిన ఫలితాలు కరువు
జిల్లాలో 88.53 శాతం ఉత్తీర్ణత
గతేడాదితో పోల్చితే 1.77 శాతం పెరుగుదల
రాష్ట్ర ర్యాంకుల్లో మాత్రం అదే స్థానం
మేడ్చల్‌లో 90.76 శాతం,
రంగారెడ్డి జిల్లాలో 87.84 శాతం ఉత్తీర్ణత

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): 'పదో తరగతి పరీక్షల్లో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ జిల్లాలో ఈసారి అధిక ఉత్తీర్ణత శాతం రావాలి. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలు ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థులను సన్నద్ధులను చేయాలి. సర్కారు బడుల్లో ఫెయిల్ శాతం ఎక్కువగా ఉన్న సబ్జెక్టు ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకుంటాం. నూరుశాతం ఫలితాల సాధిస్తే ఆగస్టు 15న ప్రత్యేకంగా సన్మానిస్తాం.' అని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించినా, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, విద్యాశాఖాధికారి రోహిణి సబ్జెక్టు టీచర్లతో సమావేశమైనా హైదరాబాద్ ర్యాంకు మారలేదు. పదో తరగతి ఫలితాల్లో ఆశించిన ఉత్తీర్ణతా శాతం రాలేదు.


పాపిశెట్టి కార్తీక్ (584/600) జిల్లా పరిషత్ పాఠశాల, గణేశ్‌నగర్


జే. సోనియా (579/600) ప్రభుత్వ పాఠశాల, మూసాపేట


హాసిని 574/600) రాజ్‌భవన్ స్కూల్, బేగంపేట


త్రివేణి (572/600) ప్రభుత్వ పాఠశాల, మూసాపేట

స్వల్ప ఉత్తీర్ణత శాతం పెరిగినా..

2024-25 విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల

మిగతా 4వ పేజీలో..


ఫలితాలను చూసుకున్న అనంతరం స్వీట్లు తినిపించుకుంటూ బాలికల ఆనందం

సత్తాచాటిన అమ్మాయిలు

పదో తరగతి వార్షిక ఫలితాల్లో మరోసారి బాలికలు సత్తాచాటారు. పలు ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు సైతం ప్రైవేట్ పిల్లలతో పోటీపడి అత్యధిక మార్కులు సాధించారు. జిల్లాలో పరీక్ష రాసిన మొత్తం విద్యార్థుల్లో బాలురు 85.55 శాతం పాస్ కాగా.. బాలికలు 91.37 శాతం ఉత్తీర్ణత సాధించారు. అలాగే రంగారెడ్డి జిల్లాలో బాలురు 86.18 శాతం, బాలికలు 89.65 శాతం మంది పాసయ్యారు. కాగా, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో బాలురు 89.06 శాతం, అమ్మాయిలు 92.59 శాతం ఉత్తీర్ణత సాధించారు.

2024లో పదో తరగతి ఫలితాల వివరాలు (రెగ్యులర్ విద్యార్థులు)

జిల్లా	పరీక్షకు హాజరు	మొత్తం ఉత్తీర్ణత	శాతం
హైదరాబాద్	73,202	63,511	86.76
రంగారెడ్డి	50,811	46,245	91.01
మేడ్చల్	46,736	41,879	89.61

2025లో పదో తరగతి ఫలితాల వివరాలు (రెగ్యులర్ విద్యార్థులు)

జిల్లా	పరీక్షకు హాజరు	మొత్తం ఉత్తీర్ణత	శాతం
హైదరాబాద్	73,911	65,436	88.53
రంగారెడ్డి	51,671	45,386	87.84
మేడ్చల్	47,235	42,870	90.76



ఎప్‌సెట్‌కు రెండోరోజు
94.48 శాతం హాజరు

ముగిసిన అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ స్ట్రీమ్ పరీక్షలు
రేపటి నుంచి ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు ప్రారంభం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): టీజీ ఎప్‌సెట్‌కు రెండోరోజు ఒకటే సెషన్‌లో జరిగిన అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 29,098 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, 27,493 మంది అభ్యర్థులు(94.48శాతం) హాజరయ్యారు. 1,605 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో 98 శాతం, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో 97 శాతం మంది అభ్యర్థులు ఎప్‌సెట్ రాశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో జరిగిన ఎప్‌సెట్‌కు 95 శాతం మంది హాజరైనట్లు అధికారులు వెల్లడించారు. కాగా, ఎప్‌సెట్ ఇంజనీరింగ్ స్ట్రీమ్ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమై, ఆదివారంతో ముగుస్తాయని సెట్ కో కన్వీనర్ విజయకుమార్ రెడ్డి తెలిపారు. రోజూ రెండు సెషన్లలో జరుగుతాయని, రాష్ట్ర వ్యాప్తంగా 2.20 లక్షల మంది అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరు కానున్నట్లు వెల్లడించారు. పరీక్షల నిమిత్తం 124 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని, పరీక్ష ప్రారంభ సమయానికి 90 నిమిషాల ముందే అభ్యర్థులను లోపలికి అనుమతిస్తామని పేర్కొన్నారు.

ఆదివారాల్లోనూ అకడమిక్ వర్క్

కేలండరును సవరించిన జేఎన్‌టీయూ
ఉత్తర్వులు జారీ చేసిన వర్సిటీ రిజిస్ట్రార్
3 నెలల ముందే పూర్తికానున్న డిగ్రీ
బీటెక్ విద్యార్థుల్లో ఆనందం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో బీటెక్ ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులకు జేఎన్‌టీయూ తీపికబురు చెప్పింది. విద్యార్థులు తమ క్లాస్‌వర్క్‌ను త్వరగా పూర్తి చేసుకునేందుకు వీలుగా అవసరమైతే ఆదివారాల్లోనూ తరగతులు నిర్వహించేందుకు వీలు కల్పించింది. ఈ మేరకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. కోవిడ్ పరిణామాల అనంతరం బీటెక్ విద్యార్థుల అకడమిక్ షెడ్యూల్ గందరగోళంగా తయారైంది. రెండో సెమిస్టర్ వేసవి సెలవుల అనంతరం నిర్వహించుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడడంతో ఇంటర్న్‌షిప్‌లు, క్యాంపస్ ఉద్యోగాలకు వెళ్లాల్సిన విద్యార్థులు సెప్టెంబరు వరకు వేచి ఉండాల్సి వస్తోంది. ఈ విషయాన్ని పలువురు విద్యార్థులు, తల్లిదండ్రులు యూనివర్సిటీ వైస్ చాన్సలర్ కిషన్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకురావడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. గతంలో సెప్టెంబరు ఆఖరుకు ముగిసే సెకండ్ సెమిస్టర్‌ను మూడు నెలలు ముందుగా అంటే జూన్ నెలాఖరు కల్లా ముగిసేలా అకాడమిక్ క్యాలెండర్‌ను సవరించారు. రివైజ్డ్ క్యాలెండర్ ప్రకారం జూన్ నెలాఖరుకు బీటెక్ ఫైనలియర్ పరీక్షలు పూర్తిచేసి, మొదటి లేదా రెండోవారంలోగా విద్యార్థులకు ఫలితాలు ఇచ్చేందుకు వీలవుతుందని అకడమిక్ అఫైర్స్ డైరెక్టర్ ఎస్వీ రమణ తెలిపారు. గతంలో మాదిరిగా కాకుండా మూడు నెలల ముందు(జూన్)గానే తమ బీటెక్ పూర్తికానుండడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


జేఎన్‌టీయూ పరిపాలన భవనం

ఒక్కరోజే 10,575 ట్యాంకర్ల బుకింగ్



- వాటర్‌బోర్డు చరిత్రలోనే అత్యధికం
- ఎండలు ముదరడంతో పెరిగిన బుకింగ్‌లు
- ఏప్రిల్‌లో మొత్తం 2.90 లక్షల ట్యాంకర్లు
- సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఒకేరోజు (ఏప్రిల్ 28న) 10,575 ట్యాంకర్లు బుక్ అయ్యాయి. వాటర్‌బోర్డు చరిత్రలోనే ఈ స్థాయిలో బుక్ కావడం ఇదే తొలిసారి. వర్షాభావ పరిస్థితులతో భూగర్భజలాలు అడుగంటిపోయి, వాటర్‌బోర్డు నీళ్లే ఆధారమవ్వడంతో గతేడాది మేలో అత్యధికంగా ఒకేరోజు 8400 ట్యాంకర్లు బుక్ అయ్యాయి. ఈ ఏడాది ఏప్రిల్ 28న అత్యధికంగా 10,575 ట్యాంకర్లను నగరవాసులు బుక్ చేసుకోవడం గమనార్హం. అయినప్పటికీ 24 గంటల్లోనే డెలివరీ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు.

ఏప్రిల్‌లో బుకింగ్‌లు ఇలా..

తేదీ	బుకింగ్‌లు
5న	10,042
17	10,116
18	10,113
19	10,417
22	10,257
24	10,279
25	10,042
28	10,575

జనవరి నుంచే డిమాండ్

సాధారణంగా గ్రేటర్ హైదరాబాద్‌లో ట్యాంకర్ల డిమాండ్ వేసవిలో ఉంటుంది. కానీ ఈ ఏడాది జనవరి నెలలోనే ట్యాంకర్లకు డిమాండ్ పెరిగింది. గతేడాది జనవరిలో 80 వేల ట్యాంకర్లను బుక్ చేసుకోగా, ఈ ఏడాది 1.20 లక్షల ట్యాంకర్లను బుక్ చేసుకున్నారు. గతేడాదితో పోల్చితే ఫిబ్రవరి, మార్చి నెలల్లోనూ 40 నుంచి 50 శాతం మేర ట్యాంకర్ల బుకింగ్ పెరిగినట్లు తెలిసింది.

ఏప్రిల్‌లోనే దాటిన పదివేల మార్క్

గతేడాది మండు వేసవి మే నెలలో కూడా రోజువారిగా ట్యాంకర్ల బుకింగ్ 9వేలు దాటలేదు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలోనే పదివేలు దాటడం చర్చనీయాంశంగా మారింది. ఏప్రిల్ ఒకటిన 8,943

మిగతా 4వ పేజీలో..


వ్యాపారులు లైట్లు ఆపేయడంతో చార్మినార్ పరిసరాల్లో చీకటి

వక్ఫ్ సవరణ బిల్లుపై
లైట్లు ఆపి నిరసన
రాజేంద్రనగర్ సర్కిల్‌లో కరెంట్ నిలుపుదల 8



జూన్ 26 నుంచి
గోల్కొండ బోనాలు
షెడ్యూల్ విడుదల చేసిన అధికారులు 8

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధురాలు
పశ్య కన్నమ్మ కన్నుమూత 6

పోలీస్ స్టేషన్ల పేరు మార్పు

ప్రతీజోన్‌లో సైబర్ క్రైం సెల్ ఏర్పాటు
మహిళల భద్రతకు ప్రత్యేక యూనిట్లు
హైదరాబాద్ కమిషనరేట్ పునఃవ్యవస్థీకరణ
ఆదేశాలు జారీ చేసిన సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కమిషనరేట్ పునఃవ్యవస్థీకరణకు సీపీ సీవీ ఆనంద్ చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా పలు పోలీస్‌స్టేషన్ల పేర్ల మార్పు, కొత్తవి ఏర్పాటు, సిబ్బంది నియామకం చేపడుతూ ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం లేకుండా కమిషనరేట్‌కు మంజూరైన 17వేల మంది సిబ్బందిని అంతర్గత సర్దుబాటు, పలు మార్పులను సూచిస్తూ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలను హోంశాఖ ఈ నెల 24న ఆమోదిస్తూ జీఓ 57ను జారీ చేసింది. ఈ మేరకు కమాండ్ కంట్రోల్ రూమ్‌లోని కమిషనరేట్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో సీపీ వివరాలు వెల్లడించారు.


కమాండ్ కంట్రోల్ రూమ్

మార్పులు ఇలా..

నగరంలోని పలు డివిజన్‌లు, పోలీస్‌స్టేషన్‌ల పేర్లను మార్చారు. గోల్కొండ డివిజన్‌ను టొలిచౌకిగా, సెక్రటేరియట్ పోలీస్‌స్టేషన్‌ను లేక్ పోలీస్‌స్టేషన్‌గా, షాహినాత్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌ను గోషామహల్‌గా మార్చారు. పలు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌ల పేర్లను కూడా మార్చారు. మారేడ్‌పల్లి, బోయినపల్లి, నారాయణగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లను తీసివేశారు. నాంపల్లి, అంబర్‌పేట, లంగర్‌హౌస్, బహదూర్‌పురా, నల్లకుంట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లను గాంధీనగర్, ఉస్మానియా యూనివర్సిటీ, కుల్సుంపుర, చత్రినాక, సైదాబాద్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లుగా మార్చారు.

సైబర్ క్రైం సెల్

పెరుగుతున్న సైబర్ నేరాలను దృష్టిలో పెట్టుకొని ప్రతీ లా అండ్ ఆర్డర్ జోన్‌లో ఒక సైబర్ క్రైం సెల్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ సెల్‌లో ఎస్సై, ఐదుగురు కానిస్టేబుళ్లు ఉంటారు. మహిళా భద్రత, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్లను అనుసంధానం చేసి అదనపు సిబ్బందిని నియమించారు.

పరిశోధనా ఫలితాలు ప్రతి రైతుకూ చేరాలి

కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్
ఐసీఏఆర్ సంస్థల అధిపతులకు దిశానిర్దేశం

రాజేంద్రనగర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరిశోధనా ఫలితాలు ప్రతి రైతుకూ చేరాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహన్ అన్నారు. వ్యవసాయ పరిశోధనలు, ఆవిష్కరణల బలోపేతంపై ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగీలాల్ జాట్‌తో పాటు వ్యవసాయ రంగ ప్రముఖులు సమావేశంలో పాల్గొన్నారు. అదే సమయంలో రాజేంద్రనగర్‌లోని జాతీయ వరి పరిశోధన సంస్థ (ఐఐఆర్‌ఆర్), జాతీయ చిరుధాన్యాల పరిశోధన సంస్థ(ఐఐఎంఆర్), జాతీయ వ్యవసాయ పరిశోధన నిర్వాహణ సంస్థ (నార్మ్), జాతీయ నూనెగింజల పరిశోధన సంస్థ (ఐఐఓఆర్), నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్‌ఎం), నేషనల్ బ్యూరో ఫర్ ప్లాంట్ జెనిటిక్ రీసెర్చ్ (ఎన్‌బీపీజీఆర్), ప్రాజెక్ట్ డైరెక్టరేట్ ఆన్ పౌల్ట్రీ (పీడీపీ) సంస్థల డైరెక్టర్లు, ఉన్నతాధికారులు వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ఖరీఫ్ విత్తే సమయంలో రైతులు సోయాబీన్ పండించేలా చూడాలని సూచించారు. గోధుమ, వరితో పాటు పప్పుధాన్యాలు, నూనెగింజల ఉత్పత్తిని పెంచేలా పరిశోధనలు జరగాలన్నారు.


ఉన్నతాధికారులతో సమావేశమైన కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

ముగ్గురు గంజాయి
విక్రేతల అరెస్ట్

24 కిలోల సరుకు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయాలు చేస్తున్న ముగ్గురిని సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. తలాబ్‌కట్ట భవానీనగర్‌కు చెందిన మహ్మద్ ఒమర్ (21), అదే ప్రాంతానికి చెందిన మహ్మద్ గౌస్ హుస్సేన్ (47), మహ్మద్ సొహైల్ (20) కలిసి గంజాయి విక్రయాలు చేస్తున్నారు. వీరిపై నిఘా పెట్టిన పోలీసులు గంజాయి విక్రయిస్తుండగా అరెస్ట్ చేశారు. వీరి నుంచి 24 కిలోల గంజాయి, 3 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

భూసేకరణ ప్రక్రియ
సత్వరమే పూర్తి చేయాలి

- జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్



హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఆరాంఘర్ ఫ్లై ఓవర్ ర్యాంప్‌ల నిర్మాణానికి కావాల్సిన భూసేకరణ ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని అధికారులను జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశించారు. ఆరాంఘర్ నుంచి జూపార్క్ వరకు చేపట్టిన ఫ్లై ఓవర్, శాస్త్రీపురం ఆర్‌ఓబీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఆర్‌ఓబీ రైల్వే పోర్షన్ పెండింగ్‌లో ఉందని ప్రాజెక్టు ఈఈ శ్రీనివాస్ కమిషనర్‌కు వివరించారు. రైల్వే సీఈతో సమన్వయం చేసుకుని తొందరగా పనులు పూర్తి చేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు.

ఎమ్మెల్యే రాజాసింగ్ కార్యాలయం వద్ద పాకిస్థాన్ జెండా స్టిక్కర్లు

గోషామహల్/ తిరుపతి(టీటీడీ), ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): జమ్మూ కశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ఖండిస్తూ గోషామహల్ ఎమ్మెల్యే టి.రాజాసింగ్ వినూత్న నిరసనకు తెర తీశారు. తన కార్యాలయానికి వచ్చిన సందర్శకులు చెప్పులు విడిచే స్థలంలో పాకిస్థాన్ జెండా స్టిక్కర్లను అతికించడం కలకలం సృష్టించింది. సమాచారమందుకున్న మంగళ్‌హాట్ పోలీసులు వాటిని తొలగించారు. దీంతో ఎమ్మెల్యే రాజాసింగ్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పాకిస్థాన్‌లో భారత్ జెండాలను తగులబెడుతున్నారని, మన దేశంలో మాత్రం పోలీసులు ఇలా వ్యవహరించడం తగదన్నారు.

పోలీసుల తీరుపై ఆగ్రహం

బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాజాసింగ్ తిరుపతిలో జెండా వివాదంపై స్పందించారు. 'మా ఆఫీసులోకి వచ్చివెళ్లే వారు పాకిస్థాన్ జెండాను తొక్కాలని గడపలో అతికించాం. మా తెలంగాణ పోలీసులు వచ్చి ఆ జెండాను తీసేసి వెళ్లారని మా కార్యకర్తలు నాకు సమాచారం ఇచ్చారు. నేను పోలీసులను అడిగితే అది పాకిస్థాన్ జెండా కాదు.. ఒక మతానికి చెందిన జెండా అంటున్నారు. నేను పాకిస్థాన్ జెండాకు, మతానికి సంబంధించిన జెండాకు తేడా చెప్పాను. తెలంగాణ పోలీసులకు అది కూడా అవగాహన లేదు. ఢిల్లీలో ప్రధాని మోదీ మంచి సమావేశం నిర్వహించి ఉగ్రవాదులకు తగిన గుణపాఠం చెప్పనున్నారు' అని రాజాసింగ్ వివరించారు.

'వక్ఫ్' బిల్లుకు వ్యతిరేకంగా 'చీకటి' నిరసన

రాజేంద్రనగర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ సవరణ బిల్లు - 2025ను వ్యతిరేకిస్తూ ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు బుధవారం రాత్రి 9:00 గంటల నుంచి 9:15 నిమిషాల వరకు రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో ఇళ్లు, దుకాణాలలో కరెంట్ ఆపివేసి నిరసన వ్యక్తం చేశారు. శాస్త్రీపురం కాలనీలో ఎంఐఎం అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తన ఇంట్లో కరెంటు ఆపివేసి నిరసన వ్యక్తం చేశారు. సులేమాన్‌నగర్ డివిజన్ వాటర్ ట్యాంక్ వద్ద శాసనమండలి సభ్యుడు మీర్జా రహ్మత్ బేగ్, నాయకులు నవాజుద్దీన్, మహ్మద్ ముర్తుజా అలీ తదితరులు కరెంటు ఆపివేసి నిరసనలో పాల్గొన్నారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని వారన్నారు. ప్రధానమంత్రికి తమ నిరసనను తెలపడానికి ఈకార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు.



శాస్త్రీపురంలో తన ఇంటి వద్ద కరెంటు ఆపివేసి నిరసన తెలుపుతున్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

విద్యావికాస్ విజయకేతనం

నార్సింగ్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): గండిపేట మండలం ఖానాపూర్ గ్రామంలో విద్యావికాస్ హైస్కూల్ విద్యార్థులు 10వ తరగతి పరీక్షలో విజయకేతనం ఎగురవేశారు. విద్యార్థిని జి.స్వాతిక 575/600 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా, కె.హేమవర్షిణి 564/600 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. పాఠశాల విద్యార్థులందరూ ఉత్తీర్ణులై వందశాతం మార్కులు సాధించడం ఆనందంగా ఉందని ప్రిన్సిపల్ కె. హేమలత, కరస్పాండెంట్ తలారి రాములు ఆనందం వ్యక్తం చేసి, విద్యార్థులకు అభినందనలు తెలిపారు.


జి.స్వాతిక(575)


హేమవర్షిణి(564)

పయనీర్ కాన్సెప్ట్ ప్రభంజనం


కె.రిషిక


పి.పవిత్ర స్వేయిన్

రాజేంద్రనగర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవుపల్లి డివిజన్ కాటేదాన్ టీఎన్‌జీవోస్ కాలనీ మణికంఠ హిల్స్‌లోని పయనీర్ కాన్సెప్ట్ హైస్కూల్ విద్యార్థులు 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో సత్తా చాటారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణులై ప్రతిభ కనబరిచారు. ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ సంరెడ్డి ప్రమోద్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎస్.ప్రవీణారెడ్డి, డైరెక్టర్ ఎస్.సాకేత్‌రెడ్డి అభినందించారు. విద్యార్థులను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులు చేసిన కృషిని అభినందించారు. తమ పాఠశాలలో ఎన్‌సీసీ ఉందని, వేదిక్ మ్యాథ్స్, అబాకస్ బోధిస్తామన్నారు. నర్సరీ నుంచి ఐదవ తరగతి వరకు సీబీఎస్ఈ సిలబస్ ఉందని, 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు ఐఐటీ ఫౌండేషన్ క్లాసెస్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు..

పాఠశాలకు చెందిన కె.రిషిక 578 మార్కులు, పి.పవిత్ర స్వేయిన్ 576 మార్కులతో స్కూల్ టాపర్లుగా నిలిచారు. కిదాంబి నిహిత 561, అలోక్ కుశ్వాహ 557, గుర్రం కార్తీక 546, రుద్ర తులసి భవానీ 543, మాధురి శేరికర్ 542, రాజు కుమార్ 537, పి.శ్రీనైతిక్ 536, ప్రశాంత్ తివారికి 535 మార్కులు వచ్చాయి.

'భూదాన్ భూ అక్రమాలపై విచారణ జరిపించాలి'

బర్కత్‌పుర, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): మాజీ చైర్మన్ గున్నా రాజేందర్ రెడ్డి హయాంలో జరిగిన భూదాన్ భూముల అక్రమాలపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలని ఆలిండియా సర్వసేవా సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ మహాదేవ్ విద్రోహి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. భూదాన్ భూములను స్వాధీనం చేసుకోని నిరుపేదలకు పంపిణీ చేయాలని, బూదాన్ యజ్ఞబోర్డును పునరుద్ధరించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆలిండియా సర్వోదయ మండలి జాతీయ అధ్యక్షుడు వెదిరె అరవింద్ రెడ్డి రాష్ట్ర అధ్యక్షుడు తొలుపునూరి కృష్ణా గౌడ్, వెదిరె ప్రోమోతీస్ చంద్రారెడ్డి, డాక్టర్ వెదిరే ప్రమోద్ చంద్రారెడ్డితో కలిసి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో భూదాన్ భూముల అన్యాక్రాంతంపై సీబీసీఐడీ విచారణకు ఆదేశించారని, ప్రస్తుత ప్రభుత్వం ఈ విచారణ వివరాలను వెల్లడించాలని వారు విజ్ఞప్తి చేశారు. గున్నా రాజేందర్ ఇంటికి భూదాన్ యజ్ఞబోర్డుతో వెదిరే రాంచంద్రారెడ్డి కుటుంబంతో ఎలాంటి సంబంధం లేదని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో భూదాన్ ఉద్యమంలో బూదాన్ భూములు పొందిన కుటుంబాలకు చెందిన వారు శ్రీమంత్ గిరి, నరేష్, రాజు, లక్ష్మణ్, దానయ్య పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/YwRmPEaలో చదవండి.
Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.
నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

'భూ భారతితో సమస్యలు పరిష్కారం'

రాజేంద్రనగర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): భూ భారతి ద్వారా భూ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థలో బుధవారం భూ భారతి చట్టం-2025పై రాజేంద్రనగర్ మండలంలోని రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఆర్డీవో వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ బి.రాములు, వ్యవసాయాధికారి కవిత, నార్సింగ్ మార్కెంట్ కమిటీ చైర్మన్ వేణుగౌడ్, గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి మల్లేశ్ పాల్గొన్నారు.

624 మందికి చెక్కుల పంపిణీ

రాజేంద్రనగర్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి పథకాల ద్వారా 624 మంది లబ్దిదారులకు బుధవారం రూ.5,65,65,424 కోట్లు విలువ చేసే చెక్కులను పంపిణీ చేశామని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ తెలిపారు. బుధవారం రాజేంద్రనగర్‌లోని గ్రామీణాభివృద్ధి సంస్థలో జరిగిన కార్యక్రమంలో 162 మంది కల్యాణలక్ష్మి చెక్కులను, 462 షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశామన్నారు.

జూన్ 26 నుంచి గోల్కొండ బోనాలు

- షెడ్యూల్ విడుదల చేసిన అధికారులు

నార్సింగ్, ఏప్రిల్ 30(ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్వహించే బోనాల సంబరాల షెడ్యూల్‌ను దేవాదాయశాఖ అధికారులు విడుదల చేశారు. గోల్కొండ బోనాలతో పాటు పాతబస్తీ లాల్‌దర్వాజా బోనాలు, సికింద్రాబాద్ బోనాల తేదీలను కూడా ప్రకటించారు. గోల్కొండ కోట శ్రీజగదాంబిక అమ్మవారి బోనాలు జూన్ 26వ తేదీ ప్రారంభమై జూలై 24వ తేదీతో ముగుస్తాయి. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాలు జూలై 13న, లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారి బోనాలు జూలై 20న జరుగనున్నాయి.

షెడ్యూల్ ఇదే..

జూన్ 26వ తేదీ గురువారం మొదటి బోనం, 29వ తేదీ ఆదివారం రెండవ బోనం, జూలై 3వ తేదీ గురువారం మూడవ బోనం, 6వ తేదీ ఆదివారం నాల్గవ బోనం, 10వ తేదీ గురువారం ఐదవ బోనం, 13వ తేదీ ఆదివారం ఆరవ బోనం, 17వ తేదీ గురువారం ఏడవ బోనం, 20వ తేదీ ఆదివారం 8వ బోనం, 24వ తేదీ గురువారం 9వ బోనం నిర్వహించనున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ, స్వాధీనం చేసుకున్న గంజాయి, నిందితులు (ముసుగు ధరించిన వారు)

19 కిలోల గంజాయి స్వాధీనం

● ఇద్దరు వ్యక్తుల అరెస్ట్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్ మీదుగా మన్మాడ్‌కు గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను రైల్వే పోలీసుల అరెస్ట్ చేశారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. వారి నుంచి 19 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జావీద్, ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన అతిక్, ముబీన్(51), నఫీస్ అఫ్సర్ ఖాన్ పఠాన్(32) స్నేహితులు. ముబీన్, నఫీస్ అఫ్సర్ ఖాన్ పఠాన్ పుణెలో చీరల వ్యాపారం చేసేవారు. రెండు నెలల క్రితం అతిక్ విశాఖపట్నం నుంచి మన్మాడ్‌కు గంజాయి సరఫరా చేయడానికి ముబీన్, అఫ్సర్‌ఖాన్‌కు ట్రిప్పుకు రూ. 5 వేలు ఆఫర్ చేశాడు. వీరు గతంలో రెండుసార్లు విశాఖపట్నం నుంచి మన్మాడ్ గంజాయి సరఫరా చేశారు. విశాఖపట్నం నుంచి రైలులో 19 కిలోల గంజాయి తీసుకెళ్తున్నారు. ఖాజీపేటలో ఆర్పీఎఫ్ పోలీసులు తనిఖీ చేస్తున్నారని తెలుసుకొని ఖాజీపేటలో రైలు దిగి బస్సులో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు బుధవారం చేరుకుని వెయిటింగ్ హాల్‌లో కూర్చున్నారు. పోలీసులను చూసి అతిక్ పారిపోయాడు. ముబీన్, నఫీస్‌ను పట్టుకున్నారు. వారి నుంచి 19 కిలోల గంజాయి స్వాధీనం చేసుకొని నిందితులను రిమాండ్‌కు తరలించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ. 9.45 లక్షలు ఉంటుందని తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ జైపాల్‌రెడ్డి

బావమరిదిని హత్యచేసిన బావ అరెస్ట్

బౌద్ధనగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బావమరిదిని హత్యచేసిన కేసులో బావను పోలీసులు అరెస్ట్ చేశారు. ఏసీపీ జైపాల్‌రెడ్డి బుధవారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. లూథరస్, శాంసన్ రాజు బావా బామ్మరుదులు. లూథరస్ ప్రైవేట్‌లో రికవరీ ఏజెంట్‌గా, శాంసన్ రాజు చేపల మార్కెట్‌లో పనిచేస్తున్నారు. ఏప్రిల్ 27వ తేదీన శాంసన్‌రాజు పార్శీగుట్ట చౌరస్తాలో స్నేహితుడితో కలిసి మద్యం తాగుతూ అక్కడే ఉన్న బావ లూథరస్‌తో గొడవపడ్డాడు. అదేరోజు సాయంత్రం లూథరస్ అదే ప్రాంతానికి మద్యం తాగడానికి వెళ్లాడు. శాంసన్‌రాజు అతడిపై దాడిచేసి, దుర్భాషలాడి కుటుంబ సభ్యులను చంపేస్తానని బెదిరించాడు. మద్యం తాగుదామని లూథరస్ శాంసన్‌రాజుకు ఫోన్ చేసి ఇంటికి పిలిచాడు. మరో ఇద్దరు స్నేహితులతో కలిసి మద్యం తాగారు. ఇద్దరు స్నేహితులు వెళ్లిపోయాక శాంసన్‌రాజు నిద్రపోయాడు. రాత్రి 11 గంటల సమయంలో లూథరస్ ఇనుపరాడ్‌తో కొట్టి అతడిని చంపేశాడు. కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు బుధవారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారించగా నేరాన్ని అంగీకరించాడు. కేసు నమోదు చేసి అతడిని రిమాండ్‌కు తరలించారు.

బసవేశ్వరుడి చరిత్రను ఈ తరానికి తెలియజేయాలి

● మంత్రి పొన్నం ప్రభాకర్



ట్యాంక్‌బండ్‌పై బసవేశ్వరుడి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, సురేష్ షెట్కార్ తదితరులు

కవాడిగూడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): బసవేశ్వరుడి చరిత్ర ఈ తరానికి తెలియజేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. బసవేశ్వర జయంతి వేడుకలను ట్యాంక్‌బండ్‌పై రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం, వీరశైవ సమాజం సికింద్రాబాద్ సంయుక్తాధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ ట్యాంక్‌బండ్‌పై బసవేశ్వరుడి విగ్రహం ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. కార్యక్రమంలో ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్సీ కవిత, మాజీ ఎంపీ బీబీ పాటిల్, రాష్ట్ర బీసీ కమిషన్ ఛైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, తెలంగాణ వీరశైవ లింగాయత్ ఫెడరేషన్ వైస్ ఛైర్మన్ మాడపు వీరమల్లేష్ పాల్గొన్నారు.

సామాజిక సమానత్వం కోసం పాటుపడిన బసవేశ్వరుడు : కేసీఆర్

హైదరాబాద్: సామాజిక సమానత్వం కోసం పాటుపడిన విప్లవకారుడు బసవేశ్వరుడని మాజీ సీఎం కేసీఆర్ అన్నారు. బసవేశ్వర జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రజలకు బుధవారం ఒక ప్రకటన ద్వారా శుభాకాంక్షలు తెలిపారు. ఆయన ఆశయాలు అందరికీ ఆదర్శనీయమని అన్నారు. బసవ జయంతి సందర్భంగా బుధవారం ఎక్స్ వేదికగా కేటీఆర్ ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు.

ప్రాథమిక విద్య పూర్తిచేసిన ఖైదీలకు

నేరుగా పదో తరగతి విద్యాబోధన

కొత్త పథకానికి జైళ్లశాఖ శ్రీకారం



ఖైదీల విద్యాబోధన బ్రోచర్‌ను విడుదల చేస్తున్న జైళ్ల శాఖ డీజీ సౌమ్యా మిశ్రా, పరంప్రీత్ సింగ్ తదితరులు

కుషాయిగూడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్య పూర్తి చేసిన ఖైదీలను నేరుగా 10వ తరగతి విద్యాబోధనతోపాటు పరీక్ష రాసేలా కొత్త పథకానికి జైళ్లశాఖ శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా బుధవారం రాష్ట్ర జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా నేతృత్వంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ (ఎన్ఐఓఎస్) సంయుక్తాధ్వర్యంలో కొత్త ప్రాజెక్టు ప్రారంభమైంది. ఎన్ఐఓఎస్‌తో 2024లో జరిగిన ఒప్పందం మేరకు 2024-25 విద్యా సంవత్సరానికి రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 108 మంది ఖైదీలకు పదో తరగతిలో ప్రవేశం కల్పించారు. డీజీ సౌమ్యామిశ్రా మాట్లాడుతూ రీ-ఫార్మేషన్, రిహ్యాబిలిటేషన్, రీ-ఇంటిగ్రేషన్ అనే మూడు 'ఆర్'లతో ఖైదీల పునరావాసానికి జైళ్ల శాఖ కృషి చేస్తోందని వివరించారు. శిక్షా కాలం పూర్తి చేసుకున్న ఖైదీలు సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని ప్రారంభించేందుకు ఈ ప్రాజెక్టు ఎంతగానో ఉపయోగపడుతుందని స్పష్టం చేశారు. ఎన్ఐఓఎస్ తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల డైరెక్టర్ పరంప్రీత్ సింగ్ మాట్లాడుతూ విద్య ద్వారానే పునరావాసం సాధ్యమవుతుందన్నారు. చదువుకునే అవకాశం కల్పించినందుకు పలువురు ఖైదీలు జైళ్లశాఖ ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జైళ్లశాఖ ఐజీలు వై.రాజేష్, ఎన్.మురళీ బాబు, వరంగల్ రేంజ్ డీఐజీ ఎం.సంపత్ తదితరులు పాల్గొన్నారు.

మీ సేవలు మరువలేనివి

● పదవీ విరమణ చేసిన ఉద్యోగులను సన్మానించిన సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖకు మీరు అందించిన సేవలు మరువలేనివని నగర పోలీస్ కమిషనర్ సీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. బుధవారం హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన 34 మంది అధికారులను, ఉద్యోగులను ఆయన సన్మానించారు. సీపీ మాట్లాడుతూ కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని వారికి సూచించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్(అడ్మిన్) పరిమళ హనా నూతన్, పరిపాలనా అధికారి శ్రీనివాస్, చీఫ్ అకౌంట్ ఆఫీసర్ శ్రీనివాస్, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు ఎన్.శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాచకొండలో..

రాచకొండ పోలీస్ కమిషనరేట్‌లో పనిచేస్తూ పదవీ విరమణ చేసిన సీఏఆర్ అంబర్‌పేట రిజర్వు ఇన్‌స్పెక్టర్ ఎండీ గౌస్, స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ సాదిక్ అలీ, వీఆర్ఎస్ తీసుకున్న ఉప్పల్ ట్రాఫిక్ ఎస్ఐ మనోహర్‌రావు, ఎల్బీనగర్ ఎస్ఐ జంగయ్య, కుషాయిగూడ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఖాజా జహీరుద్దీన్‌ను సీపీ సుధీర్‌బాబు సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో డీసీపీ అడ్మిన్ ఇందిర, అడిషనల్ డీసీపీ అడ్మిన్ శివకుమార్, ఏసీపీ స్పెషల్ బ్రాంచ్ రవీందర్ రెడ్డి, సీఏఓ సుగుణ, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు సీ.హెచ్. భద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటయోధురాలు

పశ్య కన్నమ్మ కన్నుమూత

● పలువురు వామపక్ష నాయకుల సంతాపం



పశ్య కన్నమ్మ(ఫైల్)

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, జాతీయ మహిళా సమాఖ్య నాయకురాలు పశ్య కన్నమ్మ(97) ఇకలేరు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె బుధవారం ఉదయం హుజూర్‌నగర్‌లోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. కన్నమ్మ కుమార్తె పశ్య పద్మ సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలుగా ఉన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కమ్యూనిస్టు పార్టీ సాహిత్యంతో పాటు రహస్య సమాచారాన్ని బట్వాడా చేయడంలో కన్నమ్మ చురుగ్గా వ్యవహరించారు. సాయుధ పోరాటంలో పాల్గొంటున్నారన్న కారణంగా ఆమె ఇంటిపై రజాకార్లు దాడి చేసి తండ్రిని గాయపరచడమే కాకుండా, అన్న దొంతిరెడ్డి శంబిరెడ్డిని చంపేశారు. ఆమె భర్త రామిరెడ్డి సైతం జైలుకెళ్లారు.

పశ్య కన్నమ్మ మృతికి సీపీఐ జాతీయ నేతలు డి. రాజా, నారాయణ, ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి, ఎస్‌యూసీఐ(సీ) రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మురహరి, స్వాతంత్ర్యసమరయోధుడు కందిమళ్ల ప్రతాపరెడ్డి తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. గురువారం ఉదయం 11గంటలకు హుజూర్‌నగర్ శ్మశానవాటికలో కన్నమ్మ అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుమారుడు శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఒక్కరోజే 10,575 ట్యాంకర్ల బుకింగ్

(మొదటి పేజీ తరువాయి)

ట్యాంకర్లు బుక్ కాగా, ఐదో తేదీ 10,042 ట్యాంకర్లు బుక్ అయ్యాయి. 28వ తేదీన అత్యధికంగా 10,575 ట్యాంకర్లు బుక్ అయ్యాయి. వాతావరణం చల్లబడి, వర్షాలు కురిసిన రోజు కూడా భారీగా ట్యాంకర్లను బుక్ చేసుకోవడం విశేషం. ఏప్రిల్ నెలలో దాదాపు 2.90లక్షల ట్యాంకర్లు బుక్ కాగా, అదే స్థాయిలో డెలివరీ చేశారు.

సరఫరాలో ఇబ్బందులు లేకుండా చర్యలు

మాదాపూర్, జూబ్లీహిల్స్, హఫీజ్‌పేట, మియాపూర్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, కొండాపూర్, ఎస్ఆర్ నగర్, యూసుఫ్‌గూడ, బంజారాహిల్స్, నిజాంపేట, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ ఇలా గ్రేటర్‌లోని సుమారు 30 ప్రాంతాల్లో ట్యాంకర్ల డిమాండ్ క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం 972 ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. డిమాండ్ ఉన్న డివిజన్లలో అదనపు ఫిల్లింగ్ స్టేషన్లను, ఫిల్లింగ్ పాయింట్లను ఏర్పాటు చేస్తున్నారు. మూడు షిఫ్టుల్లో ట్యాంకర్లు డెలివరీ చేస్తున్నారు.

నండూరి రామకృష్ణమాచార్యులు చిరస్మరణీయులు



నండూరి సాహిత్య పురస్కారం అందుకుంటున్న విజయలక్ష్మి

అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పద్యకవిగా, అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా తెలుగు భాషా ప్రాచుర్యానికి, తెలుగు సాహిత్యానికి విశేష కృషి చేసిన డాక్టర్ నండూరి రామకృష్ణమాచార్యులు చిరస్మరణీయులని రాష్ట్ర ఖజానా, లెక్కల శాఖ ఉప సంచాలకురాలు జి.వసుంధర అన్నారు. బుధవారం శ్రీకృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయంలో నవ్య సాహితీ సమితి, నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం సంయుక్తాధ్వర్యంలో రామకృష్ణమాచార్య 105వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహక సంస్థల పక్షాన ప్రముఖ కవయిత్రి, విదుషీమణి డాక్టర్ పులిగడ్డ విజయలక్ష్మికి నండూరి సాహిత్య పురస్కారం అందజేశారు. నవ్య సాహితీ సమితి అధ్యక్షుడు ఆచార్య ఫణీంద్ర, డాక్టర్ ఆర్.అనంత పద్మనాభరావు, కె.సాగర్‌రావు, నండూరి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అయినా.. ప్లేసు మారలేదు!

(మొదటి పేజీ తరువాయి)

నుంచి 73,911 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 65,436మంది (88.53%) ఉత్తీర్ణత సాధించారు. గతేడాది 73,202 మంది పరీక్షకు హాజరుకాగా, 63,511 మంది(86.76%) ఉత్తీర్ణులయ్యారు. గతేడాదితో పోల్చితే కేవలం 1.77 శాతం పాస్ పర్సంటేజీ పెరిగింది. కానీ, రాష్ట్రస్థాయి ర్యాంకులకు వచ్చేసరికి 2024 నాటి 30వ స్థానమే హైదరాబాద్‌కు ఇప్పుడు కూడా దక్కింది. 2023లో 68,468 మంది పరీక్ష రాస్తే 54,971 (80.29%) పాస్ అయ్యారు. అప్పుడు రాష్ట్రస్థాయిలో 28వ స్థానం దక్కింది.

ఫలించని కలెక్టర్ సమీక్షలు

రాజధాని హైదరాబాద్ జిల్లాలో విద్యా వ్యవస్థను గాడిన పెట్టేందుకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి కొంతకాలంగా ప్రత్యేక దృష్టి సారించారు. తాను కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విద్య, వైద్య రంగాల అభివృద్ధికి తీవ్రంగా కృషి చేస్తున్నారు. ప్రధానంగా పదో తరగతి ఫలితాలను మెరుగుపరిచేందుకు ఈ ఏడాది జనవరి నుంచి మార్చి మొదటివారం వరకు క్షేత్రస్థాయిలో పాఠశాలలను సందర్శించారు. సబ్జెక్టు టీచర్లు, రిసోర్స్ పర్సన్లు, డిప్యూటీ డీఈఓలతో తరచూ సమీక్షలు నిర్వహించారు. ఈసారి జిల్లాలో తప్పకుండా 95 శాతానికి పైగా ఫలితాలు రావాలని, విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహించాలని అధికారులను ఎప్పటికప్పుడూ ఆదేశించారు. కలెక్టర్ దృష్టి సారించినప్పటికీ ఆశించిన ఫలితాలు రాకపోవడంతో ఇటు తల్లిదండ్రులు, అటు అధికారులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

ఇదే తీరులో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలు

హైదరాబాద్ జిల్లా మాదిరిగా గ్రేటర్‌లోని మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల స్థానాల ర్యాంకులు కూడా పడిపోయాయి. 2023లో రంగారెడ్డి జిల్లా రాష్ట్రంలో 20వ స్థానంలో ఉంది. 2024లో 24వ స్థానానికి చేరగా, తాజాగా 31వ స్థానంలో నిలిచింది. మేడ్చల్ జిల్లా 2023లో 14వ స్థానంలో ఉంటే, 2024లో 27వ స్థానంలో నిలిచింది. ప్రస్తుత ఫలితాల్లో 28వ ర్యాంకులో ఉండడం గమనార్హం.

కాలుష్య నియంత్రణకు రవాణా శాఖలో పలు మార్పులు

● వాహన్ సారథి పోర్టల్‌ను ప్రారంభించిన మంత్రి పొన్నం

తిరుమలగిరి ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగరం మరో ఢిల్లీ కాకుండా కాలుష్య నియంత్రణకు రవాణా శాఖలో పలు మార్పులు తీసుకొస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 15 ఏళ్ల పూర్తయిన వాహనాలను పూర్తిగా నిరోధిస్తున్నామన్నారు. రవాణాశాఖను సాంకేతికంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. బుధవారం తిరుమలగిరి ఆర్టీఓ కార్యాలయంలో వాహన్ సారథి పోర్టల్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ పోర్టల్ ద్వారా దేశంలో ఎక్కడ ఉన్నా డ్రైవింగ్ లైసెన్స్, వాహనాల రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందన్నారు. పోర్టల్‌లో దేశంలోని 28 రాష్ట్రాలు ఇప్పటికే చేరాయని, 29వ రాష్ట్రంగా తెలంగాణ చేరడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురికి డ్రైవింగ్ లైసెన్స్‌లతోపాటు హెల్మెట్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే శ్రీగణేష్, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేందర్ మోహన్, కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్, నామినేటెడ్ సభ్యురాలు భానుక నర్మద తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేఎన్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ నందకుమార్, చిత్రంలో లక్ష్మీనారాయణ తదితరులు

ఉత్సాహంగా హోమియో ఫెస్ట్

ఖైరతాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): హోమియో వైద్య పితామహుడు డాక్టర్ శామ్యూల్‌హనిమన్ జయంతిని పురస్కరించుకొని బుధవారం నిర్వహించిన హోమియో ఫెస్ట్ ఉత్సాహంగా సాగింది. ఖైరతాబాద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్‌లో జరిగిన కార్యక్రమాన్ని కేఎన్ఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ పీవీ నందకుమార్‌రెడ్డి, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ జ్యోతి వెలిగించి ప్రారంభించారు. హోమియో వైద్య విద్యార్థుల్లో క్లినికల్ సామర్థ్యాలను పెంచడంతో పాటు సృజనాత్మక శక్తిని, పోటీతత్వాన్ని అలవాటు చేసేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహక సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కేపీ గోపాలకృష్ణ, ప్రధాన కార్యదర్శి డాక్టర్ దుర్గాప్రసాద్ తెలిపారు. డాక్టర్ శివశంకర్ కూరపరెడ్డిని సత్కరించారు. సాయంత్రం జరిగిన ముగింపు కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలచారి, ప్రముఖ సినీ దర్శకుడు మారుతి పాల్గొని విశేష సేవలందించిన వారికి బహుమతులు అందజేశారు.

జేఎన్‌టీయూ కాంట్రాక్టు అధ్యాపకుల సమ్మె విరమణ

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో సమ్మె చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు బుధవారం తమ ఆందోళనలను విరమించారు. కాంట్రాక్టు అధ్యాపకుల సర్వీసును క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ 12 రోజులుగా సమ్మెకు దిగిన సంగతి తెలిసిందే. కాంట్రాక్ట్ అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందని వర్సిటీ ఉన్నతాధికారులు ఆందోళనలో పాల్గొన్నవారికి తెలియజేయడంతో సమ్మె విరమించినట్లు తెలిసింది. బేసిక్ పేతో పాటు డీఏ, హెచ్ఆర్ఏ, ప్రతియేటా మూడు శాతం వార్షిక ఇంక్రిమెంట్ అంశాలను పరిశీలించేందుకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. ప్రభుత్వం అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుందని ఆశిస్తూ, కాంట్రాక్ట్ అధ్యాపకుల జేఏసీ రాష్ట్ర కో-ఆర్డినేటింగ్ కమిటీ సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించింది.

ఓయూలో..



మాట్లాడుతున్న ఓయూ రిజిస్ట్రార్ నరేష్ రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలో 12 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు సమ్మెను తాత్కాలికంగా విరమించారు. సీఎం హామీ, అధికారుల సూచన మేరకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నరేష్ రెడ్డి దీక్షా శిబిరానికి బుధవారం వచ్చి మాట్లాడారు. ప్రభుత్వం కాంట్రాక్ట్ ప్రొఫెసర్ల డిమాండ్లను సానుకూలంగా పరిశీలిస్తోందని, త్వరలోనే పరిష్కరిస్తుందని తెలిపారు. పర్మినెంట్ తప్ప.. మిగతా అన్ని డిమాండ్లు నెరవేరుస్తామని సీఎం హామీ ఇచ్చారని చెప్పారు. సమ్మె విరమించి విధులకు హాజరుకావాలని కోరారు. దీంతో సమ్మెను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు కాంట్రాక్ట్ ప్రొఫెసర్ల జేఏసీ రాష్ట్ర కో-ఆర్డినేట్ కమిటీ ప్రకటించింది.

ఆకట్టుకుంటున్న చిత్ర ప్రదర్శన



చిత్రమయి ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన చిత్రాలు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ తత్వంనే అందంగా చూపుతూ కళాకారుడు నరేందర్‌రెడ్డి చిత్రించిన చిత్రాలతో మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంటోంది. 'ద ఎటర్నల్ మెస్మరైజర్' శీర్షికన నిర్వహిస్తోన్న ఈ ప్రదర్శనలో 30కు పైగా శ్రీకృష్ణుని చిత్రాలతోపాటు వేంకటేశ్వరుడు, గణేశుడు, ప్రకృతి రమణీయతను చాటిచెప్పే చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రదర్శనలో 45 చిత్రాలను ఉంచామన్నారు. మే 4వ తేదీ వరకు ప్రదర్శన కొనసాగుతుందని తెలిపారు.

చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో పోలీసుల తనిఖీలు


కుషాయిగూడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రెడ్ అలర్ట్ నేపథ్యంలో బుధవారం చర్లపల్లి రైల్వే శాటిలైట్ టెర్మినల్‌లో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ ఆర్.కె.మీనా, ఏఎస్ఐ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో రైల్వే పోలీసులు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది, బాంబ్ స్క్వాడ్ తనిఖీల్లో పాల్గొన్నాయి. ప్లాట్‌ఫారాలు, వెయిటింగ్ హాళ్లు, పార్శిల్ ఆఫీసుతో పాటు శాతవాహన సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్(12713), శబరి ఎక్స్‌ప్రెస్(17230) రైళ్లలోని ప్యాంట్రీకార్, బోగీలను కూడా తనిఖీ చేశారు.

రాజ్యాంగబద్ధంగా రైతులకు హక్కులు కల్పించాలి

కవాడిగూడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగబద్ధంగా రైతులకు హక్కులు కల్పించాలని రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు ఎం. భీమయ్య, ప్రధాన కార్యదర్శి ఆర్ఆర్ అల్వార్‌రెడ్డి డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంట పండించిన రైతులకు న్యాయం జరగడం లేదని వాపోయారు. రైతులను మోసం చేస్తున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎకరాకు పంట రుణం బ్యాంకుల ద్వారా లక్ష రూపాయలు ఇవ్వాలని, ఎకరా భూమి కుదువ పెట్టుకొని రూ. 40 లక్షల రుణం ఇవ్వాలని, వ్యవసాయ ఆధారిత పరిశ్రమ పెట్టుకోవడానికి ప్రభుత్వం సహకరించాలని వారు కోరారు. రైతులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. ధర్నాలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.







తెలుగులో రాసిన వారెందరు ఎంపికయ్యారు?

- గ్రూప్-1 పేపర్లు దిద్దిన వారిలో తెలుగుపై పట్టున్నవారెందరు?
- మెయిన్స్ జవాబు పత్రాలు దిద్దిన వారికి 'కీ' ఇచ్చారా?
- పూర్తి వివరాలివ్వండి.. టీజీపీఎస్సీకి హైకోర్టు ఆదేశం
- విచారణను నేటికి వాయిదా వేసిన ఏకసభ్య ధర్మాసనం
- వ్యాసరూప పరీక్షలకు కీ ఇవ్వడం సాధ్యం కాదు: టీజీపీఎస్సీ
- సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోబోమన్న డివిజన్ బెంచ్

హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్షలను తెలుగులో రాసిన వారు ఎంత మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు? సమాధాన పత్రాలు దిద్దిన వారిలో తెలుగు భాషపై పట్టున్న వారు ఎందరున్నారు? జవాబు పత్రాలను దిద్దినవారికి నమూనా జవాబు పత్రం (కీ) ఇచ్చారా? అని టీజీపీఎస్సీని హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం ప్రశ్నించింది. వీటికి సంబంధించిన పూర్తి వివరాలు తమకు అందజేయాలని ఆదేశించింది. గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష నిర్వహణ, మూల్యాంకనంలో తీవ్ర లోపాలు ఉన్నాయని.. పరీక్షలు మళ్లీ నిర్వహించాలని పేర్కొంటూ దాఖలైన పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం బుధవారం మరోసారి విచారణ చేపట్టింది. దాదాపు రెండున్నర గంటలపాటు వాదనలు జరిగాయి. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాదులు సురేందర్‌రావు, విద్యాసాగర్ వాదనలు వినిపించారు. "కోఠి ఉమెన్స్ కాలేజీలో కేవలం మహిళా అభ్యర్థులనే కేటాయించాలన్న కాలేజీ నిర్వాహకుల విజ్ఞప్తి మేరకు ఆ కేంద్రంలో మహిళలకే పరీక్ష రాసే అవకాశం కల్పించామని చెబుతున్నారు. సాఫ్ట్‌వేర్ ద్వారా అభ్యర్థుల కేటాయింపు జరిగినప్పుడు మహిళా అభ్యర్థులను వేరు చేయడం ఎలా సాధ్యమైంది. ప్రిలిమ్స్, మెయిన్స్‌కు హాల్‌టికెట్లు మార్చారు. కొందరికి అనుకూలంగా సెంటర్లు వేయడం కోసమే చట్టవిరుద్ధంగా ఇలా చేశారు. ఏ పరీక్షలోనూ ఇలా హాల్‌టికెట్ నంబర్లలో మార్పు ఉండదు. ఎంపిక చేసిన మహిళా అభ్యర్థులను సెంటర్ నంబరు 18, 19లో వేశారు. ఇతర సెంటర్లలో మహిళా కాలేజీలు అయినప్పటికీ అక్కడ పురుషులు, మహిళలను కేటాయించారు. మొత్తం పోస్టులకుగాను 16, 17, 18, 19 సెంటర్ల నుంచే ఎక్కువ మంది అర్హత సాధించారు. కొన్ని సెంటర్ల నుంచి ఒకరిద్దరు కూడా అర్హత సాధించలేదు. పక్కపక్కన హాల్‌టికెట్ నంబర్లు ఉన్న వందల మందికి ఒకేలా మార్కులొచ్చాయి. ఆ నాలుగు సెంటర్లలోనే ఇలా ఎక్కువగా జరిగింది. అభ్యర్థులకు తగిన విధంగా పేపర్లు దిద్దే అధ్యాపకులు లేరు. అధికారిక వెబ్‌సైట్‌లో మొత్తం మార్కుల జాబితా మార్చి 10న అప్‌లోడ్ చేయగా.. పేపర్ల వారీగా మార్కులను వారం తర్వాత పెట్టారు. మరిన్ని వివరాలను మార్చి 30న అప్‌లోడ్ చేశారు. దీన్నిబట్టే అవకతవకలు జరిగాయని తెలుస్తోంది" అని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

కీ ఇవ్వడం సాధ్యం కాదు: టీజీపీఎస్సీ

తెలుగు, ఆంగ్లం, ఉర్దూ మాధ్యమాల వారీగా పేపర్లు దిద్దేవారికి నమూనా జవాబు పత్రం(కీ) ఇచ్చారా? అని టీజీపీఎస్సీ న్యాయవాది రాజశేఖర్‌ను ధర్మాసనం ప్రశ్నించగా.. మెయిన్స్ పరీక్ష వ్యాస రూపంలో జరుగుతుందని, దానికి కీ ఇవ్వడం సాధ్యం కాదని చెప్పారు. విషయ నిపుణులే పేపర్లు దిద్దుతారని.. వారికి జవాబుపై పూర్తి అవగాహన ఉంటుందని తెలిపారు. తెలుగు మాధ్యమం అభ్యర్థులు గతంలో కంటే ఎక్కువ మందే అర్హత సాధించారన్నారు. పిటిషన్లు వేసినవారు నిరుద్యోగులు కాదని, ఎక్కువ శాతం ప్రభుత్వ ఉద్యోగులని ఆరోపించారు. వారికున్న పరపతిని ఉపయోగించి మూల్యాంకనం చేసినవారి పేర్లు బయట పెడుతున్నారని.. దీంతో పేపర్లు దిద్దేవారు గగ్గోలు పెడుతున్నారని తెలిపారు. ఇలాగైతే పేపర్లు దిద్దే నిపుణులు దొరకరన్నారు. ఇరు వర్గాల వాదనలు విన్న ఏకసభ్య ధర్మాసనం తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోం..

గ్రూప్-1 నియామక పత్రాలు ఇవ్వరాదంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని టీజీపీఎస్సీ హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించింది. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయ్యాక నియామకాలను అడ్డుకోవడం సరికాదని విజ్ఞప్తి చేసింది. ఈ అప్పీల్‌పై తాత్కాలిక సీజే జస్టిస్ సుజోయ్ పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. సింగిల్ జడ్జి ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరించింది. ఈ పిటిషన్లపై సింగిల్ జడ్జి వద్దే తేల్చుకోవాలంది. అయితే, వేసవి సెలవులకు ముందే విచారణ పూర్తి చేయాలని సింగిల్ జడ్జికి సూచించింది.

ధాన్యం సేకరణ లక్ష్యం 70లక్షల టన్నులు

- చెల్లింపుల కోసం 15 వేల కోట్లు సిద్ధం: ఉత్తమ్



హైదరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో 8,381 కొనుగోలు కేంద్రాల ద్వారా 70లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఇందుకోసం రూ.15వేల కోట్లను సిద్ధంగా ఉంచినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. వచ్చే 15-20 రోజులు ధాన్యం సేకరణకు కీలక సమయమని, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రస్తుత యాసంగిలో 54.89లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగిందని, 127లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 19.60 లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని, 2.55 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.2,289 కోట్లు జమ చేశామని గుర్తు చేశారు. ధాన్యం విక్రయించిన 48గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కరీంనగర్‌లో వడ్లు ఆరబెట్టే యంత్రాలు కొనుగోలు చేసినందుకు ఆ జిల్లా కలెక్టర్‌ను అభినందించారు. ఈసారి ధాన్యం సేకరణలో రికార్డు సృష్టించనున్నామని, అవకతవకలకు చోటివ్వకుండా పారదర్శకంగా కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఎదురైతే పౌరసరఫరాలశాఖ కమిషనర్‌తో మాట్లాడాలని, అవసరమైతే తనకు నేరుగా ఫోన్‌చేసి మాట్లాడొచ్చని తెలిపారు.

నేడు పాలమూరు ప్రాజెక్టు పరిశీలనకు మంత్రి ఉత్తమ్

మంత్రి ఉత్తమ్ గురువారం పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు పరిశీలనకు వెళ్లనున్నారు. ఉదయం 10 గంటలకు నార్లాపూర్ పంప్‌హౌస్‌ను, రిజర్వాయర్ పనులను, ప్యాకేజీ-3 ఓపెన్ కెనాల్‌తో పాటు కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్‌ను సందర్శిస్తారు. ఆ తర్వాత ఏదుల రిజర్వాయర్‌కు చేరుకొని పంప్‌హౌస్ పనులపై సమీక్ష చేపట్టనున్నారు. అనంతరం వట్టెం రిజర్వాయర్‌తో పాటు పంపింగ్ స్టేషన్‌ను పరిశీలించి హైదరాబాద్‌కు తిరిగి చేరుకోనున్నారు.

చిత్రజ్యోతి
SINCE 1965

విభిన్నంగా ఉండాలని చేసిన ప్రయత్నమే హిట్ 3



నాని

'అన్ని సినిమాలూ బాగా ఆడితేనే మన సినిమా కూడా బాగా ఆడుతుంది. అందుకే పరిశ్రమలో ఉన్న ప్రతి ఒక్కరూ అన్ని సినిమాలూ బాగా ఆడాలి అని కోరుకోవాలి. అప్పుడే ఇండస్ట్రీ పచ్చగా ఉంటుంది' అని హీరో నాని అన్నారు. ఆయన కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వం వహించిన చిత్రం 'హిట్ 3'. ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. నేడు ఈ చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా నాని మీడియాతో ముచ్చటించారు.

- నా గత చిత్రాలకూ ఈ సినిమాకు స్పష్టమైన తేడా ఉంది. ఈ సినిమా కథ పూర్తిగా వేరు. మంచి థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్‌ను ఇస్తుంది. 'జెర్సీ, దసరా, హాయ్ నాన్నా' ఇలా నా ప్రతి సినిమా ఓ కొత్త జానర్‌లో ఉండాలని ప్రయత్నించాను. ఆ కోవలోనే విభిన్నంగా ఉండాలని చేసిన మరో ప్రయత్నమే 'హిట్ 3'. ఇందులో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి. ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. టార్గెట్ ఆడియన్స్‌ని మెప్పిస్తే చాలు మా సినిమా కచ్చితంగా బ్లాక్ బస్టర్ అవుతుంది.
- గతంలో 'హిట్' ఫ్రాంచైజీలో వచ్చిన రెండు సినిమాలూ ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్స్. 'హిట్ 3'లో కథాను సారం యాక్షన్‌తో పాటు హింస కూడా చేరింది. అలాగని హింసను గొప్పగా చూపించేందుకు ఈ సినిమా తీయలేదు. కథకు అలా కుదిరింది. 'సలార్' తరహాలో తెరపైన చూస్తున్నప్పుడు ప్రేక్షకుడు ఎంజాయ్ చేసేలా ఉంటుంది.
- శైలేష్ ఎక్కువగా యాక్షన్ సినిమాలు చేస్తున్నాడు కానీ అతని మాటల్లోనే జోకులు పేలుతుంటాయి. ఓ మంచి కామెడీ స్క్రిప్ట్ రాయమని చెప్పాను. మిక్కీ జే మేయర్ ఇప్పటివరకూ ఫీల్ గుడ్ మూవీస్‌కు మాత్రమే పనిచేశాడు. థ్రిల్లర్స్‌కు పనిచేయలేదు. ఆయన ఒక వేళ థ్రిల్లర్ చేస్తే ఆ సౌండింగ్ కొత్తగా ఉంటుంది. ఆయన అందించిన నేపథ్య సంగీతం ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇస్తుంది. శ్రీనిధి అద్భుతంగా నటించారు. ఆమె నటన ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ.

పండగ పేరుతో శర్వా కొత్త సినిమా



శర్వానంద్ కథానాయకుడిగా సంపత్ నంది దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. కేకే రాధామోహన్ నిర్మిస్తున్నారు. 1960ల కాలంలో ఉత్తర తెలంగాణ, మహారాష్ట్ర ప్రాంతాల నేపథ్యంలో సాగనుందీ పీరియాడిక్ యాక్షన్ డ్రామా. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి హీరోయిన్స్. బుధవారం ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేస్తూ 'స్పార్క్' అనే కాన్సెప్ట్ వీడియో విడుదల చేశారు. టైటిల్ 'భోగి'. రెగ్యులర్ షూటింగ్‌ను మొదలుపెట్టినట్లు ప్రకటించారు. ఇందులో మునుపెన్నడూ చూడనంత శక్తిమంతమైన పాత్రలో శర్వా కనిపించనున్నట్లు మేకర్స్ తెలిపారు.

ప్రేమలో కొత్త కోణాన్ని స్పృశిస్తూ



యువతీ యువకుల ప్రేమలో కొత్త కోణాన్ని స్పృశిస్తూ దర్శకుడు భాను ఓ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇంకా టైటిల్ ఖరారు కాలేదు. జూన్‌లో ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామని నిర్మాణసంస్థ ఐబీఎం ప్రొడక్షన్స్ పేర్కొంది. నిర్మాత కనకదుర్గారావు పప్పుల మాట్లాడుతూ 'ఇప్పటివరకూ సందేశం, సామాజిక స్పృహతో సినిమాలు చేసిన దర్శకుడు భాను తొలిసారి ఓ స్వచ్ఛమైన ప్రేమకథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు' అని తెలిపారు. 'ప్రథమార్థం అంతా వినోదాత్మకంగా, ఉల్లాసంగా నడుస్తుంది, ద్వితీయార్థంలో పతాక సన్నివేశాల్లో భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి' అని దర్శకుడు తెలిపారు.

అల్లు అర్జున్‌కు జోడీగా?



అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. అల్లు అర్జున్ పుట్టినరోజున ప్రకటించిన ఈ సినిమా వర్కింగ్ టైటిల్ 'ఏఏ 22.. అట్లీ 6'. భారీ బడ్జెట్‌తో రూపొందనున్న ఈ సినిమాలో ముగ్గురు కథానాయికలు నటించనున్నారు. ఇప్పటికే జాన్వీ కపూర్, మృణాల్ ఠాకూర్‌ను ఫైనల్ చేసినట్లు సమాచారం. మరో కథానాయికగా 'లైగర్' ఫేమ్ అనన్యా పాండేను ఎంపిక చేసినట్లు టాక్. ఈ సినిమాలో నటించడానికి మేకర్స్ అనన్యను సంప్రదించగా, ఆమె గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది.

యాక్షన్ థ్రిల్లర్



పూర్వజ్ కథానాయకుడిగా నటిస్తూ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'కిల్లర్'. జ్యోతిపూర్వజ్ కథానాయిక. పూర్వజ్, ప్రజయ్ కామత్, పద్మనాభరెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ సినిమా గ్లింప్స్‌ను విడుదల చేశారు. విజువల్స్ యాక్షన్, సంభాషణలు ఆకట్టుకున్నాయి. ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను త్వరలోనే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

పీరియాడిక్ క్రైమ్ డ్రామా



దీక్షిత్ శెట్టి, శశి ఓదెల, యుక్తి తరేజ కీలకపాత్రలు పోషిస్తున్న చిత్రం 'కింగ్-జాకీ-క్వీన్'. కేకే దర్శకత్వంలో ఎస్‌ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. 1990 నేపథ్యంలో సాగే పీరియాడిక్ క్రైమ్ డ్రామా ఇది. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో హీరో నాని 'కింగ్-జాకీ-క్వీన్' టీజర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దీక్షిత్‌శెట్టి మాట్లాడుతూ 'తెలుగు ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఆదరిస్తున్నారు. 'దసరా' చిత్రం తర్వాత మళ్లీ ఆ సినిమాను నిర్మించిన ప్రొడక్షన్ హౌస్‌లోనే నా తదుపరి చిత్రం చేయడం ఆనందాన్నిచ్చింది. ఈ సినిమా మీ అందరికీ నచ్చుతుంది' అన్నారు. 'ఈ సినిమా గురించి నేను చెప్పడం కన్నా తెరపైన చూసినప్పుడు మీరు మరింత ఎగ్జైటింగ్‌గా ఫీలవుతారు' అని కేకే చెప్పారు.

కొనుగోళ్లలో అదే జోరు!

అక్షయ తృతీయ బంగారం విక్రయాల్లో 35% వృద్ధి.. పరిమాణం మాత్రం గత ఏడాది స్థాయిలోనే: జీజేసీ

న్యూఢిల్లీ: బంగారం.. భారతీయ సంప్రదాయంలో ఒక భాగం. పండగలు, పెళ్లిళ్లకు ఎంతో కొంత పసిడి కొనుగోలు చేయడం మనోళ్ల ఆనవాయితీ. ముఖ్యంగా అక్షయ తృతీయకు బంగారం, వెండి వంటి విలువైన లోహాలు కొనుగోలు చేస్తే బాగా కలిసివస్తుందని హిందువులు భావిస్తారు. గత ఏడాది కాలంలో బంగారం ధరలు వేగంగా పెరుగుతూ ప్రస్తుతం తులం బంగారం రూ.లక్షకు చేరువలో ఉంది. అయినప్పటికీ, ఈ అక్షయ తృతీయ నాడు బంగారం, వెండి కొనుగోళ్లు చురుగ్గానే సాగాయని ఆభరణాల వర్తకులు చెబుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సారి దేశవ్యాప్తంగా విక్రయాల విలువలో 35 శాతం వరకు వృద్ధి నమోదు కావచ్చని ఆల్ ఇండియా జెమ్ అండ్ జువెలరీ డొమెస్టిక్ కౌన్సిల్ (జీజేసీ) అంచనా వేసింది. విక్రయాల పరిమాణం మాత్రం గత ఏడాదిలాగే 20 టన్నుల స్థాయిలో ఉండవచ్చని అసోసియేషన్ చైర్మన్ రాజేశ్ రోక్డే అన్నారు. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల బంగారం బుధవారం రూ.98,550 పలికింది. గత ఏడాది ఇదే పండుగ రోజున ధర రూ.72,300గా ఉంది. అంటే బంగారం ధర గత ఏడాది కాలంలో 36.30 శాతం మేర పెరిగితే 2020 ఏప్రిల్‌తో పోలిస్తే 100 శాతానికి పైగా పెరిగింది.



పాత బంగారం మార్చుకున్నారు..

దక్షిణాదిలో అక్షయ తృతీయ కొనుగోళ్లు ఉదయం నుంచే పెరిగాయని.. ఉత్తరాదిలో మాత్రం సాయంత్రానికి ఊపందుకున్నాయని జీజేసీ పేర్కొంది. పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఈ సారి అనూహ్యంగా మంగళ సూత్రాలు, చైన్లతోపాటు వెండి పాత్రలకు డిమాండ్ అధికంగా కన్పించిందని రాజేశ్ రోక్డే తెలిపారు. వినియోగదారులు తమ అవసరం లేదా బడ్జెట్‌కు అనుగుణంగా ఆభరణాలు, నాణేలు, కడ్డీలు కొనుగోలు చేశారన్నారు. ఈసారి యువత కూడా కొనుగోళ్లకు ఆసక్తి చూపారన్నారు. కాగా, 50 శాతం కొనుగోళ్లలో వినియోగదారులు తమ పాత బంగారాన్ని మార్చుకున్నారని పీఎన్‌జీ జువెలర్స్ చైర్మన్ సౌరభ్ గాడ్గిల్ అన్నారు.

మొత్తం బిజినెస్ రూ.16,000 కోట్లు

ఈ సారి రూ.12,000 కోట్ల విలువైన 12 టన్నుల బంగారం, రూ.4,000 కోట్ల విలువైన 400 టన్నుల వెండి విక్రయాలు జరగవచ్చని ది కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ అంచనా వేసింది.

హైదరాబాద్‌లో మిశ్రమ స్పందన

హైదరాబాద్ సిటీ(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది అక్షయ తృతీయకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆభరణ విక్రయాల్లో మిశ్రమ స్పందన కన్పించింది. అధిక ధరల కారణంగా బంగారం కొనుగోలుకు ఎక్కువ మంది ఆసక్తి చూపలేదని సికింద్రాబాద్‌కు చెందిన బంగారం వ్యాపారి ప్రతాప్ తెలిపారు. షాపులను సందర్శించిన కస్టమర్లలోనూ అధిక శాతం చిన్న మొత్తాల్లో కొనుగోళ్లు జరిపారని, వెండి కొనుగోలుకు ప్రాధాన్యమిచ్చారన్నారు. ఇక అధిక మొత్తంలో బంగారం కొనుగోళ్లలోనూ వివాహ సంబంధిత జువెలరీనే అధికమని పేర్కొన్నారు.

కాస్త దిగొచ్చిన బంగారం

అక్షయ తృతీయ నాడు పసిడి ధరలు కాస్త దిగివచ్చాయి. ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (99.9 శాతం స్వచ్ఛత) బంగారం ధర రూ.900 తగ్గి రూ.98,550కి పరిమితమైంది. 99.5 శాతం స్వచ్ఛత లోహం సైతం అదే స్థాయిలో తగ్గి రూ.98,100 పలికింది. కిలో వెండి మాత్రం ఏకంగా రూ.4,000 తగ్గుదలతో రూ.98,000కు జారుకుంది. అంతర్జాతీయంగా ఈ విలువైన లోహాల ధరలు గణనీయంగా తగ్గడమే ఇందుకు కారణం. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ 1.31 శాతం జారి 3,273.90 డాలర్ల స్థాయికి పడిపోగా.. సిల్వర్ 32.33 డాలర్ల వద్ద ట్రేడైంది.

మార్చి త్రైమాసికంలో తగ్గిన డిమాండు

న్యూఢిల్లీ: అధిక ధరలు బంగారం గిరాకీకి గండికొట్టాయని ప్రపంచ స్వర్ణ మండలి (డబ్ల్యూజీసీ) తాజా నివేదిక పేర్కొంది. బుధవారం విడుదల చేసిన నివేదిక ప్రకారం.. ఈ ఏడాది మార్చి త్రైమాసికానికి భారత్‌లో పసిడి డిమాండ్ 15 శాతం తగ్గి 118.1 టన్నులకు పడిపోయింది. అధిక ధరల ప్రభావంతో విలువ మాత్రం 22 శాతం పెరిగి రూ.94,030 కోట్లుగా నమోదైంది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు బంగారం రేటు 25 శాతం ఎగబాకడమే ఇందుకు కారణం. ఒకదశలో 10 గ్రాముల ధర రూ.లక్ష దాటింది. ఇది బంగారం కొనుగోళ్లపై ప్రభావం చూపిందని నివేదిక అభిప్రాయపడింది. కాగా, ఈ ఏడాది భారత్‌లో పసిడి గిరాకీ 700-800 టన్నుల స్థాయిలో నమోదు కావచ్చని డబ్ల్యూజీసీ అంచనా వేసింది.

కోరమాండల్ లాభం రూ.578 కోట్లు

న్యూఢిల్లీ: కోరమాండల్ ఇంటర్నేషనల్ ఈ ఏడాది మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికానికి రూ.578.46 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.163.92 కోట్లతో పోలిస్తే ఇది మూడింతల కంటే ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ స్థూల ఆదాయం 28.72 శాతం పెరిగి రూ.6,114.34 కోట్లకు చేరింది. ఆర్థిక సంవత్సరం మొత్తానికి చూసినా కంపెనీ రూ.2,054.71 కోట్ల నికర లాభం ఆర్జించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 25.23 శాతం ఎక్కువ. అధిక అమ్మకాలు, మెరుగైన నిర్వహణా సామర్థ్యం, వ్యూహాత్మక నిర్ణయాలతో గత ఆర్థిక సంవత్సరం మంచి పనితీరు సాధ్యమైందని కంపెనీ ఎండీ, సీఈఓ ఎస్ శంకర సుబ్రమణియన్ చెప్పారు.

కాకినాడ ప్లాంట్ విస్తరణ: కాకినాడలోని ప్లాంట్‌ను కోరమాండల్ ఇంటర్నేషనల్ విస్తరిస్తోంది. ఇక్కడ కొత్తగా ఫాస్ఫారిక్ యాసిడ్, సల్ఫ్యూరిక్ యాసిడ్ యూనిట్లు ఏర్పాటు చేస్తోంది. ఈ యూనిట్లు వచ్చే ఏడాదికల్లా ఉత్పత్తి ప్రారంభిస్తాయని సుబ్రమణియన్ చెప్పారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



1వ తేదీ			
హైదరాబాద్	430	విజయవాడ	445
వరంగల్	432	గోదావరి	430
చిత్తూరు	503	విశాఖపట్నం	435
		దజను గుడ్లు రూ. 60	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	127
వరంగల్	125	గుంటూరు	125
కరీంనగర్	125	ఒంగోలు	125
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	92
కర్నూలు	125	నెల్లూరు	97
విశాఖపట్నం	121	అనంతపురం	97
గోదావరి	127		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,910 ▼	89,750 ▼	1,09,000 ▼
విజయవాడ	98,600 ▼	92,500 ▼	99,000 ▼
విశాఖపట్నం	97,240 ▼	89,750 ▼	1,09,000 ▼
రాజమండ్రి	97,960 ▲	89,800 ▲	99,300 ▲
ప్రొద్దుటూరు	97,400 ▼	89,610 ▼	98,800 ▼
ముంబై	94,360 ▼	86,440 ▼	94,110 ▼

ట్రంప్ దెబ్బకు జీడీపీ కుదేలు

మార్చి త్రైమాసికంలో మైనస్ 0.3%

వాషింగ్టన్: అధ్యక్షుడు ట్రంప్ సుంకాల యుద్ధం అమెరికాకే ఎసరు పెడుతోంది. దీంతో ఈ ఏడాది మార్చి త్రైమాసికంలో అమెరికా జీడీపీ వృద్ధిరేటు మైనస్ 0.3 శాతానికి పడిపోయింది. ట్రంప్ సుంకాల పోటు తప్పించుకునేందుకు అమెరికా కంపెనీలు పెద్ద ఎత్తున దిగుమతులకు దిగడం ఇందుకు ప్రధాన కారణం. గత ఏడాది డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో అమెరికా జీడీపీ 2.4 శాతం వృద్ధిని నమోదు చేసింది. ట్రంప్ సుంకాల పుణ్యమాని అది మార్చి నాటికి మైనస్ 0.3 శాతానికి తిరోగమించింది. వరుసగా జూన్ త్రైమాసికంలోనూ అమెరికా జీడీపీ వృద్ధి రేటు మైనస్‌లోకి పోతే అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి జారుకున్నట్టే.

భారత్‌తో త్వరలోనే వాణిజ్య ఒప్పందం

భారత్‌తో త్వరలోనే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం (బీటీఏ) కుదరనుందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఇందుకోసం రెండు దేశాల మధ్య జరుగుతున్న చర్చలు దాదాపుగా ఒక కొలిక్కి వచ్చాయన్నారు. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ చేసిన వ్యాఖ్యలూ ఈ విషయాన్ని మరింత బలపరుస్తున్నాయి. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి అమెరికా అతి చేరువలో ఉందని ఆయన విలేకరులతో చెప్పారు. దీంతో జూలై 9లోపే అమెరికా-భారత్ మధ్య బీటీఏ కుదిరే సూచనలు కనిపిస్తున్నాయి. తాను విధించిన సుంకాలకు ట్రంప్ 90 రోజుల పాటు విరామం ప్రకటించారు. ఆ గడువు జూలై 9తో ముగుస్తుంది. ఈ లోపే బీటీఏ పూర్తి చేసి అమలు చేసేందుకు రెండు దేశాలు చర్చలు ముమ్మరం చేశాయి.

మన ఐటీకి మేలే : రోష్ని నాడార్

ట్రంప్ సుంకాలతో భారత ఐటీ కంపెనీలకు మేలే జరుగుతుందని హెచ్‌సీఎల్ గ్రూపు చైర్‌పర్సన్ రోష్ని నాడార్ మల్‌హోత్రా చెప్పారు. ఈ సుంకాలతో అమెరికాలో ద్రవ్యోల్బణం పెరిగి కంపెనీలు తమ ఖర్చులు తగ్గించుకునేందుకు ప్రయత్నిస్తాయన్నారు. అది భారత ఐటీ కంపెనీలకు అవకాశంగా మారే అవకాశం ఉందన్నారు.

స్వల్ప నష్టాల్లో మార్కెట్

నేడు సెలవు
మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా మార్కెట్‌కు గురువారం సెలవు. ఈక్విటీ, ఫారెక్స్ కమోడిటీ మార్కెట్లు పని చేయవు.

ముంబై: భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలు, బజాజ్ ద్వయం షేర్లలో అమ్మకాల ఒత్తిడి నేపథ్యంలో బుధవారం ఈక్విటీ మార్కెట్ తీవ్ర ఆటుపోట్లతో ట్రేడయింది. చివరికి సూచీలు స్వల్ప నష్టాల్లో ముగిశాయి. అయితే విదేశీ నిధుల రాకలో నిలకడగా కారణంగా నష్టాలు పరిమితం అయ్యాయి. సెన్సెక్స్ 46.14 పాయింట్ల నష్టంతో 80,242.24 వద్ద ముగియగా నిఫ్టీ 1.75 పాయింట్ల నామ మాత్రపు నష్టంతో 24,334.20 వద్ద ముగిసింది.

మరో 42 పైసలు లాభపడిన రూపాయి: ఫారెక్స్ మార్కెట్లో రూపాయి మరింత బలపడింది. అమెరికన్ డాలర్ మారకంలో రూపాయి గురువారం 42 పైసలు లాభపడి 84.54 వద్ద ముగిసింది.

ఎన్‌సీసీకి రూ.1,663 కోట్ల ఆర్డర్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మౌలిక వసతుల రంగంలోని ఎన్‌సీసీ లిమిటెడ్ ఏప్రిల్ నెలలో రూ.1663 కోట్ల విలువ గల (జీఎస్‌టీ మినహా) ఆర్డర్లు సాధించింది. వాటిలో రూ.1082 కోట్లు భవనాల డివిజన్‌కు దక్కగా రూ.581 కోట్లు రవాణా విభాగానికి దక్కాయి.

మార్కెట్లోకి రూ.6 కోట్ల లంబోర్గినీ కారు



న్యూఢిల్లీ: సూపర్ స్పోర్ట్స్ కార్ల తయారీ సంస్థ లంబోర్గినీ బుధవారం భారత మార్కెట్లోకి టెమెరారియో పేరుతో కొత్త కారును ప్రవేశపెట్టింది. ట్విన్ టర్బో వీ8 హైబ్రిడ్ పవర్‌ట్రెయిన్ ఇంజన్‌తో కూడిన దీని ధర రూ.6 కోట్లు. ఈ కారు గరిష్ఠంగా గంటకు 343 కి.మీ వేగంతో దూసుకెళ్లగలదని, గంటకు సున్నా నుంచి 100 కి.మీ వేగాన్ని కేవలం 2.7 సెకన్లలో అందుకోగలదని కంపెనీ తెలిపింది.

సిగ్ని ఎనర్జీ ప్లాంట్ ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దేశంలో అతి పెద్దదైన స్వతంత్ర ఇంధన స్టోరేజ్ సొల్యూషన్ల కంపెనీ సిగ్ని బుధవారం ఆటోమేటెడ్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ (బీఈఎస్ఎస్) గిగా ఫ్యాక్టరీని ప్రారంభించింది. మహేశ్వరంలోని ఎలక్ట్రానిక్స్ తయారీ క్లస్టర్‌లో (ఈఎంసీ) ఏర్పాటైన దేశంలోనే తొలి లీడ్ (లీడర్‌షిప్ ఇన్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంటల్ డిజైన్) అర్హత సాధించిన ఈ ఫ్యాక్టరీని తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ముఖ్యమంత్రి కార్యాలయంలో పరిశ్రమలు, పెట్టుబడుల విభాగం సీఈఓ జయేశ్ రంజన్ ప్రారంభించారు. రూ.100 కోట్ల పెట్టుబడితో 1.6 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో తొలి దశ నిర్మాణం జరిగింది. ఈ ఫ్యాక్టరీలో రాబోయే 24 నెలల్లో వెయ్యి మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని సీఈఓ వెంకట్ రాజారామన్ ప్రకటించారు.

మేడ్చల్‌లో లోహియా గ్రూప్ బిస్కట్ ఫ్యాక్టరీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): వివిధ రంగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న లోహియా గ్రూప్ తెలంగాణలోని మేడ్చల్‌లో అత్యాధునిక బిస్కట్ తయారీ ప్లాంట్‌ను ప్రారంభించింది. ప్రపంచ ప్రమాణాలకు దీటుగా అత్యాధునిక టెక్నాలజీతో ఈ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసినట్టు లోహియా కన్ఫెక్షనరీ మేనేజింగ్ డైరెక్టర్ మనీషా లోహియా లహోటి చెప్పారు. ఏడెకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన పూర్తి ఆటోమేటెడ్ హైస్పీడ్ ఫ్యాక్టరీ సామర్థ్యం నెలకి వెయ్యి టన్నులని ఆమె తెలిపారు. రూ.300 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ ఫ్యాక్టరీలో 2 వేల మందికి ప్రత్యక్ష ఉపాధి, 4 వేల మందికి పరోక్ష ఉపాధి లభిస్తుందని ఆమె అన్నారు.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్ — వేదిక జైపూర్
రాజస్థాన్ x ముంబై — రా.7.30 నుంచి

అవును.. విడిపోయాం

ఏడాదిన్నర క్రితమే విడాకులు తీసుకున్నాం
హితేష్ చౌధరితో వ్యాపార సంబంధమే
బాక్సర్ మేరీ కోమ్



2005లో పెళ్లి

మేరీ, కరుంగ్ 2005లో పెళ్లి చేసుకున్నారు. వీరికి కవలలు సహా ముగ్గురు కుమారులున్నారు. తర్వాత బాలికను దత్తత తీసుకున్నారు. కాగా 2022లో జరిగిన మణిపూర్ లోకసభ ఎన్నికల్లో మేరీ భర్త పోటీచేసి ఓడిపోయాడు. ఆ ఎన్నికకు 2-3 కోట్ల రూపాయలు ఖర్చయిందట. దీని తర్వాత మేరీ పిల్లల్ని తీసుకుని ఫరీదాబాద్ వెళ్లిపోగా, భర్త ఢిల్లీలోనే ఉంటున్నాడు.

న్యూఢిల్లీ: భర్త కరుంగ్ ఆంఖోలెర్‌తో తాను విడాకులు తీసుకున్నట్టు ఒలింపిక్ పతక విజేత బాక్సర్ మేరీ కోమ్ (42) బుధవారం ప్రకటించింది. డిసెంబరు 20, 2023న ఇరు కుటుంబాలు, గిరిజన మత పెద్దల సమక్షంలో విడాకులు తీసుకున్నట్టు ఆమె తెలిపింది. అంతేకాదు.. వ్యాపారవేత్త, ఓ అంతర్జాతీయ బాక్సర్ భర్త అయిన హితేష్ చౌధరితో తనకు వివాహేతర సంబంధం ఉన్నట్టు వస్తున్న పుకార్లను మేరీ ఖండించింది. మేరీ కోమ్ బాక్సింగ్ ఫౌండేషన్ చైర్మన్ అయిన హితేష్‌తో తనది వ్యాపార సంబంధమేనని స్పష్టంజేసింది. కాగా.. మేరీ వ్యక్తిగత జీవితంపై కొన్నాళ్లుగా మీడియాలో వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆమె న్యాయ బృందం స్పందించింది. ఈమేరకు సుదీర్ఘమైన ప్రకటన విడుదలజేసింది. తప్పుడు సమాచారం వ్యాప్తి చేయకుండా..కోమ్ వ్యక్తిగత గోప్యతను గౌరవించాలని ఆ ప్రకటనలో కోరారు. కాగా తామిద్దరూ కలిసి దిగిన ఫొటోలను మేరీ, హితేష్ తమ సోషల్ మీడియా ఖాతా నుంచి తొలగించారు.

చెన్నై అవుట్

4 వికెట్లతో పంజాబ్ గెలుపు
శ్రేయాస్, ప్రభ్‌సిమ్రన్ అర్ధ శతకాలు
చాహల్ హ్యాట్రిక్



శ్రేయాస్ (72)



చాహల్ (4/32)

చెన్నై: ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) కథ ముగిసింది. ఎనిమిదో ఓటమితో ధోనీ సేన ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించగా.. 13 పాయింట్లతో రెండో స్థానానికి ఎగబాకిన పంజాబ్ కింగ్స్ నాకౌట్‌కు చేరువైంది. యజ్వేంద్ర చాహల్ (3-0-32-4) హ్యాట్రిక్‌కు శ్రేయాస్ అయ్యర్ (41 బంతుల్లో 5 ఫోర్లు, 4 సిక్స్‌లతో 72) అదిరే అర్ధ శతకంతోడు కావడంతో.. బుధవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ 4 వికెట్ల తేడాతో చెన్నైను చిత్తు చేసింది. తొలుత చెన్నై 19.2 ఓవర్లలో 190 పరుగులకు ఆలౌటైంది. సామ్ కర్రాన్ (88), బ్రేవిస్ (32) పోరాడారు. అర్ష్‌దీప్, జాన్సన్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో పంజాబ్ 19.4 ఓవర్లలో 194/6 స్కోరు చేసి నెగ్గింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (54) రాణించాడు. పతిరన, ఖలీల్ చెరో 2 వికెట్లు తీశారు. శ్రేయాస్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

ఆరంభం నుంచే దూకుడు..: ఛేదనలో పంజాబ్‌కు ఓపెనర్లు ప్రియాన్ష్ ఆర్య (23), ప్రభ్‌సిమ్రన్ తొలి వికెట్‌కు 44 పరుగుల భాగస్వామ్యంతో దూకుడైన ఆరంభాన్నిచ్చారు. అయితే, ఐదో ఓవర్‌లో రెండు బౌండ్రీలు బాదిన ఆర్యను ఖలీల్ అవుట్ చేయడంతో.. ఆరు ఓవర్లకు పంజాబ్ 51/1తో నిలిచింది. మధ్య ఓవర్లలో ప్రభ్‌సిమ్రన్, కెప్టెన్ అయ్యర్ రన్‌రేట్ తగ్గకుండా స్కోరు బోర్డును నడిపించారు. అయితే, ప్రభ్‌ను నూర్ క్యాచవుట్ చేయడంతో.. రెండో వికెట్‌కు 72 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌కు తెరపడింది. తర్వాత వధేరా (5)ను పతిరన పెవిలియన్ చేర్చాడు. చివరి 5 ఓవర్లలో పంజాబ్ విజయానికి 52 పరుగులు అవసరం కాగా.. అయ్యర్, శశాంక్ (23) 18 బంతుల్లో 44 పరుగులు జోడించడంతో.. పంజాబ్ మరో 2 బంతులు మిగిలుండగానే గెలిచింది. విజయానికి 3 పరుగుల దూరంలో ఉండగా.. అయ్యర్‌ను పతిరన క్లీన్‌బౌల్డ్ చేశాడు.

చాహల్ మాయాజాలం..: కర్రాన్ ముందుండి నడిపించడంతో చెన్నై భారీ స్కోరు చేసే విధంగా కనిపించినా.. చాహల్ హ్యాట్రిక్‌తో డెత్ ఓవర్లలో ఒక్కసారిగా కుదేలైంది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన చెన్నైకు శుభారంభం దక్కలేదు. ఓపెనర్లు షేక్ రషీద్ (11), ఆయుష్ మాత్రే (7)తోపాటు జడేజా (17) విఫలం కావడంతో.. పవర్‌ప్లేలో 48/3తో మూడు టాపార్డర్ వికెట్లు కోల్పోయిన చెన్నై కష్టాల్లో పడింది. ఈ దశలో కర్రాన్, బ్రేవిస్ నాలుగో వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకొన్నారు. అయితే, జోరుగా సాగుతున్న వీరి భాగస్వామ్యాన్ని ఒమర్జాయ్ విడదీశాడు. 15వ ఓవర్‌లో బ్రేవిస్‌ను ఒమర్జాయ్ బౌల్డ్ చేయగా.. సింగిల్‌తో ఫిఫ్టీ పూర్తి చేసుకొన్న కర్రాన్ ఆ తర్వాత మరింతగా చెలరేగాడు. 16వ ఓవర్‌లో కర్రాన్ ఏకంగా 26 పరుగులు పిండుకోవడంతో.. స్కోరు బోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. అయితే, 172 పరుగుల స్కోరు వద్ద కర్రాన్‌ను జాన్సెన్ అవుట్ చేయడంతో.. చెన్నై ఒక్కసారిగా కుప్పకూలింది. కేవలం 18 పరుగుల తేడాతో మిగతా ఐదు వికెట్లు చేజార్చుకొంది.

ఒకే ఓవర్‌లో 4 వికెట్లు..: అనూహ్యంగా 19వ ఓవర్‌లో బంతిని అందుకొన్న చాహల్.. తన మాయాజాలంతో సీఎస్‌కేను డబుల్ సెంచరీ మార్క్ చేరకుండా దెబ్బకొట్టాడు. రెండో బంతికి ధోనీ (11) క్యాచవుట్ కాగా.. మూడో బంతికి దీపక్ హుడా (2) రెండు పరుగులు తీశాడు. కానీ, నాలుగో బంతికి హుడాను క్యాచవుట్ చేసిన చాహల్.. ఐదో బంతికి అన్షుల్ కాంబోజ్ (0)ను బౌల్డ్ చేసి హ్యాట్రిక్‌పై నిలిచాడు. ఆరో బంతికి షాట్ ఆడేక్రమంలో నూర్ అహ్మద్ (0) అవుట్ కావడంతో.. చాహల్ సంబరాలు చేసుకొన్నాడు.

స్కోరుబోర్డు

చెన్నై: రషీద్ (సి) శశాంక్ (బి) అర్ష్‌దీప్ 11, ఆయుష్ (సి) శ్రేయాస్ (బి) జాన్సెన్ 7, సామ్ కర్రాన్ (సి) ఇంగ్లిస్ (బి) జాన్సెన్ 88, జడేజా (సి) ఇంగ్లిస్ (బి) హర్‌ప్రీత్ 17, బ్రేవిస్ (బి) అజ్మతుల్లా 32, దూబే (సి) శశాంక్ (బి) అర్ష్‌దీప్ 6, ధోనీ (సి) వధేరా (బి) చాహల్ 11, హుడా (సి) ప్రియాన్ష్ (బి) చాహల్ 2, అన్షుల్ (బి) చాహల్ 0, నూర్ (సి) జాన్సెన్ (బి) చాహల్ 0, ఖలీల్ (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 16; మొత్తం: 19.2 ఓవర్లలో 190 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-21, 2-22, 3-48, 4-126, 5-172, 6-184, 7-186, 8-186, 9-186, 10-190; **బౌలింగ్:** అర్ష్‌దీప్ 3.2-0-25-2, జాన్సెన్ 4-0-30-2, అజ్మతుల్లా 4-0-39-1, హర్‌ప్రీత్ 2-0-21-1, చాహల్ 3-0-32-4, సూర్యాంశ్ 3-0-40-0.

పంజాబ్: ప్రియాన్ష్ (సి) ధోనీ (బి) ఖలీల్ 23, ప్రభ్‌సిమ్రన్ (సి) బ్రేవిస్ (బి) నూర్ 54, శ్రేయాస్ (బి) పతిరన 72, వధేరా (సి) జడేజా (బి) పతిరన 5, శశాంక్ (సి) బ్రేవిస్ (బి) జడేజా 23, ఇంగ్లిస్ (నాటౌట్) 6, సూర్యాంశ్ (సి) నూర్ (బి) ఖలీల్ 1, జాన్సెన్ (నాటౌట్) 4, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 19.4 ఓవర్లలో 194/6; వికెట్ల పతనం:** 1-44, 2-116, 3-136, 4-180, 5-188, 6-190; **బౌలింగ్:** ఖలీల్ 3.4-0-28-2, అన్షుల్ 2-0-20-0, జడేజా 3-0-32-1, నూర్ అహ్మద్ 4-0-39-1, కర్రాన్ 3-0-27-0, పతిరన 4-0-45-2.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
బెంగళూరు	10	7	3	0	14	0.521
పంజాబ్	10	6	3	1	13	0.199
ముంబై	10	6	4	0	12	0.889
గుజరాత్	9	6	3	0	12	0.748
ఢిల్లీ	10	6	4	0	12	0.362
లఖ్‌నవూ	10	5	5	0	10	-0.325
కోల్‌కతా	10	4	5	1	9	0.271
రాజస్థాన్	10	3	7	0	6	-0.349
హైదరాబాద్	9	3	6	0	6	-1.103
చెన్నై	10	2	8	0	4	-1.211

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

'అజర్' పేరును తొలగించొద్దు

అంబుడ్స్‌మన్ ఆదేశాలపై హైకోర్టు స్టే

హైదరాబాద్: టీమిండియా మాజీ కెప్టెన్, హెచ్‌సీఏ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అజరుద్దీన్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఉప్పల్ స్టేడియం నార్త్ స్టాండ్‌కు ఉన్న అజరుద్దీన్ పేరును తొలగించాలంటూ హెచ్‌సీఏ అంబుడ్స్‌మన్ ఇచ్చిన ఆదేశాలపై హైకోర్టు స్టే విధించింది. తదుపరి ఆదేశాలిచ్చేవరకూ ఎలాంటి చర్యలూ చేపట్టవద్దని పేర్కొంది. హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో అజర్ నిబంధనలు ఉల్లంఘించి ఓ స్టాండ్‌కు తన పేరు పెట్టుకొన్నట్టు లార్డ్స్ క్రికెట్ క్లబ్.. ఎథిక్స్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేసింది. విచారించిన అంబుడ్స్‌మన్ పరస్పర విరుద్ధ ప్రయోజనాల కింద స్టాండ్‌కు ఉన్న అజర్ పేరును తొలగించాలని ఆదేశించారు. ఈ నిర్ణయాన్ని అజర్ హైకోర్టులో సవాల్ చేశాడు.

హెచ్‌సీఏకు ఊరట

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ క్రికెట్ సంఘానికి హైకోర్టులో ఊరట లభించింది. రోజువారీ ఖర్చులు, ఉద్యోగుల వేతనాల చెల్లింపులు తప్ప ఆర్థికపరమైన అంశాలతో ముడిపడి ఉన్న పరిపాలన, విధానపరమైన నిర్ణయాలేవీ తీసుకోరాదని హెచ్‌సీఏకు హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై డివిజన్ బెంచ్ బుధవారం స్టే విధించింది. హెచ్‌సీఏ నిధుల దుర్వినియోగానికి పాల్పడిందని.. దీనిపై సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని పేర్కొంటూ తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై ఏకసభ్య ధర్మాసనం ఈనెల 21న విచారణ చేపట్టి.. హెచ్‌సీఏ ఆర్థిక విధానపరమైన నిర్ణయాలు తీసుకోవద్దని మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన సంగతి తెలిసిందే.

బాక్సింగ్‌లో అమ్మాయిలు అదుర్స్

అమ్మాన్ (జోర్డాన్): ఆసియా జూనియర్ చాంపియన్‌షిప్‌లో భారత బాక్సర్లు అదరగొట్టారు. ఒక్క అండర్-15 విభాగంలోనే 25 పతకాలు కొల్లగొట్టారు. ఇందులో అమ్మాయిలు సాధించిన పది స్వర్ణాలు, నాలుగు కాంస్యాలు ఉండడం విశేషం. ఫైనల్ చేరిన ప్రతి కేటగిరిలోనూ అమ్మాయిలు విజేతగా నిలిచారు. బాలుర కేటగిరి నుంచి ఓ స్వర్ణం, 3 రజతాలు, 7 కాంస్యాలు లభించాయి.

ప్రజ్ఞానందకు మూడో స్థానం

వార్సా: గ్రాండ్ చెస్ టూర్ సూపర్ బెట్ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద మూడో స్థానంలో నిలిచాడు. బ్లిట్జ్ విభాగంలో 7 రౌండ్లలో ఓడిన ప్రజ్ఞానంద (20.5 పాయింట్లు) మూడో స్థానంతో సరిపెట్టుకున్నాడు. రష్యన్ గ్రాండ్ మాస్టర్ వ్లాదిమిర్ ఫెడోసీవ్ (26.5) విజేతగా నిలిచాడు. మరో భారత జీఎం అరవింద్ చిదంబరం (17) 8వ స్థానంలో నిలిచాడు.

బంగ్లా ఇన్నింగ్స్ గెలుపు

చట్టోగ్రామ్: మెహిదీహసన్ మిరాజ్ (104, 5/32) సూపర్ షోతో.. జింబాబ్వేతో రెండో, ఆఖరి టెస్టులో బంగ్లాదేశ్ ఇన్నింగ్స్ 106 పరుగుల తేడాతో గెలిచింది. మరో రెండు రోజుల ఆట మిగిలుండగానే నెగ్గిన బంగ్లా.. రెండు టెస్టుల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. ఆటకు మూడోరోజైన బుధవారం ఓవర్‌నైట్ స్కోరు 291/7తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన బంగ్లా 444 రన్స్‌కు ఆలౌటైంది. జింబాబ్వే తొలిఇన్నింగ్స్ స్కోరు 227కు.. 217 పరుగుల ఆధిక్యం సాధించింది. అనంతరం జింబాబ్వే రెండో ఇన్నింగ్స్‌లో 111 రన్స్‌కే కుప్పకూలింది.



రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్టు సభ్యులు రజత్ పటీదార్ (కెప్టెన్), జితేష్ శర్మ, మహిళా క్రికెటర్ శ్రేయాంక పాటిల్ బుధవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

మితిమీరిన ప్రశంసలే సమస్య

» వైభవ్ స్టార్‌డమ్‌పై ద్రవిడ్

న్యూఢిల్లీ: 14 ఏళ్ల క్రికెట్ సంచలనం వైభవ్ సూర్యవంశీపై మీడియా అతిగా దృష్టి సారించడం మంచిది కాదని రాజస్థాన్ కోచ్ రాహుల్ ద్రవిడ్ హితవు పలికాడు. ఒక ఇన్నింగ్స్‌తో తనకు వచ్చిన స్టార్‌డమ్‌ను తట్టుకొనేందుకు అతడు మార్గాలు కనుగొనాల్సి ఉంటుందన్నాడు. క్రికెట్ ప్రపంచమూ ఇకపై వైభవ్‌ను విస్మరించే పరిస్థితి ఉండదని ద్రవిడ్ స్పష్టం జేశాడు. కాగా భయం లేకుండా బ్యాటింగ్ చేయడమే వైభవ్ ప్రత్యేకతని అతడు ప్రశంసించాడు. ఆ వయస్సులో అలా ఆడే ఆటగాడిని చూడలేమని అన్నాడు. 'బ్యాట్‌ను వేగంగా కదపడమే అతడి పవర్. సూర్యవంశీ బ్యాక్‌లిఫ్ట్, చేతికి, కంటికి మధ్య సమన్వయం అమోఘం' అని విశ్లేషించాడు.

ధోనీ రిటైరైతే బెటర్!

గిల్‌క్రిస్ట్ సలహా

న్యూఢిల్లీ: ధోనీ.. ఐపీఎల్‌ను వీడాల్సిన సమయం ఆసన్నమైందని ఆస్ట్రేలియా మాజీ వికెట్‌కీపర్ ఆడమ్ గిల్‌క్రిస్ట్ అన్నాడు. 'ఆటలో మహీ నిరూపించుకోవడానికి ఏమీ లేదు. అతడు అన్నీ సాధించేశాడు. ఎటువంటి నిర్ణయం తీసుకోవాలో అతడికి బాగా తెలుసు. కానీ, వచ్చే ఏడాదికి అతడు ఆడాల్సిన అవసరం లేదనేది నా అభిప్రాయం. ధోనీ.. నువ్వే దిగ్గజానివి. నా ఆటంటే నాకెంతో ఇష్టం' అని గిల్లీ కొనియాడాడు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **N. Rahul Kumar**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.